Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 62 • సంచిక: 23 • శుక్రవారం 2 ఫిబ్రవరి 2018 • విజయవాడ • పేజీలు: 16 • వెల: 5.00
Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



ఆయుష్మాన్ భారతంలో జై కిసాన్!

ఓట్ల బాట..!

జైట్లీ బడ్జెట్‌కు ఐఎంఎఫ్ మెచ్చుకోలు

• బడ్జెట్ రూ.21.57 లక్షల కోట్లు • వ్యవసాయ రుణాలు రూ.11 లక్షల కోట్లు • అనుబంధ రంగాలకు రూ.10 వేల కోట్లు • ఆక్వా రైతులు, జాలర్లకు కిసాన్ క్రెడిట్‌కార్డులు • కొత్తగా చేనుకు నీరు • 42 మెగా ఫుడ్‌పార్క్స్ • పంటలకు మద్దతు ధర • ఉద్యాన పంటలకు చేయూత • 5లక్షల గ్రామాలకు వైఫై

50కోట్ల మంది పేదలకు మోడీ కేర్ • రూ.5 లక్షల ఆరోగ్యబీమా • 10 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్యం • భారత్ ఆయుష్మాన్ భవ పథకం • 24 మెడికల్ కాలేజీలు • 1.5 లక్షల వెల్‌నెస్ సెంటర్లు • 8కోట్ల మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్స్ • రూ.3లక్షల కోట్లతో ముద్రబ్యాంక్ రుణాలు

వివరాలు లోపలి పేజీల్లో...

వరాల వెల్లువ (వ రా ల వె ల్లు వ)

అనుకున్నట్టే మోడీ ఓట్ల బాట పట్టారు! ఏం చేయాలన్నా ముందు అధికారం ఉండాలి కదా అన్న ధోరణి కనిపించింది. వంద కోట్ల మందికి పైగా సామాన్య జనానికి బడ్జెట్‌ను అంకితం ఇచ్చేశారు. పల్లె బాట పట్టి వ్యవసాయ రంగానికి భారీ వరాల వర్షం కురిపించారు. బడ్జెట్‌లో 40 శాతం గ్రామీణ భారతానికే కేటాయించారు. రుణాలతో పాటు పంటలకు గిట్టుబాటు ధరలను తామే ఇచ్చి కొంటామన్నారు. ఆక్వా, పాడి, హార్టీ కల్చర్‌కు భారీ ప్రోత్సాహకాలిచ్చారు. వందల కోట్లతో మెగా ఫుడ్‌పార్కులను పెడుతున్నారు. మహిళా సంఘాలకు రూ.75 వేల కోట్ల రుణాలను ప్రకటించారు. రూ.3 వేల కోట్లతో మహిళలకు ముద్రాబ్యాంకు రుణాలిస్తామన్నారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు ఆన్‌లైన్‌లోనే రుణాల మంజూరుకు అవకాశం కల్పించారు. 8 లక్షల మంది మహిళలకు గ్యాస్ కనెక్షను ఉచితంగా ఇస్తున్నారు. ప్రపంచంలోనే అతి పే...ద్ద ఆరోగ్య బీమా భారత్ ఆయుష్మాన్‌భవతో 100 కోట్ల మంది పేద, మధ్యతరగతిని ఆకర్షించారు. ...వచ్చే ఎన్నికల్లో ఓట్ల సాధనకు ఇంకేం కావాలి..?!

నేతిబీరచందం (నే తి బీ ర చం దం)

అధికారదాహంతో మోడీ దేశ అభ్యున్నతిని పెడచెవినపెట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ భారతానికి ప్రకటించిన వరాలన్నీ కంటితుడుపేనన్నది వారి వాదన! ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు తగ్గించలేదు. సేంద్రీయ వ్యవసాయానికి పెద్దగా ప్రోత్సాహమే లేదు. క్రెడిట్ కార్డులంటే జేబులో నిప్పురవ్వేనని అందరికీ తెలుసు! రుణాల లక్ష్యం ఆర్భాటమే కాని, ఆచరణలో బ్యాంకులివ్వడం లేదన్నది వాస్తవం. గిట్టుబాటు ధరలు ప్రకటనల వరకే పరిమితమయ్యాయి. ఉద్యోగవర్గాల్లోనూ అదే అసంతృప్తి! ఆదాయ శ్లాబుల్లో మార్పులేకపోవడం నిరుత్సాహకరమే... విద్య, వైద్య సెస్సు నాలుగు శాతానికి పెంపుతో ధరల పెరుగుదల ఖాయం... ఆరోగ్య పరిరక్షణ చర్యలేంటో చెప్పకుండా జబ్బుచేస్తే బీమా ఉచితం అని చెప్పడం విడ్డూరం! ఏటా లక్షలాది ఇంజినీర్లు బయటకు వస్తుంటే కేవలం వెయ్యి మందికే ప్రధాని ఉపకారవేతనం ప్రకటించడం దారుణం. ఉద్యోగాల కల్పన ఊసే లేదు. సేవా, ఉపాధి రంగాల్లో సరైన ప్రణాళికలను ప్రకటించలేదు... ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయం!




బడ్జెట్ జనహితం

• గ్రామీణ భారతానికి ఊతం

అన్నీ ఫ్యాన్సీ పథకాలే!



• యువతకు ఉద్యోగాలు కరవు





ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపుతో
పెట్రో మంటకు ఊరట

• ఉద్యోగులకు రవాణా, మెడికల్ రాయితీలు • విద్యా రుణాలు పెంపు • విద్య సెస్ 4శాతానికి పెంపు • విద్యా రంగానికి భారీ కేటాయింపు • ప్రతిభ గల విద్యార్థులకు ప్రధాని ఫెలోషిప్ • గిరిజన ప్రాంతాల్లో నవోదయ స్కూళ్లు • అందరికీ అందుబాటులో విమానయానం • నయా భారత్‌కు జైట్లీ శ్రీకారం • వేతన జీవులపై కరుణ చూపించని విత్త మంత్రి



ఆర్చేవా... తీర్చేవా?!

• మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు ఎప్పటికొచ్చేను?
• వైద్య బీమాతో ఒకే ఇంట్లో ఎందరికిస్తారు.. ధీమా?
• భారీ మద్దతు ధర గోధుమలకేనా.. బియ్యానికొద్దూనా?
• అన్నీ దీర్ఘకాలికాలే తప్ప.. ఇప్పటికిప్పుడు ఒరిగేదేముంది?
• ఎన్నికల బడ్జెట్‌లో గ్రామీణ జనరంజకం?

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
సార్వత్రిక ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి చివరి బడ్జెట్‌కు స్పష్టమైన దిశ, దశ కొరవడిందని నిపుణులు తేల్చేస్తున్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలు తప్ప ఈ ఏడాదిలో ప్రజలకు అందుబాటులోకొచ్చే సదుపాయాలు, వెసులుబాట్ల గురించి ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదని వీరు విశ్లేషిస్తున్నారు. సాగుకు ప్రోత్సాహం పేరిట వ్యవసాయ పెట్టుబడిపై 150 శాతాన్ని కొనుగోలు మద్దతు ధరగా ప్రకటిస్తామన్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదార్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుముప్పుగా మారే ప్రమాదాన్ని వీరు శంకిస్తున్నారు. మద్దతుధర పెంపు వల్ల కొద్దిమంది రైతులకు ప్రయోజనం చేకూరినప్పటికీ వినిమయ ధరకొచ్చేసరికి అది మూడు నాలుగు రెట్లు పెరిగే ప్రమాదముంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో 40 రూపాయలకు లభిస్తున్న బియ్యం వంద రూపాయలకు పెరిగే అవకాశముంది. దాదాపుగా అన్ని రాష్ట్రాలు ఆహార భద్రతా పథకం కింద 3వ పేజీలో...

హామీలన్నీ గాలికి..!



• జోన్ ఊసే లేదు
• పత్తాలేని పోలవరం
• అమరావతికి అడియాస
• మెట్రో మాటే కరవు
• నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతో గొప్పగా ఊహించుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని ఈ బడ్జెట్ మరింతగా నిరుత్సాహపర్చిందంటున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఒక్క రైల్వే, విద్యాపరంగా మినహాయించి, మరే ఇతర అంశాలను పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీసింది. నవ్యాంధ్రులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు విషయమై బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేకపోవడంతో పాటు విశాఖ రైల్వే జోన్ అంశం కూడా పత్తాలేకుండా పోవడంతో ఏపీ ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీనిపై రాజకీయ పార్టీల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం విభజన హామీల ఊసే లేకపోవడం పట్ల జీర్ణించుకోలేకపోతున్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ గురించి ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న సంగతి తెలిసిందే. గత 50 ఏళ్లుగా దీని కోసం కోస్తాంధ్ర ప్రజలు విశాఖ రైల్వే జోన్‌కోసం ఉద్యమిస్తున్నారు. విభజన చట్టంలో కూడా ఈ అంశాన్ని చేర్చారు. కానీ దీని గురించి, బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం 5వ పేజీలో...



సమన్వయమా?
సమరమా?!

• భవిష్యత్ కార్యాచరణపై తెదేపా మథనం • సీఎం సమక్షంలో మంత్రుల అసంతృప్తి • ఎంపీల నిరసన • నేడు కేబినెట్, సమన్వయ భేటీల్లో నిర్ణయం



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర ఆర్థిక శాఖామంత్రి పార్లమెంటులో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు కూడా అసంతృప్తితో ఉన్నారు. టీడీపీ ఎంపీలు గరంగరంగా ఉన్నారు. బడ్జెట్ అనంతరం సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో ముఖ్యమంత్రి కార్యాలయంలో సాయంత్రం అత్యవసర భేటీ జరిగింది. తొలుత ముఖ్యమంత్రి బడ్జెట్‌పై కేంద్ర మంత్రులు, రాష్ట్ర ఎంపీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపిందని ఎంపీలు, రాష్ట్ర మంత్రులు సీఎం వద్ద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో జరిగే పార్టీ సమన్వయకమిటీ సమావేశం, క్యాబినెట్ మీటింగ్‌లో బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించాలని నిర్ణయించారు. అలాగే ఆదివారం టీడీపీ ఎంపీలతో అత్యవసర సమావేశానికి 8వ పేజీలో...



బడ్జెట్ 2018-19

పల్లెకు పట్టం




● వ్యవసాయానికి పెరిగిన కేటాయింపులు ● ఖరీఫ్ మద్దతు ధర ఉత్పత్తి ధర కంటే 1.5 రెట్లు అధికం ● ఉపాధి, వ్యవసాయ రుణాలతో ఆకట్టుకునే ప్రయత్నం ● మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ లో రైతులకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. వ్యవసాయాన్ని లాభసాటి మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రైతుల సంక్షేమానికి బీజేపీ సర్కారు కట్టుబడి ఉందని జైట్లీస్పష్టం చేశారు. వ్యవసాయం పెట్టిన పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర కల్పిసామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. ఈ సారి ఖరీఫ్ సీజన్ లో వరి లాంటి పంటలకు రైతు పంట ఖర్చు కంటే 50 శాతం అధికంగా మద్దతు ధర చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ రుణాలను కూడా వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి భారీగా పెంచాలని(11లక్షల కోట్లు) నిర్ణయించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10వేల కోట్లు కేటాయించారు. ఫిషరీస్, ఆక్వాకల్చర్, పశుసంవర్ధకం వంటి వాటికి నిధులు వెచ్చించనున్నారు. ఇక వ్యవసాయ మార్కెటింగ్ ఇన్ఫ్రా ఫండ్ కింద రెండువేల కోట్లు, జాతీయ వెదురు మిషన్ కింద1250 కోట్లు,ఆపరేషన్ గ్రీన్ పేరిట టమోటో, ఉల్లి, ఆలుగడ్డ పంటల ధరల్లో అస్థిరతను నివారించేందుకు రూ. 500 కోట్లు, ఔషధ, సుగంధ పంటల సాగును ప్రోత్సహించేందుకు రూ.200 కోట్లు కేటాయించారు. పాడి పరిశ్రమ, మత్స్య, పౌల్ట్రీ పరిశ్రమలకు పథకాలు ప్రకటించారు.



రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ పునరుద్ఘాటించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని..2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ప్రధాని మోడీ నిర్విరామంగా శ్రమిస్తున్నారని తెలిపారు. వ్యవసాయాన్ని కూడా లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్న జైట్లీ.. ఒకే భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం సాధించేలా రైతులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. రబీ పంటకు మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో ఖరీఫ్ నుంచి రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. 2014-15 లో వ్యవసాయ రుణాలు రూ. 8.5 లక్షల కోట్లు ఉండగా..2017-18 నాటికి వాటిని రూ. 10లక్షల కోట్లకు పెంచామన్నారు. వచ్చే ఏడాది నాటికి ఆ రుణాలను రూ.11 లక్షల కోట్లకు పెంచుతామని జైట్లీ హామీ ఇచ్చారు. కిసాన్ క్రెడిట్ కార్డులను మరింతగా విస్తరించడంతో పాటు ఫిషరీస్, పశుపోషణ రైతులను ఆదుకుంటామని బడ్జెట్ లో జైట్లీ పేర్కొన్నారు.తక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేస్తున్న రైతులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయకపోవడం వల్లే రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నిండామునిగి పోతున్నారని జైట్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై నీతి ఆయోగ్ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి...తక్కువ సాగు రైతులకు కూడా రుణాలు మంజూరయ్యేలా సరైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరిందన్నారు. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ. 2వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. వ్యవసాయ మార్కెట్ల మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా 22వేల గ్రామీణ ప్రాంతాల వ్యవసాయ మార్కెట్లు, 585 హోల్ సేల్ మండిలి అభివృద్ధి ఈ ఫండ్ ను కేటాయించారు. ఈ మార్కెట్లు,మండీలను ఈ-నామ్ లకు అనుసంధానం చేసి రైతులకు అవసరమైన సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా470 హోల్ సేల్ మండిలను ఈ-నామ్ లకు అనుసంధానం చేయగా మిగిలిన నూటఐదింటిని కూడా ఈ ఏడాది మార్చి వరకు అనుసంధానం చేయనున్నట్లు జైట్లీ ప్రకటించారు.



గ్రామీణ ప్రాంత అభివృద్ధికి రూ.14.34 కోట్లు

కేంద్ర బడ్జెట్ లో గ్రామీణ భారతానికి పెద్దపీట వేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మొత్తం బడ్జెట్ లో 14 లక్షల 34 వేల కోట్లను కేటాయించారు. 2018-19లో 321 కోట్ల మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

గ్రామాల్లో 3 లక్షల 17 వేల కి.మీ మేర రోడ్లు , 21 లక్షల కొత్త ఇళ్లు, లక్షా 88 వేల మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు కోటి 75 లక్షల కొత్త ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సంవత్సరం బడ్జెట్ లోని ప్రతిపాదన ప్రకారం వ్యవసాయం, గ్రామాల అభివృద్ధి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టమౌతుందని జైట్లీ నొక్కివక్కాణించారు. వచ్చే సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను మరింతగా పెంచి.. వ్యవసాయం, అనుబంధ రంగాలు, నిర్మాణ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కు ఈ ఏడాది బడ్జెట్ లో 5750 కోట్ల నిధులు కేటాయించారు. గతేడాది కంటే ఈ నిధులు 1250 కోట్లు ఎక్కువ. స్వయం సహాయక బృందాలకు 2016-17 లో 42,500 కోట్ల నిధులు కేటాయించగా ఈసారి మార్చి నాటికి ఈనిధులను 75 వేల కోట్లకు పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది.

బడ్జెట్ కేటాయింపులిలా...

- గ్రామీణ పారిశుద్ధ్య పథకానికి రూ.16,713 కోట్లు
- గ్రామీణ మౌలిక వసతుల కల్పన కోసం రూ.14.34 లక్షల కోట్లు
- ఇంటింటికి తాగునీటి పథకానికి రూ.77,500 కోట్లు
- ఆహార శుద్ధి రంగానికి రూ.1400 కోట్లు
- కిసాన్ క్రెడిట్ కార్డు, పాడి రైతులు, ఆక్వా పరిశ్రమల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు

రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యం



● ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు ఆరోగ్య భీమా
● పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేర్చండి
● పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : స్వాతంత్ర్య భారత చరిత్రలో రైతులకు పంట వ్యయంపై ఒకటిన్నర రెట్ల కనీస మద్దతు ధర ఇవ్వాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడం చరిత్రాత్మకమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. చిన్న, సన్నకారు రైతులందరి ఆదాయాన్ని రెండింతలు చేసేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే స్ఫూర్తితో తమ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించిందని చెప్పారు . అభివ ద్ధిని పేదలు, గ్రామీణులు వరకు తీసుకువెళ్లేందుకు అనేక చర్యలు బడ్జెట్‌లో ప్రకటించారని అన్నారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి కేంద్ర బడ్జెట్‌లో భారీ పథకాలు ప్రకటించామని అమిత్‌షా వెల్లడించారు. రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలందరి బడ్జెట్ అని అభివర్ణించారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పంట వ్యయంపై ఒకటిన్నర రెట్లతో కనీస మద్దతు ధర ఇచ్చే పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించామన్నారు. దేశానికి స్వతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం ఈ సాహసోపేత చర్య తీసుకోలేదని గుర్తు చేశారు. ఇక నుంచి అన్ని పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పారు. ఆపరేషన్ గ్రీన్ ద్వారా ఆలూ టమాట, ఉల్లిగడ్డ పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు 500 కోట్ల రూపాయలతో నిధిని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోసం 1400 కోట్లు కేటాయింపులు చేశామని అన్నారు. చిన్న రైతుల కోసం కూడా కొత్త పథకాలు తీసుకువచ్చామని అన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు భారీ ఎత్తున నిధులు కేటాయించామన్నారు. సౌభాగ్య యోజన పథకంతో అన్ని ఇళ్లకు కరెంటు అందించాలని నిర్ణయించామన్నారు.

పార్లమెంటరీ పార్టీ సమావేశం

బడ్జెట్ ముగిసిన తర్వాత గురువారం సాయంత్రం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు, వాటి లక్ష్యాలు తదితర అంశాలను ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఎంపీలకు వివరించారు. వ్యవసాయరంగానికి, సామాన్యప్రజలకు భారీ ఎత్తున పథకాలు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు భారీ ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు.బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలకు విస్తృత ప్రచారం కల్పించడమే కాక, వాటి ప్రయోజనాలు ప్రజలకు అందేలా ఎంపీలంతా పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, అమిత్‌షా ఎంపీలకు సూచించినట్లు తెలిసింది.

2.5 లక్షల గ్రామాలకు ఇంటర్ నెట్

న్యూఢిల్లీ : కేంద్రం ప్రవేశ పెట్టిన తాజా బడ్జెట్‌లో టెలికాం రంగానికి పెద్ద పీట వేశారు. ఈ రంగంలో మౌళిక వసతుల కల్పనకు 2018-19 బడ్జెట్‌లో 10,000 కోట్ల రూపాయలను కేటాయించారు. పెరుగుతున్న సాంకేతికతకు దన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ కేటాయింపులు చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ప్రపంచం సాంకేతికంగా ఎంతో వేగంగా దూసుకు పోతోంది. ఈ క్రమంలోనే టెలికం రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఏర్పడింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఈ రంగంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం జరిగింది. ఇందులో అతి ప్రధానమైనది భారత్ నెట్ ప్రాజెక్ట్, దీని ద్వారా దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామ పంచాయితీలకు నెట్ సౌకర్యాన్ని కల్పించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాం.

ప్రతిపాదిత గ్రామాల్లో 5 లక్షల వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేస్తాం. తొలి దశలో భాగంగా ఇప్పటికే 1 లక్ష గ్రామాలను వేగవంతమైన ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అనుసంధానించడం జరిగింది. మిగిలిన పనిని 2019 మార్చి నెలలోపు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. 5వ తరం సాంకేతిక అభివృద్ధికి బాటలు వేయడమే మా లక్ష్యం అన్నారు. చెన్నైలోని ఐఐటీ భాగస్వామ్యంతో 5వ తరం సాంకేతికతను టెలికం సంస్థ అభివృద్ధి చేస్తోంది. ఇలా డిజిటల్ ఇండియాను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది అని పేర్కొన్నారు.



జీడిపప్పుపై కేంద్రం కనికరం

న్యూఢిల్లీ : తాజా బడ్జెట్‌లో జీడిపప్పు పరిశ్రమపై కనికరం చూపించారు కేంద్రం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ. ఇప్పటి వరకూ ముడి జీడిపప్పు ఎగుమతులపై ఉన్న 5శాతం పన్నును 2.5 శాతానికి తగ్గించారు. దేశంలోని 14 రాష్ట్రాల్లో జీడి పరిశ్రమపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర, కేరళ, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పాండిచ్చేరి తదితర రాష్ట్రాలో ఉన్న దాదాపు 4వేలకు పై చిలుకు జీడి పరిశ్రమలకు దీని ద్వారా లబ్ధి చేకూరనుంది.



ఎరువు మరింత బరువు

● ధరలు పెంచాలని నిర్ణయించిన కంపెనీలు ● ముడి సరుకు పెరగడంతో తప్పనిసరి పరిస్థితి ● టన్ను యూరియాపై రూ. 2600 వరకు, కాంప్లెక్స్ ఎరువులపై రూ. 2240 వరకు పెరిగే అవకాశం ● ఖరీఫ్ రైతుపై మరింత పెట్టుబడి భారం ● పెరిగిన ధరలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎరువుల ధరలు మరోసారి పెరగనున్నాయి. గత ఏడాది జీఎస్టీ ఫలితంగా పెరిగితే, ఈ ఏడాది ముడిసరుకు పెరిగిన కారణంగా ధరలు పెంచక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఫిబ్రవరి ఒకటి నుంచి ఎరువుల ధరలు పెంచనున్నట్లు ఎరువుల కంపెనీలు నిర్ణయించాయి. ఈ భారం త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ రైతులపై మరింత ప్రభావం చూపనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఎకరాకు రూ.4వేల ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించడంతో ఓవైపు ఆనందం వ్యక్తమవుతుండగా, మరోవైపు ఎరువుల ధరల పెంపు వార్తతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకు పెరగడంతో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచుతున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. గత రెండేళ్ళుగా ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో సాగు పెట్టు బడులు అధికమై వ్యవసాయం రైతులకు భారంగా మారింది.

ఫిబ్రవరి ఒకటి నుంచి యూరియా, కాంప్లెక్స్ ధరలు పెరుగుతాయని డీలర్లు పేర్కొంటున్నారు. టన్ను యూరియాపై రూ.2,600 వరకు, టన్ను కాంప్లెక్స్ ఎరువులపై రూ.2,240 వరకు పెరగనున్నట్లు సమాచారం. ప్రస్తుతం బస్తా డీఏపీ రూ.1,083 ఉండగా, రూ.1,213కు పెంచనున్నారు. అలాగే 28:28:0 కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1,122 ఉండగా దీన్ని రూ.1,234కు ఎరుగుతుందని అంటున్నారు. అన్ని రకాల కంపెనీలపై బస్తాకు కనీసం రూ.100 పెరగనున్నట్లు తెలుస్తోంది. రో జు ం రో జు ం క ు పెరుగుతున్న సాగు ఖర్చులు రైతులకు భారంగా మారాయి. భూమి కౌలు ధరలు మొదలుకొని విత్తనాలు, ఎరువులతో పాటు వ్యవసాయ ఖర్చులు రైతులకు భారంగా మారింది. పత్తి రైతు ఎకరానికి సాగు ఖర్చు సుమారు రూ.30వేలు అవుతుంది. ఈ ఏడాది గులాబీరంగు పరుగు పత్తి రైతులను, తెల్లదోమ వరి రైతులను నిలువునా ముంచింది. పురుగు ప్రభావంతో వరి, పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో 90 శాతం మంది రైతులకు పెట్టుబడులు వెళ్ళని దుస్థితి నెలకొంది. ఏటా పెరుగుతున్న కౌలు భూముల ధరలు, పెరుగుతున్న ఎరువులు, విత్తనాల ధరలతో సాగు ఖర్చులు రైతులకు భారంగా మారుతున్నాయి.

మోయలేని భారంగా పంటల సాగు వ్యయం

ఈ ఏడాది జిల్లాలో సాగు విస్తీర్ణం 1,17,918 హెక్టార్లు కాగా, ఖరీఫ్‌లో 1,17,178 హెక్టార్ల పంటలు సాగు చేయగా, 87,118 హెక్టార్ల పత్తి, 12,495 హెక్టార్ల వరి, 3,445 హెక్టార్ల సోయా, 1,566 హెక్టార్ల జొన్న, 977 హెక్టార్ల మక్క, 1,477 హెక్టార్ల పెసరు, 426 హెక్టార్ల మినుము, 40 హెక్టార్ల వేరుశనగ, 152 హెక్టార్ల మిరప, 26 హెక్టార్ల ఆముదంతో పాటు కూరగాయల పంటలు సాగుచేశారు. రబీలో మొక్కజొన్న 2,312 హెక్టార్లు, మక్క 1,419, కంది 236, మినుము 12, పెసలు 191, శనగ 1,587, వరి 1,616 హెక్టార్లు సాగు చేస్తున్నారు. పంటసాగుకు ఎకరాకు మూడు బస్తాల యూనియా, డీఏపీ 1, కాంప్లెక్స్ 1, పోటాష్ 1 బస్తా అవసరం ఉంటుంది. ఈ లెక్కన బస్తాకు సుమారు రూ.100 పెరగడంతో జిల్లావ్యాప్తంగా ఏటా రైతులపై రూ.6.65 కోట్ల భారం పడుతుంది.

ఎరువుల ధరలు నియంత్రించాలి - రైతు సంఘాలు

రోజురోజుకు వ్యవసాయం సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు కల్పించుకుని నియంత్రణ చర్యలకు పూనుకోవాలని రైతుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కూలీల కొరత, పెరుగుతున్న ఎరువులు, విత్తనాల ధరలు రైతులకు భారంగి మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గింది. పెట్టుబ డులు కూడా చేతికందని దుస్థితి నెల కొంది. ప్రభుత్వం ఎరువుల ధరలు నియంత్రించకుంటే వ్యవసాయ సంక్షోభం తప్పదని వివిధ రైతు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

గ్రామీణ యువతకు సాంకేతిక విద్య

● ఐఐటీ, ఎన్ఐటీల ఏర్పాటుకు కేంద్రం ఓకే ● బడ్జెట్‌లో 350 కోట్లు కేటాయింపు ● గ్రామీణ యువతకు టెక్నికల్ స్కిల్స్



న్యూఢిల్లీ: సాంకేతిక విద్య అంటే పట్టణాలు,నగరాలకు మాత్రమే పరిమితం కారాదనీ, గ్రామీణ ప్రాంతాల్లో ట్రిబుల్ ఐటిఐలు ప్రారంభించాలని పూర్వపు యూపిఏ ప్రభుత్వం నిర్ణ యించి, అందుకు అనుగుణంగానే నిధులు కేటాయిం చింది. ఇప్పుడు ఎన్‌డిఏ ప్రభుత్వం కూడా త్రిపుల్ ఐటిఐలకు మాత్రమే కాకుండా, ఐఐటి,ఎన్ఐటి కళాశాలలను తెరిచేందుకు కొత్త బడ్జెట్‌లో 350 కోట్ల రూపాయిలు కేటాయించింది.ఈ సాంకేతిక విద్యా సంస్థల వల్ల లక్షమందివిద్యార్థులకు ప్రయోజనంచేకూరుతుంది. ఇవన్నీ కూడా వెనుకబడినజిల్లాల్లోనే నెలకొల్పు తారు. పదకొండు రాష్ట్రా ల్లో సాంకేతిక విద్యా సంస్థల్లో ఖాళీల భర్తీలో రాష్ట్రా లకు తోడ్పడేందుకే ఈ కేటాయింపులు చేశారు.ఈ విద్యా సంస్థలు అధ్యాపకుల కొరతతో సతమతం అవుతున్నాయి. మారుమూల పల్లెల్లో నివసించే విద్యార్థులు నగరాలకు వెళ్ళి పెద్ద కాలేజీల్లో చేరి ఉన్నతవిద్య అభ్యసించలేకపోతున్న దృష్ట్యా,అలాంటి వారి కోసం గ్రామాల్లో సాంకేతిక విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలన్నపూర్వపు ప్రభుత్వ పథకాన్ని మెరుగైన రీతిలో అమలు జేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.





ఆర్చేవా... తీర్చేవా?!

(మొదటిపేజీ తరువాయి)

సబ్సిడీ ధరపై బియ్యం లేదా గోధుములు ఇస్తున్నాయి. ఈ కొనుగోలు ధర పెంపు ప్రభావం దీనిపై పడుతుంది. కేంద్రం సబ్సిడీ ధరపై రాష్ట్రాలకు సరఫరా చేసే బియ్యం లేదా గోధుమల పరిమాణం రాష్ట్రాలు ప్రజలకు అందించేసబ్సిడీ ఆహార పరిమాణంలో పదో వంతు కూడా ఉండదు. దీంతో బహిరంగ మార్కెట్లో 90శాతం ఉత్పత్తుల్ని కొనుగోలు చేసి సబ్సిడీని భరించడం రాష్ట్రాల ఆర్థిక స్థితిని తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇంతకంటే రైతులకు నేరుగా పెట్టుబడి ప్రయోజనాలు కల్పించడం మేలవుతుందని వీరు పేర్కొంటున్నారు. మద్దతు ధర పెంపు గోధుమ, వరి రెండింటికి వర్తిస్తుందా లేదా అన్న స్పష్టం చేయలేదు. దక్షిణభారతంలో వరి సాగైతే ఉత్తరాదంతా గోధుమే పండిస్తారు. ఆదినుంచి ఉత్తరాది వారే పాలకులుగా ఉండడంతో గోధుమ కొనుగోలు ధర ఏటా వంద రూపాయలు పెరుగుతుంటే ధాన్యానికొచ్చేసరికి అది 10నుంచి 20 రూపాయల్లోపే ఉంటోంది. ఈసారి మద్దతు ధర నిర్ణయం రెండు ప్రాంతాలకు సమానంగా వర్తిస్తుందన్న హామీ బడ్జెట్‌లో ఎక్కడా లభించలేదు. ఇక ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య బీమాను ప్రకటిస్తున్నట్లు జైట్లీ పేర్కొన్నారు. ప్రజల వైద్యం కోసం ఏకంగా రూ. 4 లక్షల కోట్లు వ్యయం చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు వైద్య బీమా ప్రయోజనం కలుగుతుందన్నారు. అయితే బీమా సంస్థలేవీ బాధితుడికి నేరుగా బిల్లులు చెల్లించవు. తామెంచుకున్న ఆసుపత్రులకు మాత్రమే వైద్య సేవల నిమిత్తం నిధులు మంజూరు చేస్తాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 96 శాతం మంది ప్రజలకు తెల్లకార్డులుండేవి. వారందరికీ ఆరోగ్య బీమా వర్తించేది. కుటుంబంలోని ప్రతి వ్యక్తికి మూడు లక్షల రూపాయల విలువైన అత్యాధునిక కార్పొరేట్ వైద్యాన్ని సమకూర్చేవారు. ఇలా సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా కుటుంబంలో ఎందరు అనారోగ్యానికి గురైనా ఇది వర్తించేది. ఇప్పుడు కుటుంబానికి గరిష్టంగా రూ.5 లక్షల పరిమితి విధించారు. పైగా గతంతో పోలిస్తే ఆరోగ్య సేవల ధర పెరిగింది. ఈ నేపథ్యంలో ఏడాదికొకరికి మించి ఒకే కుటుంబంలో ఈ బీమా క్రింద వైద్యం అందే అవకాశాలు ఉండవని వీరు తేల్చేస్తున్నారు. భారీ సంఖ్యలో వైద్యకళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల ఏర్పాటు ప్రతిపాదన ఇప్పట్లో కార్యరూపం దాల్చే అవకాశాలుండవు. ఇప్పటికే దేశంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. కొత్తగా ఆసుపత్రుల ఏర్పాటుకు తగినంతమంది వైద్యులు లభించే అవకాశాల్లేవు. ముందుగా వైద్యకళాశాలలు పెట్టి నిపుణుల్ని తీర్చిదిద్దాలి. అయితే కళాశాలల ఏర్పాటుకు ముందు కనీసం ఐదేళ్ల పాటు 600కు పైగా ఇన్‌పేషంట్ సామర్థ్యం గల ఆసుపత్రుల్ని నిర్వహించాలి. రోజువారి వెయ్యికిపైగా ఔట్‌పేషంట్ల కు వైద్యం చేయాలి. ఈ స్థాయిలో ఐదేళ్ళ నిర్వహణ అనంతరమే వైద్యకళాశాల ఏర్పాటుకు అనుమతులొస్తాయి. ఇలా చూస్తే కేంద్రం ప్రతిపాదించిన 24 భారీ ఆసుపత్రులు, అనుబంధ కళాశాలల ఏర్పాటుకు దీర్ఘకాలం పడుతుంది. ఆధునిక విద్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదించినప్పటికీ నిపుణులైన ఉపాధ్యాయుల లభించడం లేదు. ప్రత్యేక పద్ధతుల్లో తర్ఫీదునిచ్చి నిపుణుల్ని తయారు చేస్తే తప్ప ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బోధించగలిగే సామర్థ్యంతో కూడిన ఉపాధ్యాయులు అందుబాటులోకి రారు. దీంతో ఇది కూడా ఇప్పట్లో కార్యాచరణదాల్చే అవకాశాలు కనిపించడం లేదని పేర్కొంటున్నారు.

అత్యంత కీలకమైన రక్షణ రంగానికి ఈసారి బడ్జెట్‌లో పెద్దగా ప్రాధాన్యతలేదు. మేకిన్ ఇండియా అంటూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం రక్షణరంగంలో స్వయం సమృద్ధికి అనుగుణంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ఏర్పాటుగాని, ఉన్న పరిశ్రమల విస్తరణకు గాని ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. అలాగే రైల్వేలైన్ల విస్తృతికి ప్రతిపాదనల్లేవు. ఇది పూర్తిగా గ్రామీణ జనజీవన ప్రమాణాల్ని పెంచే బడ్జెట్ అంటూ బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగానికి ఈబడ్జెట్ ఊతమిస్తుందంటూ పేర్కొంటున్నారు. సాగు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగానికే జైట్లీ ప్రాధాన్యత ఇచ్చారంటూ చెబుతున్నారు. ఈ బడ్జెట్ అమలుతో గ్రామీణ ముఖచిత్రం మారిపోతుందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

అయితే వాస్తవానికి ఈ బడ్జెట్‌లో పేర్కొన్న ప్రతిపాదనలేవీ ఇప్పట్లో ప్రజలకు నేరుగా ప్రయోజనాలు కల్పించే పరిస్థితి ఉండదన్నది విశ్లేషకుల అభిప్రాయం. గత బడ్జెట్‌ను పరిశీలించిన విశ్లేషకులు ఈసారి పెద్దగా ప్రజారంజక పథకాలుండే అవకాశాలపై ముందుగానే పెదవి విరించారు. జీఎస్టీ రాకతో పన్నులకు సంబంధించి మార్పులు, చేర్పుల్ని బడ్జెట్‌లో ప్రతిపాదించే అవకాశాలుండవు. నెల నెలా జరిగే జీఎస్టీ కౌన్సిల్లో చర్చించి పన్నుల శాతాలపై నిర్ణయిస్తారు. అయితే ఎన్నికల ఏడాది కావడంతో ఆచరణతో సంబంధం లేకుండా ప్రజల్ని రంజింపజేసే విధంగా జైట్లీ బడ్జెట్‌ను రూపుదిద్దినట్లు వీరు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ భారత ప్రజల్ని ఆకర్షించేందుకు జైట్లీ ప్రయత్నించారని విశదీకరిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలకు మొండి చెయ్యి

- కేంద్రం ప్రకటించిన 24 వైద్య కళాశాలల్లో తెలుగు రాష్ట్రాలకు ఒక్కటీ దక్కే అవకాశాలు లేవు
- ఎయిమ్స్‌కు మొండిచెయ్యి
- నిధులు కేటాయింపు లేదు
- గిరిజన వర్సిటీ పరిస్థితి ఇదే
- తెలుగు ప్రభుత్వాల పెదవి విరుపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన 24 వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో తెలుగు రాష్ట్రాలకు ఒకటి కూడా దక్కే అవకాశం కనిపించడంలేదు. ప్రతి మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ఓ వైద్య కళాశాల, ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే ఆశించిన మేర వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ఉండడంతో బడ్జెట్‌లో ప్రకటించిన వాటిల్లో తెలంగాణకు, ఏపీకి ఒకటి కూడా రాదన్న అభిప్రాయంతో అధికారులు ఉన్నారు. తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజక వర్గాల్లో, ఏపీలోని 25 నియోజక వర్గాల్లో ఇప్పటికే వైద్య కళాశాలలు ఉన్నాయి. తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ ఇటీవలె సూర్యాపేట, నల్గొండలలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిం చారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్‌లలో ప్రభుత్వం రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) పేరుతో వైద్య కళాశాలను ప్రారంభించింది. సిద్దిపేటలో గత విద్యాసంవత్సరం ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాల ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్ రంగంలో కళాశాల పనిచేస్తోంది. రంగారెడ్డి జిల్లాతో పాటు నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా, ఖమ్మం జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో వైద్య కళాశాలలు పనిచేస్తున్నాయి. పూర్వపు రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో మరో ప్రైవేట్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్లు జారీచేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు ప్రైవేట్ రంగంలో మరో వైద్య కళాశాల ఉంది. హైదరాబాద్ నగరంలో ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలలతో పాటు దక్కన్, అపోలో, మెడిసిటి, కామినేని వైద్య కళాశాలలు ఉన్న సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూలు, ఒంగోలు, తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, పశ్చిమ గోదావరి, అనంతపురం జిల్లాల్లో ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలలు పనిచేస్తున్నాయి. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఏయిమ్స్‌కు ప్రభుత్వం ఇప్పటికే అనుమతినిచ్చింది. ప్రైవేట్ రంగంలో అతిపెద్ద వైద్య కళాశాల, ఆసుపత్రులు అమరావతిలో ఏర్పాటవుతున్నాయి. ఇలా చూస్తే కేంద్రం జాతీయ స్థాయిలో 24 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తామని, ప్రతి మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాల, ఆసుపత్రి ఉండేలా చర్యలు తీసుకుంటామని బడ్జెట్‌లో ప్రకటించినప్పటికీ తెలుగు రాష్ట్రాలకు ఒక కళాశాల కూడా దక్కే అవకాశాలు అంతంత మాత్రమేనని అంటున్నారు.

తెలంగాణకు ఇస్తామన్న ఏయిమ్స్ విషయం లోనూ బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) స్థాయిని పెంచి అందులో ఏయిమ్స్‌ను ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్రానికి చెందిన ఎంపీలు పలుమార్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి ఏయిమ్స్ ఏర్పాటు విషయాన్ని తీసుకువెళ్ళిన సమయంలో ఖచ్చితంగా నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. అయినా కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రస్తావన లేకపోవడంతో ప్రభుత్వం గుర్రుగా ఉంది.

తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కంటితుడుపు చర్యగా బడ్జెట్‌లో కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేటాయించడంపట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు సమీపంలోని జాకారంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేశంలో ఇది రెండో గిరిజన విశ్వవిద్యాలయం అయినప్పటికీ నిధులు మాత్రం కేటాయింపు జరగలేదు. రాష్ట్రానికి చెందిన మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ఇటీవల ఢిల్లీ వెళ్ళి గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే. గిరిజన వర్సిటీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు భూమి కేటాయించలేదని అలాంటప్పుడు నిధులు ఎలా మంజూరు చేయగలమని కేంద్రమంత్రి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వంద ఎకరాలు కేటాయించాలని తనను కలిసిన ఎంపీల బృందానికి గతంలో మంత్రి జవదేకర్ కోరిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కేవలం ఈ విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో విశ్వవిద్యాలయం ప్రహరీ గోడ కూడా నిర్మించలేమని అధికారులు అంటున్నారు. దీన్నిబట్టి చూస్తుంటే గిరిజన విశ్వవిద్యాలయం వచ్చే విద్యా సంవత్సరం కూడా ఏర్పాటయ్యే అవకాశాలు లేవని తాత్కాలికంగా భవనాలను ఎంపిక చేసుకుని అక్కడ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించినా భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థకు నిధులు మంజూరు చేస్తుందో, లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు చెబుతున్నారు. బడ్జెట్‌లో ఈ విశ్వవిద్యాలయానికి కనీసం రూ.100 కోట్లయినా కేటాయిస్తారన్న భరోసాతో ఉన్నామని అయినా అది జరగలేదని ఏం చేయాలన్న అంశంపై త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశమై చర్చించాకే ఒక నిర్ణయానికి వస్తామని ఉన్నత విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

కేంద్ర బడ్జెట్ 2018-19 సంక్షిప్తంగా

(రూ. కోట్లలో)

	2016-17 వాస్తవాలు	2017-18 బడ్జెట్ అంచనాలు	2017-18 సవరణ అంచనాలు	2018-19 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ రశీదులు	1374203	1515771	1505428	1725738
మూలధన రశీదులు	600991	630964	712322	716475
మొత్తం రశీదులు	1975194	2146735	2217750	2442213
మొత్తం ఖర్చు	1975194	2146735	2217750	2442213
రెవెన్యూ లోటు	316381	321163	438877	416034
వాస్తవ లోటు	535618	546531	594849	624276
ప్రాథమిక లోటు	54904	23453	64006	48481

పారదర్శకత ఏదీ?



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విద్యా, ఆరోగ్యంపై ఎక్కువ దృష్టి పెట్టామని చెప్పారు. కానీ ఈ తరహాలో విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించినట్లు కన్పించలేదని తెరాస ఎంపీ కవిత ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై కవిత స్పందిస్తూ.. అన్ని వర్గాలకు కాకుండా కొన్నింటినే ఎంపిక చేసినట్లు గానే ఈ బడ్జెట్ ఉంది. పారదర్శక బడ్జెట్‌లా కనిపించలేదు. ఇంకొంత స్పష్టత, పేద ప్రజల పక్షాన ఈ బడ్జెట్ ఉండి ఉంటే బాగుండేది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విషయంలో మొదటి నుంచీ ప్రభుత్వ వైఖరి విచిత్రంగా ఉంది. మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి బడ్జెట్ ప్రసంగంలో ఏమీ లేకపోవడం బాధాకరం. పెద్దపెద్ద కంపెనీలను వదిలి మధ్య, చిన్న తరహా పరిశ్రమలపై ట్యాక్స్ వేయడం సరికాదు. ట్యాక్స్ వసూళ్లపై గతంలోనూ స్పందించాం. ఢిల్లీలో కూర్చొని గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు అకౌంట్‌లో డబ్బులు వేస్తామనడం సరైంది కాదు. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు సీరియస్‌గా తీసుకోవాలి. తెలంగాణకు రైల్వే లైన్ల ఊసే లేదు. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం సరైంది కాదు. ఆరోగ్య రంగంలో అత్యంత పేద ప్రజలకు 5 లక్షలు ఇస్తామనడం హర్షించదగ్గ విషయం. జన్‌ధన్ అకౌంటులలో 60 కోట్లు ఉన్నాయని చెబుతూ, 10 కోట్ల మందికే ఈ స్కీం వర్తిస్తుందని చెబుతున్నారు. 10 కోట్ల కుటుంబాలకా, 10 కోట్ల మందికా అన్న అంశంలో క్లారిటీ రావాలి. ఈజ్ ఆఫ్ బిజినెస్‌లో దేశం అభివృద్ధి చెందిందని చెబుతున్నారు కానీ, ఇందులో రాష్ట్రాల పని తీరును చెప్పకపోవడం బాధాకరం అని అన్నారు.

కేటాయింపుల్లో స్పష్టత లేదు



రాష్ట్రాలవారీగా కాకుండా మంత్రిత్వ శాఖలకు బడ్జెట్ కేటాయించారు. గత సంవత్సరం నుంచి ఈ కొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తుంది. ఇంటింటికి మంచినీరు, రైతుల ఆదాయం రెట్టింపు, రైల్వే, మౌలిక వసతులకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారని ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రాల అవసరాలను బట్టి బడ్జెట్‌ను మంత్రిత్వ శాఖలు కేటాయిస్తాయి. రాష్ట్ర అవసరాలను కేంద్ర ప్రభుత్వం ద ష్టికి తీసుకెళ్తాం. రాష్ట్రాభివ ద్ధికి రావాల్సిన నిధులను సాధిస్తాం. సీఎం కేసీఆర్‌లా బడ్జెట్‌ను కేంద్రం, ఏ దేశము రూపొందించలేదు. అన్ని వర్గాల ప్రజల కష్టాలు, అవసరాల నాడిని పట్టుకొని సీఎం బడ్జెట్‌ను రూపొందిస్తారు. మిషన్ భగీరథ, పింఛన్లు, డబుల్ బెడ్ రూం, మనిషికి ఆరు కిలోల బియ్యం, షాదీ ముబారక్, ఇలా ఎన్నో కార్యక్రమాలను కేసీఆర్ రూపొందించారు. బడ్జెట్ ప్రసంగం విన్నా, చిన్న పిల్లాడు చదివిన అర్థం అయ్యేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుంది. కేంద్ర బడ్జెట్‌పై ఇంకా కొంత స్పష్టత రావాలి.

రాష్ట్ర పథకాలకు ప్రాధాన్యత ఏదీ?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు జాతీయ స్థాయిలో ప్రసంశలు పొందినప్పటికీ కేంద్రప్రభుత్వం మాత్రం వీటిపట్ల బడ్జెట్లో చిన్నచూపే చూసిందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. గురువారం పార్లమెంటులో కేంద్ర మంత్రి బడ్జెట్ ప్రసంగం అనంతరం రాష్ట్రమంత్రి ఈటెల స్పందించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఈటెల కేంద్రబడ్జెట్‌పై మిశ్రమ స్పందన కనబరిచారు. కొన్ని రంగాలకు నిధుల కేటాయింపులు బాగున్నా మరి కొన్ని రంగాలను పెద్దగా పట్టించుకున్నట్టు లేదన్నారు. భూగర్భ జలాల పెంపుదలకు చేపట్టిన పథకాలపై కేంద్రం దృష్టి సారిందచేలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.పదివేలకోట్లు ఇవ్వమని కోరినా పట్టించుకోలేదన్నారు. తాగునీటి అవసరాలకోసం 40వేలకోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ వంటి పథకాలపై కూడా కేంద్రం దృష్టిపెట్టలేదని అసంతృప్తిని వెలిబుచ్చారు.వ్యవసాయం , విద్య , వైద్య రంగాలకు నిధుల కేటాయింపుల పట్ల మిశ్రమ స్పందన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఏకలవ్య పథకాన్ని కూడా పట్టించుకోలేదన్నారు. ప్రజల మధ్య అంతరాలు తగ్గిస్తామన్న కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై దృష్టి పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రంలో చేపట్టిన పలు పథకాలకు నిధుల సహకారం అందించాలని కోరారన్నారు. అన్ని విన్నట్టుగా ఉన్న కేంద్రం నిధుల కేటాయింపుల్లో మాత్రం అసంతృప్తినే మిగిల్చిందని మంత్ర ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.

పర్యాటకంలో ఏపీ పరుగులు!

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పర్యాటక శాఖ పరుగులు పెడుతోంది. దేశీయ పర్యాటకుల రాకలో మూడో స్థానం పొందడమే పర్యాటకాభివృద్ధిని స్పష్టం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశీయ పర్యాటక రంగంలో తమిళ నాడు మొదటి స్థానంలో ఉండగా..ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారు. రాష్ట్రం వెంబడి 972 కిలో మీటర్ల సముద్రతీరంతో పాటు 25 బీచ్‌లు ఉన్నాయి. దేవాలయాలు, బౌద్ధ ఆరామాలు, చేనేత, హస్త కళల కేంద్రాల సంగతి సరేసరి. పర్యాటక అభివృద్ధికి ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చంటూ తొలి నుంచి కూడా చంద్రబాబు నాయుడు చెపుతున్నారు. పర్యాటక రంగంలో మౌళిక సదుపాయాల కల్పనకు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కొత్త ప్రాంతాల అభివృద్ధికి తరుచూ అధికారులకు ఆయన దిశా నిర్ధేశం చేస్తున్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా పర్యాటక రంగం అభివృద్ధికి రాష్ట్రమంత్రి భూమా అఖిలప్రియ, పర్యాటక శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారనడంలో సందేహం లేదు. తరుచూ ఏదో ఒక వినూ త్న కార్యక్రమం నిర్వహించడం ద్వారా పర్యాటకులను రప్పిం చడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి మంచి సత్ఫలితాలే ఇస్తోంది. ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ టూరిజం 2015-20 లక్ష్యంగా సరికొత్త పాలసీ, ప్రణాళికలతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ టూరిజం ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఆ శాఖ అడుగులు వేస్తోంది.

పెరిగిన పర్యాటకులు..

మూడేళ్లుగా పర్యాటకులను ఆకర్షించేందుకు ఆ శాఖ విస్తృతంగా కృషి చేస్తోంది. పర్యాటకులను ఆకర్షించడంలో భాగంగా ముందుగా విమానయానాన్ని అభివృద్ధి చేశారు. తద్వారా ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు చేసిన ప్రయత్నాలతో టెంపుల్ టూరిజం గణనీయంగా పెరిగింది. 2015 వరకు టెంపుల టూరిజంలో ఏపీ మూడో స్థానంలో ఉంది. ఎయిర్ కనెక్టవిటీ పెరగడంతో దేశీయ పర్యాటకుల సంఖ్య 20శాతానికి పెరిగిందని అధికారులు చెపుతున్నారు. 2016లో తిరుపతికి 4.23 కోట్ల మంది పర్యాటకులు రాగా, అనంతపురం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను 2.09లక్షల మంది పర్యాటకులు సందర్శించారు.

సమావేశాలు..

రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ, తెలంగాణాలో పలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మరికొన్ని సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 145 అవగాహనా ఒప్పందాలు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఓ స్థాయి కలిగిన హోటల్ గదులు 8,500 వరకు ఉన్నాయి. రానున్న రోజుల్లో మరో పదివేల స్టార్ రేటెడ్ వసతి గదుల నిర్మాణాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఇదే విషయాన్ని ఇటీవల పర్యాటక శాఖ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రైవేటు భాగస్వామ్యంతో స్టార్ హోటళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

ఆకర్షిస్తున్న ఈవెంట్లు..

రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించేందుకు నిర్వహిస్తున్న ఈవెంట్లు అనేకం ఉన్నాయి. ప్రతి ప్రాంతంలోనూ ఏదో ఒక ఈవెంట్ నిర్వహణ ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రాధాన్యతను పర్యాకులకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల కాకినాడలో బీచ్ ఫెస్టివల్, ఎ.ఆర్.రెహమాన్ లైవ్, అరకు బెలూన్ ఫెస్ట్, దీపికా పదుకొనే, దగ్గుబాటి రానా వంటి పేరొందిచ నటులతో నిర్వహించిన సోషల్ మీడియా అవార్డులు వంటి అనేక కార్యక్రమాలు ఉన్నాయి. ఇవేకాక చారిత్రక ప్రాధాన్యం ఉన్న పర్యాటక కేంద్రాల్లో ఉత్సవాల నిర్వహణ పర్యాటకులను ఆకర్షించేందుకు దోహదపడుతున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులకు సహకరించేందుకు సరిహద్దు రాష్ట్రాల రవాణా సంస్థలతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఒప్పందాలు కూడా చేసుకుంటోంది.

బుద్ధిస్టు సర్క్యూట్ అభివృద్ధి..

రాష్ట్రంలో బుద్ధిస్టు సర్క్యూట్ అభివృద్ధికి చేపడుతున్న చర్యల కారణంగా బౌద్ధుల రాక కూడా పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని వచ్చే నెల 2నుంచి 5వ తేదీ వరకు విశ్వశాం తి పేరిట బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టిబెట్, సింగపూర్, మలేషియా, శ్రీలంక, అమెరికా తదితర దేశాల నుంచి వెయ్యి మంది బౌద్ధ గురువు లు, వేలాది మంది బౌద్ధ భిక్షువులు పాల్గొనేలా ప్రయత్నాలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు దేశవిదేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు వచ్చేలా ఆన్‌లైన్ చాటింగ్‌చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

బడ్జెట్ స్వరూపం

1) ద్రవ్యలోటు

ఎన్నికల ముందు ఎన్డీయే బడ్జెట్‌కు అధిక ద్రవ్యలోటు ప్రతిబంధకంగా నిలిచింది. జనాకర్షక పథకాలు, రాయితీల నిర్ణయాలకు అడ్డంకిగా నిలిచింది.

2016 ద్రవ్యలోటు - 3.9%

2017 లక్ష్యం - 3.5%

2018 లక్ష్యం - 3.3%

2) ఆదాయపన్ను పరిమితి

ప్రస్తుత శ్లాబుల్లో కొంతమేరకు సడలింపు ఉంటుందని నిరీక్షించిన వేతన జీవులకు నిరాశే మిగిలింది. పన్ను శ్లాబులను తటస్థంగా ఉంచారు. వైద్య ఖర్చులు, ప్రయాణ ఖర్చుల కింద 40వేల వరకు స్టాండర్డ్ రాయితీ ఇవ్వడం కొంతమేరకు ఉపశమనం.

రూ. 2.5 లక్షల ఆదాయం వరకు - పన్ను లేదు

రూ.2.5 లక్షలు- 5లక్షల వరకు - 5%

రూ.5 లక్షలు-10 లక్షల వరకు - 20%

రూ.10 లక్షలకు పైబడిన ఆదాయంపై - 30%

3) దీర్ఘకాలిక మూలధన ఆదాయం పన్ను (షేర్లు)

పన్ను భారం నుంచి ఉపశమనం కలుగుతుందని వేచిచూసిన ఈక్విటీ మార్కెట్లకు జైట్లీ పద్దు షాకిచ్చింది. పన్నుపోటు తగ్గకపోగా, కొత్తగా దీర్ఘకాలిక పెట్టుబడులపై వచ్చే ఆదాయంపై 10శాతం వడ్డింపునకు ప్రభుత్వం నిర్ణయించింది. స్వల్పకాలిక పెట్టుబడుల ఆదాయంపై ఉన్న 15శాతం పన్నులో ఎలాంటి మార్పులేదు.

స్వల్పకాలిక పెట్టుబడులు

15శాతం

(12 నెలల లోపు కాలానికి)

దీర్ఘకాలిక పెట్టుబడులపై ఆదాయం

10 శాతం

(12 నెలలపై బడిన కాలానికి)

4) కార్పొరేట్ పన్ను

కార్పొరేట్ పన్నును దశలవారీగా తగ్గిస్తూ నాలుగేళ్లలో 25 శాతానికి నియంత్రించాలని 2015లోనే మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ లక్ష్యాన్ని ఈ బడ్జెట్‌లో చేరుకున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇంతకు ముందు 50 కోట్ల టర్నోవర్ పరిమితిని ఇప్పుడు 250 కోట్లకు విస్తరించారు.

25 శాతం

(కొత్త తయారీ సంస్థలకు)

25 శాతం

(రూ. 250 కోట్ల టర్నోవర్ వరకు)

5) వ్యవసాయానికి ఊతం

- సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి జైట్లీ పద్దు పెద్దపీట వేసింది. అనేక ప్రోత్సాహకాలు ఇవ్వడంతోపాటు, కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచేందుకు హామీ ఇచ్చింది.
- ఆహారశుద్ధి రంగానికి కేటాయింపులు రెట్టింపయ్యాయి. తాజా కేటాయింపుల్లో ఇది రూ. 1400 కోట్లు
- మత్స్యకార, రొయ్యలు, పశువుల పెంపకానికి రూ. 10వేల కోట్లు
- ఆపరేషన్ గ్రీన్ పథకానికి రూ. 500 కోట్లు
- వ్యవసాయ మార్కెట్ కనెక్టివిటీకి రూ. 2000 కోట్లు

6) పెట్టుబడుల ఉపసంహరణ

- ద్రవ్యలోటును అదుపులో ఉంచుకుంటూ, నిధులు సమీకరించేందుకు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయానికి కేంద్రం మొగ్గుచూపుతోంది. ఈ బడ్జెట్‌లోనూ ఈ దిశగా దృష్టిసారించింది.
- 2018-19 వార్షిక బడ్జెట్‌లో 10శాతం మూలధనాన్ని ఈ పద్ధతిలో సమకూర్చుకోనుంది. అంటే సుమారు 80వేల కోట్ల రూపాయలను లక్ష్యంగా పెట్టుకుంది.
- 2016లో పెట్టుబడుల ఉపసంహరణ విలువ - రూ. 42, 132 కోట్లు
- 2017 లో - రూ. 45, 500 కోట్లు
- 2018లో - రూ. 80 వేల కోట్లు

7) పెట్రోల్, డీజెల్‌పై పన్ను

- వినియోగ దారుల నుంచి వస్తున్న డిమాండ్ల మేరకు ప్రభుత్వం ఇంధన ధరలపై పన్ను భారాన్ని తగ్గించింది. పెట్రో ఉత్పత్తులపై కేంద్ర సుంకాన్ని రెండు రూపాయల మేర తగ్గించింది.
- అన్‌బ్రాండెడ్ పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరకు రూ. 6.48 నుంచి 4.48కి, బ్రాండెడ్ పెట్రోల్‌పై రూ. 7.66నుంచి 5.66కి తగ్గించింది. అదేవిధంగా బ్రాండెడ్ డీజిల్‌పై రూ. 8.69 కి తగ్గించింది.



బడ్జెట్ 2018-19


సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శుక్రవారం 2 ఫిబ్రవరి 2018

ఉత్తమమైనది ఆశించడమే మానవ నైజం. కొంతకాలంగా కేంద్ర వార్షిక బడ్జెట్‌పై పెద్దపెద్ద అంచనాలు, ఊహలు రాజ్యమేలాయి. బడ్జెట్ ఇలా ఉంటుంది... అలా ఉంటుందీ అంటూ ఎవరికివారు అనుకున్నారు. తీరా బడ్జెట్ బహిరంగమయ్యాక ఎప్పటిలాగే అసంతృప్తి. అనుకున్నట్లుగా లేదని కొందరి పెదవి విరుపు. బాగుందన్న అధికార పక్షం. ఇదేం బడ్జెట్టని ఎకసెక్కాలు. ఇది కచ్చితంగా ఎన్నికల బడ్జెట్టేనంటూ ఓ సీనియర్ జర్నలిస్ట్ కితాబు. ఇన్ని అభిప్రాయాలలో ఏది నిజం. విశ్లేషించడమే ఈ వ్యాసాల ఉద్దేశం.

ఇది జమిలి బడ్జెట్టే!

ఈ సారి కేంద్ర బడ్జెట్ లో గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యత లభించవచ్చన్న ఊహాగానాలను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నిజం చేశారు. గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బాగా దెబ్బతినడం, కర్నాటక, త్రిపుర, ఈశాన్యంలో రెండు రాష్ట్రా ల్లో త్వరలో ఎన్నికలు జరగనుండటంతో ఈసారి గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువ కేటాయింపులు జరగవచ్చని ఊహించిందే. అయితే, జైట్లీ పార్లమెంటుకు బడ్జెట్ సమర్పిస్తున్న సమయంలోనే వెలువడిన ఉపఎన్నికల ఫలితాలు బీజేపీ దూకుడుకు బ్రేకు వేశాయి. రాజస్థాన్‌లో గత ఆదివారం రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలు కావడం గ్రామీణ ఓటరు నాడి ఎలా ఉందో మరోసారి వ్యక్తం అయింది. ఇప్పుడు జరిగిన కేటాయింపుల్లో గ్రామీణ ప్రాంతాలకు అగ్రప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, అవి ఏ తీరులో ఖర్చుఅవుతాయి, క్షేత్రస్థాయిలో వాటి వినియోగం ఎంత అనే విషయాలపై వచ్చే ఏడాది చివరికి కాని స్పష్టత రాదు. బీజేపీ నాయకులు ఈ బడ్జెట్ తమకే అనుకూలమని అంచనాలు వేస్తున్నప్పటికీ, వాటి ఫలితాలను అప్పుడే చెప్పలేం. కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో సాంఘిక అసమానతలు, సామాజిక న్యాయం మృగ్యం కావడం ఓటర్లపై గాఢమైన ప్రభావాన్ని చూపుతుందన్నది నిర్వివాదాంశం. గుజరాత్‌లో ని పల్లె ప్రాంతాల్లో బీజేపీని ప్రధానంగా దెబ్బతీసింది ఈ అంశమే. పూర్తి స్థాయి బడ్జెట్‌ని సమర్పించేందుకు ఇదే ఆఖరి అవకాశం కావడం వల్ల జైట్లీ ఈసారి రైతుల పట్ల కరుణ చూపారు. రైతుల రుణాలకు 11లక్షల కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నిధులు బ్యాంకులు ఇచ్చే రుణాలేనని వేరే చెప్పనవసరం లేదు. పాత రుణాలు చెల్లించని వారికి కూడా రుణాలు ఇస్తారా? పలు రాష్ట్రాల్లో అమలు జేస్తున్న రుణ మాఫీ ప్రస్తావన లేకుండా ఆయన చేసిన ఈ కేటాయింపులు రైతులకు ఎలా చేరుతాయన్నది ఇంకా సందిగ్ధమే. అలాగే, మహిళా సంఘాలకు 75 వేల కోట్ల రుణాలుకూడా. ఈ నిధులు డ్వాక్రా మహిళల రుణమాఫీ కోసమా? లేక కొత్తగా ఇచ్చేవా అన్నది కొద్ది రోజుల తర్వాత కాని స్పష్టం కాకపోవచ్చు. ఈ బడ్జెట్‌లో తమకు భారీగా కాకపోయినా, న్యాయసమ్మత మైన కేటాయింపులు ఉంటాయని ఎదురు చూసిన తెలుగు రాష్ట్రాలకు నిరాశ ఎదురైంది. తెలుగు రాష్ట్రాలు ఎంతో కాలంగా కోరుతున్న ప్రాజెక్టుల ఊసే లేదు. ముఖ్యంగా, తెలంగాణాకు జీవనాడి అయిన కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలన్న డిమాండ్‌పై కేంద్రం స్పందన ఏమీ లేదు. విభజన చట్టంలో హామీల ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నెలకొల్పుతామని హామీ పడిన ఐఐటి, ఐఐఎం, నిట్ వంటి ఉన్నత విద్యా సంస్థలకు మళ్ళీ అరకొర కేటాయింపులే జరిగాయి. వీటివల్ల ఒరిగేది ఏమీ లేదు. హైదరాబాద్ ఐఐటికి 75 కోట్లు ఏమూలకు? బెంగళూరు మెట్రోకు 18 వేల కోట్ల రూపాయిలు కేటాయించిన ఆర్థిక మంత్రిగారు హైదరాబాద్ మెట్రో రెండవ దశకూ, అమరావతి మెట్రోకూ నిధుల గురించి ప్రస్తావన చేయకపోవడం తెలుగువారికి నిరాశ కలిగించింది. సింగరేణికి రెండువేల కోట్లు కేటాయించడం హర్షించదగిందే కానీ, తెలంగాణలో విద్యుత్ ప్రాజెక్టుల ఊసు లేదు. కేంద్రం గత జూన్ నుంచి అమలు జేస్తున్న వస్తు, సేవాపన్ను(జీఎస్‌టి) రేట్లను ఎప్పటికప్పుడు తగ్గించడం వల్ల కాబోలు ఆ ప్రస్తావన చేయలేదు. కానీ, జీఎస్‌టి వల్ల నష్టాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు అందించాల్సిన పరిహారం గురించి బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రస్తావించి ఉంటే భరోసా ఉండేది. ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెంచుతారంటూ ప్రతిసారీ బడ్జెట్ ముందు ఊహాగానాలు పాల పొంగులా ఉబికి వస్తాయి. చివరికి చల్లగా చల్లారి పోతాయన్నది మన అనుభవం. ఈసారి కూడా వేతన జీవులకు అలాంటి అనుభవాన్నే మిగిల్చారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో హామీ ఇచ్చిన విశాఖ రైల్వే జోన్ ఊసే లేదు. దాని గురించి ప్రస్తావించకపోయినా, కేంద్రం తప్పక ప్రకటన చేస్తుందన్న విశ్వాసాన్ని విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు ఇప్పటికీ వ్యక్తం చేయడం ఆశ్చర్యమే. అలాగే, అమరావతి మెట్రో రైలు, రాజధాని నిర్మాణానికి నిధుల ప్రస్తావన లేదు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ, ఆ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో తెలియని అసందిగ్ధ పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ మార్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయం ఇంకా రాకపోవడం, త్వరలో ఆ ప్రాజెక్టును సందర్శిస్తానని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించినా అది ఇంతవరకు కార్యరూపం దాల్చకపోవడం... ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తిఅవుతుందో కేంద్రానికే సరైన అవగాహన లేదనడానికి నిదర్శనం. జైట్లీ బడ్జెట్ జమిలి ఎన్నికల బడ్జెట్‌గానే విశ్లేషకులు భావిస్తున్నారు. పార్లమెంటుకూ, అసెంబ్లీలకూ ఒకేసారి ఎన్నికలు జరిపించాలన్న ప్రతిపాదనపై మోదీ తీవ్రంగా ఆలోచిస్తున్న నేపథ్యంలో వచ్చిన ఈ బడ్జెట్ ముమ్మాటికీ ఎన్నికల బడ్జెట్టే. గ్రామీణ ప్రాంతా లకు పెద్ద పీట వేసినప్పటికీ, ఏవో కొన్ని కేంద్ర ప్రతిపాదిత పథకాలను తప్ప మిగిలిన వన్నింటినీ రాష్ట్రాల ద్వారానే కేంద్రం అమలు జరిపించాల్సి ఉంటుంది. ఇతర పార్టీల ముఖ్య మంత్రుల నుంచి ఎలాంటి సహకారం అందు తుందో వేచి చూడాలి. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రైతులకు రుణాలు, వంటి బడ్జెట్ ప్రతిపాదనలను కేంద్రం ఏవిధంగా అమలుజేస్తుందో చూడాల్సిందే. నిధుల కోసం ఎంతో ఆశతో ఎదురుచూసిన రాష్ట్రాల ముఖ్య మంత్రుల గళాల నుంచి అసంతృప్తి స్వరాలు అప్పుడే వినిపిస్తున్నాయి. వీటి పరిణామాలను ఇప్పుడే అంచనా వేయలేము. జమిలి ఎన్నికలకు వెళ్ళేందుకే కేంద్రం నిర్ణయించుకుందనడానికి ఈ కేటాయింపులే నిదర్శనం.

మంచిదీ కాదు చెడూ లేదు



కఠోర సత్యాలు

పెంటపాటి పుల్లారావు
రాజకీయ విశ్లేషకులు, న్యూఢిల్లీ
ppr193@gmail.com

2018 ఫిబ్రవరి ఒకటో తేదీ వచ్చిందీ.. వెళ్ళింది. అన్నిటికీ మించి ఎవరికీ హాని చేయద్దు.. ఇదీ రెండువేల సంవత్సరాల క్రితం గ్రీకు వైద్యుడు హిప్పోక్రటిస్ చెప్పిన మాట. ఆ ప్రకారం చూస్తే మన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఎవరికీ పెద్దగా హాని తలపెట్టలేదు. ఆర్థిక సిద్ధాంతాలలోకి వెళ్ళే కంటే.. బడ్జెట్‌లో మంచి, చెడులను చూడ్డం మేలు.

మంచి అంశాలు..

● 1) బడ్జెట్‌లో హెల్త్‌కేర్‌పై (మీడియా దీన్ని మోడీ కేర్ అని పిలుస్తోంది) ప్రకటన అవసరమైనదే. ఇలాంటి విధాన పరమైన నిర్ణయం భారత్‌కు ఎంతో అవసరం. ఆరోగ్య రక్షణ, ఆస్పత్రి ఖర్చులు అధికశాతం కుటుంబాలకు తీరని వేదన మిగులుస్తున్నాయి. పెద్దవారెవరైనా అనారోగ్యానికి గురై, ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరమొస్తే వారిని కుటుంబ సభ్యులు విడిచిపెట్టేస్తున్నారు. అలా చేయలేని వారు వైద్యం చేయించడానికి ఆస్తులమ్ముకుంటున్నారు. ఆరోగ్య పరిరక్షణ అంశంపై 70ఏళ్ళ పాటు మన ప్రభుత్వాలు కళ్ళు మూసుకున్నాయి. దేశంలో పది కోట్లమందికి 5 లక్షల రూపాయల విలువైన ఆరోగ్య పాలసీ లభిస్తుందన్న బడ్జెట్ ప్రకటన ఈ పరిస్థితిని ఎంతగానో మారుస్తుంది. ఈ పథకం పేద కుటుంబాలకు అండగా నిలుస్తుంది. వీరికిది దాగున్న ఆదాయం లాంటిది. ఈ పథకాన్ని ప్రభుత్వం దేశవ్యాప్తంగా విస్తరించి ఉంటే బాగుండేది. కొంతమంది ప్రజలకే దీనిని పరిమితం చేయడం వల్ల అవినీతి పెరుగుతుంది. అడ్డంకులూ ఎక్కువవుతాయి.

● 2) దేశవ్యాప్తంగా లక్షా 50వేల హెల్త్ అండ్ వెల్త్ సెంటర్లను ఏర్పాటుచేయబోతున్నారు. ఇది కూడా ప్రజలకు పెద్ద వరమే. ప్రస్తుతం భారత దేశంలో వైద్యుల కొరత మెండుగా ఉంది. వైద్య చికిత్స, ఆస్పత్రుల పరిస్థితి కూడా అంతే. లక్షా 50వేల హెల్త్ సెంటర్లలో సిబ్బందిని సక్రమంగా నియమించి పర్యవేక్షిస్తే ఎంతో సహాయకారిగా ఉంటుంది.

● 3) వెదురు అభివృద్ధి పథకం.. 1150 కోట్ల కేటాయింపు: బడ్జెట్‌లో వెలుగుచూసిన అతి పెద్ద వజ్ర సదృశమైన పథకమిది. భారత దేశానికి వెదురు సంప్రదాయమైన గొప్ప ఆస్తి. దీనివల్ల పారిశ్రామిక ప్రయోజనాలున్నాయి. కాగితం, ఇళ్ళ నిర్మాణం, ఇలా వందలాదిగా ఉపయోగాలున్నాయి. ఈశాన్య రాష్ట్రాలలో వెదురు బియ్యం పరిపుష్టమైన ఆహారం. పైగా ఇది పర్యావరణ హితమైన పంట కూడానూ. దీనికి 1150కోట్ల రూపాయలను కేటాయించడం ద్వారా ప్రభుత్వం తాను వెదురు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టంగా సూచనలు పంపింది. సంప్రదాయ వృత్తి కళాకారులైన మేదర కులస్థులు ఈ పథకం వల్ల లబ్ధిపొందుతారు.

● 4) మధ్య తరగతి సంస్థలకు కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు: ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలూ వివిధ సంస్థలకు విధించే పన్నులను తగ్గిస్తున్నాయి. ౦ం. భారత్‌లో కార్పొరేట్ ట్యాక్స్ పెద్ద మొత్తంలో అంటే 35శాతం ఉంది. దీన్ని 25శాతానికి తగ్గించడం.. చాలా మంచి నిర్ణయం. అన్ని కంపెనీలకు పన్ను తగ్గింపు నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేది. అమెరికాలో కార్పొరేట్ ట్యాక్స్‌ను 25శాతానికి తగ్గించినప్పుడు తాము ప్రస్తుతం చేస్తున్న పెట్టుబడుల కంటే 1500 బిలియన్ డాలర్లు ఎక్కువగా పెట్టుబడులు పెడతామని ప్రకటించిన విషయం ఈ సందర్భంలో గమనార్హం.

వ్యతిరేకాంశాలు

● ఎ) రైతులను ఆదుకోవడంలో ఈ బడ్జెట్ విఫలమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర, ఇతర పథకాలు వాస్తవానికి వారికి ఉపయోగపడవు. బడ్జెట్‌లో తనకేమి ఇచ్చిందీ రైతు ఈరోజు రాత్రి కూర్చుని ఆలోచించుకుంటే ఏమీ లేదనే సమాధానమే వస్తుంది. దురదృష్టవశాత్తూ మన ప్రభుత్వాలు పనిచేయని పథకాలనే ప్రకటిస్తుంటాయి. ఖాతాలలో నేరుగా మొత్తం జమయ్యే పథకాన్ని రైతులకు విస్తరించి ఉంటే ప్రయోజనకరంగా ఉండేది. అలా చేస్తేనే రైతుల ఆదాయం పెరిగే అవకాశముంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు 4వేల రూపాయల సబ్సిడీని ఇస్తానని చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకుని ఉంటే బాగుండేది. ఇలాంటి పథకాన్నే కేంద్రమూ అనుసరించి ఉంటే మెరుగ్గా ఉండేది. అలా చేయకపోవడం రైతుల్ని నిరాశకు గురిచేసింది.

● బి) రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులపై ప్రభుత్వం అవసరానికి మించి ఖర్చు చేస్తోంది. మనకి మంచి రోడ్లు, విమానాశ్రయాలూ కావలసిందే. సందేహం లేదు.సామాన్యుడైన రైతును విస్మరించి మౌలిక వసతుల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టేటన్ని నిధులు మనదగ్గరున్నాయా! మౌలిక వసతుల రంగంపై ఎంత ఖర్చు చేయాలనే అంశంపై జాగ్రత్తగా లెక్కలు వేసుకోవాలి. మనకి రుణాలు లభిస్తాయనే అవకాశంతో భారత్ తనను తాను భారం చేసుకోకూడదు.

● సి) బడ్జెట్‌లో ప్రభుత్వం ఎటువంటి పన్ను మినహాయింపునూ ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లే ఎన్డీయే ప్రభుత్వమూ వ్యవహరించింది. కాంగ్రెస్ ఎప్పుడూ పన్ను చెల్లింపు పరిధిలోకి కొత్త వారిని తీసుకురావాలని ప్రయత్నిస్తుంటుంది. ఆదాయ పన్ను పరిధిని పెంచి, చిన్న తరహా పన్ను చెల్లింపుదారుల్ని ఇబ్బంది పెట్టకుండా చూడాల్సింది.


పరిశీలనలు..

● ఎ) తెలుగు రాష్ట్రాలు ప్రస్తుత బడ్జెట్‌తో తీవ్ర నిరాశలో కూరుకుపోయాయి. ఎందుకంటే వారు అడిగినవి ఎప్పుడూ కేంద్రం ఇవ్వలేదు. ఇక్కడ గమనించాల్సిన అంశమేమిటంటే.. మన ప్రభుత్వాలు అవసరమైన దానికంటే చాలా ఎక్కువ అడిగామనే విషయాన్ని గుర్తించకపోవడం. అంతకుమించి ఢిల్లీలో రాయబారాలు నడిపి, పనులను సాధించుకునే వ్యవస్థ రెండు రాష్ట్రాలకూ లేకపోవడం దురదృష్టకరం.

● బి) వచ్చే ఎన్నికలకు ఈ బడ్జెట్ భారతీయ జనతా పార్టీకి ఏ విధంగానూ ఉపయోగపడదు. ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఆ పార్టీ ప్రభుత్వం మంచి విధానాలను అమలు చేయకపోవడం దెబ్బతీయవచ్చు కూడా. నోట్ బందీ, జీఎస్టీ అమలు సక్రమంగా లేకపోవడం ఆర్థిక వ్యవస్థను కుదేలు చేశాయి. ఇవి రెండూ చేసిన హాని నుంచి భారత్ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. పూర్తిగా కోలుకుని ఆర్థిక వ్యవస్థ పనిచేసే సమయానికి ఫలితాలు అందవు. అప్పటికే చాలా ఆలస్యమైపోతుంది.

● సి) మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం మాదిరిగా ప్రస్తుత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా చక్కని ఇంగ్లీషులో ప్రసంగించగలరు. ఈ బడ్జెట్‌లో కనిపించింది ఇంతే. జైట్లీ ఆర్థికవేత్త కాదనే విషయాన్ని మరువకూడదు. వ్యక్తిగతంగా ఆయన చాలా మంచి మనిషి. పరిజ్ఞానం తక్కువగా ఉన్న తన అధికారులపై జైట్లీ ఆధార పడతారు. ఆర్థికవేత్త కానందున అంతా తనకు అర్థమైనట్లు ఆయన నటించాల్సి ఉంటుంది.

వచ్చే ఎన్నికల్లో నరేంద్రమోడీ నెగ్గాలంటే, ఆయన ప్రతిష్ఠ ద్వారా మాత్రమే సాధ్యం. ఇప్పటికీ అది భద్రంగానే ఉంది. ప్రభుత్వ పనితీరుపై ఆయన ఎన్నికల్లో నెగ్గలేరు. ప్రజలు ఇప్పటికీ మోడీ అంటే ఇష్టపడుతున్నారు. ఆయనను నిజాయితీపరునిగా, అవినీతికి సింహస్వప్నంగా, బలీయమైన రాజకీయ నేతగా భావిస్తున్నారు. తాజా బడ్జెట్ ఆయనకు రాజకీయంగా ప్రయోజనకారి కాదు. ఒకే ఒక్క సుగుణం ఈ బడ్జెట్‌లో ఏమిటంటే.. అందులో పెద్ద తప్పులు లేకపోవడమే. అదొక్కటే మోడీకి అతి పెద్ద విజయం.



కనిపించని బులెట్ వేగం



హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య పరిరక్షణకు అత్యధికంగా నిధులు కేటాయించడం ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో తాయిలంగా ఉపయోగపడేందుకే కావచ్చు. పెద్ద ఎత్తున ప్రచారానికి ఉపయోగపడవచ్చు. ఎంతో కసరత్తు చేసి దీనిని రూపొందించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రవేశపెట్టిన ఒబామా కేర్ కన్నా, తాము ప్రతిపాదించిన ఆరోగ్య పరిరక్షణ పథకం ఎన్నోరెట్లు మేలైందని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెప్పు కోసం ఆయన అటువంటి వ్యాఖ్య చేశారా? పది కోట్ల మంది నిరుపేదలు, నిరాధార జీవులకు మేలు చేకూర్చే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య పథకమని జైట్లీ వ్యాఖ్యానించారు. ద్వితీయ, తృతీయ తరహా రుగ్మతలకు వైద్యం చేయించుకునేందుకు ఒక్కొక్క కుటుంబానికి అందించే సాయం పరిమితి ఐదు లక్షల రూపాయలుగా నిర్ధారించారు. ఈ పథకం వల్ల బీజేపికి ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఏమేరకు లాభం జరుగుతుందో చూడాల్సిందే మరి.

ప్రభుత్వ సంస్థలుగా పనిచేస్తున్న నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లను విలీనం చేసే యత్నం బ్యాంకులను స్టేట్ బ్యాంకులో విలీనం చేయడం లాంటిదే. అలాగే, చమురు కంపెనీలన్నింటినీ ఆయిల్ ఇండియాలో విలీనం చేసిన విధంగానే కావచ్చు.

భారీగా తయారు చేసిన బ్యాలెన్స్ షీట్ నిధుల గరిష్ఠ సేకరణకు, ప్రపంచంలోనే అతి పెద్దదైన ఆరోగ్య రక్షణ కార్యక్రమానికి ఉపయోగపడవచ్చు.

జైట్లీ గంటా యాభయ్ నిమిషాలపాటు చేసిన బడ్జెట్ ప్రసంగంలో సమాజంలో అన్ని వర్గాల వారిని సమానంగా సంతృప్తి పర్చేందుకు ప్రయత్నించారు., ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్షాల గొంతు అతి తక్కువ స్వరంలో వినిపిస్తుండగా ఆయన బడ్జెట్ ప్రసంగాన్ని చదివారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బల్లను అదే పనిగా చరచలేదు. కెమేరాల్లో చిక్కిన ఆయన ముఖ కవళికలు సీరియస్‌గానే ఉన్నాయి. వాటిని బట్టి జైట్లీ బడ్జెట్ ప్రతిపాదనలు 2019లో ఆయనకు అవసరమైన ఓట్లను తెచ్చిపెడతాయా అన్న సందేహం కలిగించేట్టుగా ఉన్నాయి.

ఇది గ్రామీణ పేదల, రోగ గ్రస్తులు కోసమా? అవును 2019 ఎన్నికల్లో ఓట్లు వేసేది వీరేగా! పట్టణాలు, నగరాల్లో నివసించే వేతన వర్గీయులు ఈ బడ్జెట్ ను చూసి నిరాశ చెందారు. ఏడవ వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) తర్వాత వారి ఆశలేవీ ఫలించలేదు. ఖచ్చితంగా ఇది రైతుల కోసం రూపొందించిన బడ్జెట్. అయితే ఈ బడ్జెట్ ప్రతిపాదనలు ఏమేరకు అమలు అవుతాయో వేచి చూడాలి. ఒక వంక ప్రభుత్వం 2018 చివరలో ముందస్తు ఎన్నికల ఆలోచనలు చేస్తోంది మరి. ఆదాయం పన్ను రేట్లను తగ్గించలేదు., శ్లాబ్‌ల సర్దుబాటు చేయలేదు. స్టాండర్డ్ డిడక్షన్‌ని తిరిగి ప్రవేశపెట్టినా వేతన జీవులను ఉత్సాహ పర్చే అవకాశం లేదు. రాజస్థాన్ ఉప ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. ఈ తరుణంలో ముందస్తు ఎన్నికలు జరిపించడం ఆత్మహత్యా సదృశమే.

ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టడం వల్ల రైతుల్లో కొంత ఆనందం కనిపిస్తోంది. ప్రధానమంత్రి సంపద యోజనను ప్రవేశపెట్టి ఆహార శుద్ధి రంగానికి 1400 కోట్ల రూపాయిలను కేటాయించారు. వర్షాభావం, సాగునీటి సౌకర్యాలు లేకపోవడం, రుణభారం కారణాలతో రైతులు బాగా నష్టపోయారు. వెయ్యి ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలన్న నిర్ణయం ఆహ్వానించదగిందే. ఇంతవరకూ ప్రకటించని ఖరీఫ్ పంటలన్నింటికీ మద్దతుధర ప్రకటించడాన్ని కూడా స్వాగతించాల్సిందే. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రా ల్లో టమోటా, బంగాళ దుంపలకు గిట్టుబాటు ధర లభించక రైతులు అల్లాడి పోతున్న తరుణంలో ఆపరేషన్ గ్రీన్ కార్యక్రమం ప్రకటించడం కూడా స్వాగతించాల్సిందే.

వయోవృద్ధులకు కొన్ని రాయితీలను ప్రకటించారు. పోస్టాఫీసుల్లో 50వేల రూపాయిల ఫిక్సెడ్ డిపాజిట్లను పన్నుపరిధి నుంచి తప్పించడం ఊరట కలిగించే నిర్ణయమే . ఇంతవరకూ ఈ మినహాయింపు పదివేలకు మాత్రమే ఉంది. సమాజంలో బలహీన వర్గాలపై జైట్లీ ఎటువంటి భారం మోపలేదు కనుక, ఇది ఖచ్చితంగా ఎన్నికల బడ్జెట్టే. ఇప్పుడు వారు ఎల్ఐసి పథకాల్లో పదిహేను లక్షల వరకూ పెట్టుబడులు పెట్టుకోవచ్చు. 7.5 లక్షలు ఉండేదానిని రెట్టింపు చేశారు. సీనియర్ సిటిజన్లకు పాత రోజుల మాదిరిగా ఎల్ఐసి ద్వారా మేలు జరుగుతుంది. కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలన్న ప్రతిపాదనపై ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. ఎన్నికల సంవత్సరంలో పెద్ద పరిశ్రమలకు లబ్ధి చేకూర్చి వాటి నుంచి ప్రయోజనం పొందేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారన్నది వాటి ఆరోపణ. పెద్ద కంపెనీలకు మినహాయింపులు క్రమంగా రద్దు అవుతాయని జైట్లీ ప్రకటించడం గమనార్హం. అదేమిటో మరి. ఎలాగైనా ఊహించుకోవచ్చు.

ఈ బడ్జెట్‌లో ఎక్కువ మందిని సంతోష పెట్టే ప్రతిపాదనలు లేవని సుప్రసిద్ధ ఆర్థికవేత్త హరీష్ దామోదరన్ వ్యాఖ్యానించారు. జీఎస్‌టి వల్ల పన్ను రాబడి ఎంత పెరుగుతుందో మోడీ తెలుసుకున్నారా అని స్టాక్, ఆర్థిక రంగాలకు చెందిన పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బడ్జెట్లో నల్లధనం, పెద్ద నోట్ల రద్దు ప్రభావం బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేదు. వీటిపై జైట్లీ మౌనం ఆశ్చర్యకరమే. లఘు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగానికి సమగ్రమైన ప్యాకేజీని ప్రతిపాదించారు. పెద్దనోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల, హడావిడిగా జీఎస్‌టిని ప్రవేశపెట్టడం వల్ల ఈ రంగాలు బాగా దెబ్బతిన్నాయి.

సంవత్సరానికి లక్ష ట్రిప్పులు ఉండేట్టు విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచుతామని జైట్లీ ప్రకటించారు. నవంబర్‌లో కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా దేశంలో వంద విమానాశ్రయాలను కలుపుతూ ఎయిర్ కనెక్టివిటీని విస్తరింపజేస్తామని ప్రకటించారు . అలాగే, ప్రస్తుతం ఉన్న వాటి సంఖ్యను పదిహేనేళ్ళలో రెట్టింపు చేస్తామని ప్రకటించారు. జైట్లీ తన ప్రసంగంలో కేంద్రం చేపట్టిన ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పథకం ఇప్పటివరకూ పని చేయని 56 విమానాశ్రయాలకూ, 37 పని చేయని హెలిపాడ్‌లకు వర్తిస్తుందని చెప్పారు. భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఎఎఐ) ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) లేకుండా ఈ భారీ పథకాలను అమలు జేయగలదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

రైల్వేలపై 2018-19లో మూల ధన వ్యయం 1.48 లక్షల కోట్లు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సానుకూలమైనదే. ఈ రంగంలో ప్రైవేటుపెట్టుబడులు పెరగాలి. మన దేశంలో విమానాశ్రయాలు, విమాన సర్వీసుల నిర్వహణ పెరుగుతున్న తరుణంలో రైల్వేలకు ఇబ్బడిముబ్బడిగా నిధుల కేటాయింపు అవసరమే. కొత్త రైళ్ళ గురించి, రైల్వేల ఆధునీకరణ గురించి జైట్లీ ఎందుకు ప్రస్తావించలేదో మరి.

రైల్వే బడ్జెట్‌ని సాధారణ బడ్జెట్ లో విలీనం చేసి ప్రభుత్వం తప్పు చేసిందా? కొత్త రైళ్ళు,కొత్త రైలు మార్గాల కోసం ప్రజలు ఎదురు చూసే అవకాశాన్ని మోడీ ప్రభుత్వం లాగేసుకుంది.

బుల్లెట్ రైళ్ళ యుగంలో సంప్రదాయక రైళ్ళ పట్ల ఈ నిర్లక్ష్యం ఏమిటి? మళ్ళీ రైల్వేశాఖకు ప్రత్యేక బడ్జెట్ రావల్సిన సమయం ఆసన్నమైంది కదూ!

బడ్జెట్‌కు ముందు...

కేంద్రం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు వడ్డింపులు.. కేటాయింపులు చూసేందుకూ.. తెలుసుకునేందుకూ టీవీల ముందు కూర్చుంటాం. ఆర్థికమంత్రిగారూ గడగడా బడ్జెట్ చదివేస్తారు. కాస్త సేదదీరుతూ.. మంచినీరు తాగుతూ.. అటూ ఇటూ లుక్కులిస్తూ.. నవ్వుతూ.. చలోక్తులు విసుర్లతో ఆయన ప్రసంగం సాగిపోతుంది. అధికార పక్ష సభ్యుల చప్పట్లు.. విపక్షం అరుపులూ కూడా వినిపిస్తాయి. అసలీ బడ్జెట్ రూపొందడానికి ముందు చేసే కృషి ఏమిటి? దీనివెనుక కీలకాంశాలేమిటి? పాటించే సంప్రదాయాలేమిటి? ఉదాహరణకు బడ్జెట్ ప్రసంగానికి ముందు ఆర్థికమంత్రి ఓ బ్రీఫ్ కేస్ పుచ్చుకుని ఫొటోలకు పోజులిస్తారు. బడ్జెట్‌కు ఇదొక చిహ్నంలా మారింది. కెమెరాలకు ఇదొక సబ్జెక్ట్.

ఆర్థిక మంత్రి చేతిలో బ్రీఫ్ కేసు: కేంద్ర బడ్జెట్‌లో పాటించే అత్యంత ప్రముఖమైన సంప్రదాయమిది. బ్రిటిష్ కాలంలోనే ఇది ఆరంభమైంది. 1860లో గ్రేట్ బ్రిటన్ రాజకోశ అధికారి విలియమ్ ఇవర్ట్ గ్లేడ్‌స్టోన్ తొలిసారి బడ్జెట్ బాక్సును చేత పట్టుకెళ్ళారు. అప్పటి నుంచి ఇది సంప్రదాయంగా వస్తోంది. బ్రిటిష్ పరిపాలనలో ఉన్న భారత్‌లో కూడా ఈ సంప్రదాయాన్నే పాటించారు. అదే నేటికీ కొనసాగుతోంది. బ్రిటన్ ఛాన్సెలర్లు తమ వారసులకు బడ్జెట్ బాక్సులను అందజేశారు. స్వాతంత్ర్యానంతరం భారత్ దాని స్థానంలో బ్రీఫ్ కేసులను ప్రవేశపెట్టింది. ఇంతవరకూ ఎర్ర రంగు బ్రీఫ్ కేసును వాడారు. ఈ పర్యాయం దాని రంగు ఎరుపు వర్ణం కలిసిన గోధుమ రంగుగా మారింది.

హల్వా ఉత్సవం: ఒక శుభ సందర్భాన్ని ప్రారంభించే ముందు మిఠాయి తినడం భారతీయ సంప్రదాయం. దీని నుంచే హల్వా ఉత్సవం ఆవిర్భవించింది. బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రిత్వ శాఖలోని అందరు అధికారులకూ ఆర్థిక మంత్రి సమక్షంలో హల్వాను ఇస్తారు. బడ్జెట్ తయారీలో నిమగ్నమయ్యే అధికారులు, సిబ్బందినంతటినీ పనిచేసే ప్రదేశంలోనే ఉంచి తాళం వేసేస్తారు. వారికి ఎటువంటి సమాచార సాధనమూ ఉండదు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంచుతారన్నమాట. ఆఖరుకు స్నేహితులు, కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడే అవకాశముండదు. అత్యవసర సమయాల్లో ఫోను చేసుకోవడానికి వీలు కల్పిస్తారు. ఆ కాల్స్‌ను కూడా అధికారులు నిశితంగా పరిశీలిస్తారు. నార్త్ బ్లాక్‌లోని భూగృహంలో వారిని ఉంచుతారు. వారికి ఇంటర్నెట్ సదుపాయం సైతం అందుబాటులో ఉండదు. ఆర్థిక మంత్రి లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరవాత మాత్రమే వారిని బయటకు విడిచిపెడతారు.

ఆర్థిక-రైల్వే బడ్జెట్: ఆర్థిక, రైల్వే బడ్జెట్లను 92ఏళ్ళ పాటు కేంద్ర ప్రభుత్వం విడివిడిగా సమర్పించింది. బ్రిటీష్ హయాంలోనే ఈ సంప్రదాయం ప్రారంభమైంది. బ్రిటన్ అధికారం చెలాయించిన అన్ని దేశాల్లో దీన్ని పాటిస్తున్నారు. 2017లో ఎన్డీయే ప్రభుత్వం ఈ సంప్రదాయానికి తిలోదకాలిచ్చింది. ఆర్థిక-రైల్వే బడ్జెట్లను కలిపేసి సమర్పించింది. కొత్త విధానానికి తెరదీసింది.

బడ్జెట్ తేదీ.. సమయం: బ్రిటీష్ హయాంలో ఫిబ్రవరి ఆఖరు రోజున సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. సాయంత్రం 5 గంటలకు ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ప్రారంభమయ్యేది. బ్రిటన్‌కు చెందిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరవాత భారత్ బడ్జెట్‌ను సమర్పించేవారు.

స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని దశాబ్దాల పాటు ఈ సంప్రదాయం కొనసాగింది. 1999లో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా దీన్ని తోసిరాజన్నారు. ఉదయం 11గంటలకు ప్రసంగం ప్రారంభించి, బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ సమయాన్ని అనుసరిస్తున్నారు. 2016లో ఎన్డీయే ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని కూడా మార్పు చేసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం మొదలైంది.

పత్రాల ముద్రణ: బడ్జెట్ పత్రాలను రాష్ట్రపతి భవన్‌లో ఉన్న ముద్రణాలయంలో ముద్రించేవారు. 1950లో బడ్జెట్ ప్రసంగానికి ముందే వెల్లడవ్వడంతో ముద్రణను 1980లో ఢిల్లీలోని మింటో రోడ్‌లో ఉన్న ముద్రణాలయానికి మార్చారు. తదుపరి నార్త్ బ్లాక్ ప్రత్యేకంగా ముద్రణాలయాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడే అధికారులను ఉంచి తాళం వేస్తారు. బడ్జెట్ ప్రతుల ముద్రణకు ఇదే వేదిక.

❑ కె.వి.ఎస్



హామీలన్నీ గాలికి...!



జోన్ ఊసే లేదు



పత్తాలేని పోలవరం



అమరావతికి అడియాస



మెట్రో మాటే కరవు

(మొదటిపేజీ తరువాయి)

కోస్తాంధ్ర ప్రజలకు కోపం తెప్పించింది. అంతేకాకుండా అన్ని రాజకీయ పార్టీలు సైతం ఆగ్రహంగా ఉన్నాయి. అయితే బడ్జెట్‌లో ఏపీలో రైల్వేల అభివృద్ధికి చిన్న చిన్న చర్యలు తీసుకోవడం మినహా పెద్దగా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదంటున్నారు.

రాష్ట్రంలోని కొన్ని రైల్వే స్టేషన్లను ఆదర్శ స్టేషన్లుగా ప్రకటించి, కంటి తుడుపు చర్యలు తీసుకున్నారనే విమర్శలున్నాయి. ఆదర్శ రైల్వేస్టేషన్లుగా గుంటూరు, వినుకొండ,మంత్రాలయం రోడ్, మచిలీపట్నం, రామకుండి, ఒంగోలు, డొనకొండ, మార్కాపురం రోడ్, విశాఖపట్నం ,ఆదోని, దువ్వాడ, బొబ్బిలి, పార్వతీపురం స్టేషన్లను ప్రకటించారు. అంతేకాకుండా విజయవాడ, కడప, తిరుపతి, మచిలీపట్నం స్టేషన్లను మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

ఎస్కోట, శివలింగాపురం, బొద్దవరం, బొర్రాగుహలు ,అరకు,సిమిలిగూడ రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌ల విస్తరణకు చర్యలు తీసుకుంటామని ప్రస్తావించారు. విజయనగరం -సంబల్‌పూర్ మూడో మార్గం రైల్వే లైన్‌కు రూ. 90 కోట్లు, కాజీపేట - విజయవాడ మూడో రైల్వే లైన్‌కు 100 కోట్లు. నల్లపాడు -గుంతకల్ లైన్ విద్యుద్ధీకరణకు రూ. 150 కోట్లు. నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌కు రూ. 340 కోట్లు. కోటిపల్లి -నర్సాపూర్ కొత్త రైల్వే లైన్‌కు రూ. 430 కోట్లు కేటాయింపులు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. అయితే ఈ బడ్జెట్‌లో రైల్వే భద్రతకు, ప్రయాణికుల భద్రతకు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ పెద్ద పీట వేశారని చెప్పక తప్పదు. అంతేకాకుండా రైల్వే విద్యుద్ధీకరణకు కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అన్ని రకాల రైళ్లలో వైఫై,సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. రైల్వే మూలధన వ్యయంరూ. 1.48 లక్షల కోట్లుగా పేర్కొన్నారు. రూ. 4,200 మానవ రహిత రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల తొలగించనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ముంబై లోకల్ రైళ్లకోసం 90 కి.మీ. మేర సబర్బన్ లైన్ నిర్మాణంతో పాటు రైల్వే భద్రతలో భాగంగా ట్రాక్ ఇన్స్పెక్షన్‌కు పెద్దపీట వేశారు. 18వేల కి.మీ రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా 600 కీలక రైల్వే స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా వడోదరలో రైల్వే విశ్వ విద్యాలయం ఏర్పాటుకు కూడా కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇలా ఉంటే లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మొండి చేయి చూపించారు, ఏపీ ప్రజలకు తీరని అన్యాయం చేశారంటూ వైసీపీ శ్రేణులు విశాఖలోని ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో నిరసన తెలిపారు.రోడ్డుపై బైఠాయించి,ధర్నా చేశారు. బడ్జెట్‌లో రైల్వే జోన్ ఊసెత్తకుండా ఏపీ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేశారని వైసీపీ విమర్శించింది. గతంలో రైల్వేకు సంబంధించి ఎంపీలు చేసిన విన్నపాలను రైల్వే బోర్డు పట్టించుకోవడం లేదంటున్నారు. ఏపీ రాజధానికి విజయవాడ కీలకంగా మారిన నేపథ్యంలో కొత్త రైళ్లు ఈసారి లేకపోవడం విమర్శలకు దారి తీసింది. రెండేళ్ల కిందట విజయవాడ - తుళ్లూరు మధ్య కొత్త రైలు మార్గం ప్రకటించి,నిధులు కేటాయించినా సర్వే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ మార్గం పనులు పూర్తయి వినియోగంలోకి వస్తే రాజధానికి అనుసంధానం పెరుగుతుంది.కానీ దీని గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. అలాగే కాజీపేట నుంచి విజయవాడ, దువ్వాడ నుంచి తద వరకు చేపట్టిన మూడో మార్గం పనులగురించి కూడా ఎటువంటి ప్రస్తావన రాలేదు. సాంకేతిక కారణాలు చూపుతూ రైల్వే బోర్డు రైల్వేజోన్‌ను పక్కకుపెట్టిందంటున్నారు. 5 ఏళ్ల కిందట బడ్జెట్‌లో ప్రకటించిన లైటెనింగ్ ప్రాజెక్టు కూడా నిరుగారిపోయింది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో రూ.180 కోట్లతో నిర్మించ తలపెట్టిన మల్టీ ఫంక్షనల్ కాంప్లెక్స్‌లు,వినోద కేంద్రాలు , అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు గురించి ప్రస్తావన లేదంటున్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఇటీవల రైళ్లలో క్రమంగా చోరీలు,దాడులు జరుగుతోన్న నేపథ్యంలో వాటిని నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టారు. అన్ని స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని స్టేషన్లతో పాటు రైళ్లలోను సీసీటీవీలు ఏర్పాటు చేయనున్నారు. 25వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తోన్న ప్రతి స్టేషన్లలో ఎస్కలేటర్లను సిద్ధం చేయనున్నారు. 600 ప్రధాన రైల్వేస్టేషన్లను అభివృద్ధిపర్చనున్నారు. 4,267 కాపాలాలేని లెవల్ క్రాసింగులను తొలగించాలని నిర్ణయించారు. విభజన హామీలు,రైల్వే ప్రస్తావన లేదు. రైల్వేజోన్ ప్రకటన, ఇలా పలు హామీలపై ఊసేలేకపోవడంతో ఏపీ ప్రజలకు మరింత ఆగ్రహాన్ని తెప్పించింది. పోలవరం ప్రాజెక్టు సైతం నిరాశేనని.. నిర్మాణానికి నిధుల ఊతంపై బడ్జెట్‌లో భరోసా కల్పిస్తారన్న అంచనాలను కేంద్రం విస్మరించిందంటున్నారు. ఇక విశాఖ,విజయవాడ మెట్రో రైళ్ల ఊసే లేకుండా పోయింది. వీటి ఏర్పాటుకు సందిగ్ధత ఏర్పడింది. విశాఖ జోన్ 50 ఏళ్ల నాటి డిమాండ్. ఏపీ విభజన చట్టంలో ఈ హామిని చేర్చారు. విశాఖ,విజయవాడ,గుంటూరు,గుంతకల్లు డివిజన్లతోకలిసి విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని కేంద్రం గతంలో హామీ ఇచ్చింది. విభజన జరిగి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా ఈ హామి అమలుకు నోచుకోలేదు. దీనికోసం మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ పోరాడుతున్నారు.తాజాగా ఆయన ఢిల్లీలో రైలు యాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ముందుగానే ఢిల్లీ వెళ్లి,మంత్రులు,ఎంపీలను కలిసినా బడ్జెట్‌లో రైల్వేజోన్ అంశాన్ని ప్రస్తావించకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈవిషయమైబుధవారం కేంద్రమంత్రి గడ్కరీని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, ఉత్తరాంధ్ర చర్చావేదికఅధ్యక్షుడుకొణతాలరామకృష్ణ,అరకు ఎంపీ కొత్తపల్లి గీత తదితరులు కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది.

హీరోలు.. జీరోలు

వ్యవసాయదారులు : ఈ బడ్జెట్‌లో వ్యవసాయదారులే అతిపెద్ద విజేతలు. పంటలకు కనీస మద్దతు ధర, వ్యవసాయ మార్కెట్లపై భారీ మొత్తంలో పెట్టుబడులు, గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువ నగదు, సోలార్ పంపుల ద్వారా రైతులు ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను రాష్ట్రాలు కొనుగోలు చేసేలా ఆదేశం వంటి వాటిని జైట్లీ ప్రవేశపెట్టారు. దీంతో వ్యవసాయ ఆధారిత కంపెనీలు శక్తి పంప్స్ ఇండియా లిమిటెడ్, జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్, కేఎస్‌బీ పంప్స్ లిమిటెడ్, కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్, అవంతి ఫీడ్స్ లిమిటెడ్, వాటర్‌బేస్ లిమిటెడ్, జేకే అగ్రి జెనెటిక్స్ లిమిటెడ్, పీఎల్ ఇండస్ట్రీస్ లకు లబ్ది చేకూరనున్నట్టు తెలుస్తోంది.

ఆరోగ్య సంరక్షణదారులు...

కేంద్రం కొత్తగా ప్రవేశపెడుతున్న నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్ ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. 5 లక్షలు ఆరోగ్య బీమా కల్పిస్తామని జైట్లీ హామీ ఇచ్చారు. ఈ ప్రకటనతో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్, ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ లాంటి కంపెనీలు ఎక్కువగా లబ్ది పొందనున్నాయి.

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు...

రోడ్డు, రైల్వే మౌలిక సదుపాయాలకు ఎక్కువ మొత్తంలో వెచ్చించనున్నట్టు జైట్లీ ప్రామిస్ చేశారు. ఈ వాగ్దానంతో నిర్మాణ, ఇంజనీరింగ్ సంస్థలకు, రైల్వే వాగన్ ప్రొడ్యూసర్లకు ఎక్కువగా ప్రయోజనం చేకూరనుంది.

కన్జ్యూమర్ కంపెనీలు...

హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్, బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్, మారికో లిమిటెడ్ వంటి కన్జ్యూమర్ గూడ్స్ కంపెనీల్లో ఇక రోజువారీ కూలీలకు ఉద్యోగం లభించనుంది. హీరో మోటార్‌కార్ప్ లిమిటెడ్, ఎం అండ్ ఎం లిమిటెడ్, లార్సెన్ అండ్ టుబ్రో లిమిటెడ్‌లకు లబ్ది చేకూరనుంది. జువెల్లర్స్, ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థలు కూడా జైట్లీ బడ్జెట్‌లో విన్నర్లుగా ఉన్నాయి.

జీరోలు..

ఆపిల్, శాంసంగ్ : మొబైల్ ఫోన్లపై బడ్జెట్‌లో కూడా కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో, దిగ్గజ కంపెనీలు ఆపిల్, శాంసంగ్‌లకు గట్టి షాక్ ఎదురైంది. ఆపిల్ ఇంక్‌కు, శాంసంగ్ ఎల?క్ట్రానిక్స్ కంపెనీలు తక్కువ రిటర్నులు పొందే అవకాశం కనిపిస్తోంది.

ఫైనాన్స్ సెక్టార్ : ఈక్విటీ పెట్టుబడులపై ప్రభుత్వం ఎల్‌టీసీజీ పన్ను విధింపు నిర?యాన్ని ప్రకటించడంతో, ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీలు, లైఫ్ ఇన్సూరర్స్, మ్యూచువల్ ఫండ్స్ ఉత్పత్తుల ప్రొవైడర్ల సెంటిమెంట్ దెబ్బతిన్నది.

రక్షణ రంగం : రక్షణ రంగానికి అంత పెద్ద మొత్తంలో బూస్టింగ్‌ను ఏమీ జైట్లీ ప్రకటించలేదు. దీంతో భారత్ ఫోర్స్ లిమిటెడ్ లాంటి రక్షణ రంగ కంపెనీలకు ప్రతికూలమే అని తెలుస్తోంది.

కన్జూమర్స్ : ఆరోగ్యానికి సంబంధించిన ప్లాన్లు, లక్ష మంది పేద భారతీయులకు లబ్ది చేకూరనుంది. ఈ ప్లాన్ల కోసం విధించే హెల్త్, ఎడ్యుకేషన్ లెవీని 3 శాతం నుంచి 4 శాతం పెంచారు. ఈ లెవీ అన్ని ఉత్పత్తులకు, సర్వీసులకు అమలు చేయనున్నారు.

బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు

అమరావతి, ఆంధ్రప్రభ : ఈసారి బడ్జెట్‌లో పోలవరం,రైల్వేజోన్ వంటి ముఖ్యాంశాల ప్రస్తావన లేకపోయినా విద్యకు మాత్రంఎంతోకొంత నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించి, కొద్దిగా ఏపీ ప్రజలకు ఊరటనిచ్చారని చెప్పవచ్చు. అదీనూ కేంద్ర విద్యా సంస్థలకే ఈ నిధులను కేటాయించారు. కేంద్ర విద్యా సంస్థలైన ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌కు రూ. 5 కోట్లు, ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ పెట్రోలియంకు రూ. 32 కోట్లు, ఏపీ ట్రిపుల్ ఐటీకీ రూ. 30 కోట్లు, ఏపీ ఐఐటీకి రూ.50 కోట్లు, ఐఐఎంకు రూ. 42 కోట్లు, ఐఐఎస్‌సీఆర్‌కు రూ. 49 కోట్లు, ఏపీ గిరిజన యూనివర్శిటీకి రూ. 10 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి జైట్లీ తెలిపారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పలు విద్యా పథకాలు, నిధుల ఊసే లేదంటున్నారు.

మార్కెట్ నుంచి రూ.4.07 లక్షల కోట్ల సేకరణ

కేంద్రప్రభుత్వం వచ్చే ఆర్థికసంవత్సరం 2018-19లో మార్కెట్ నుంచి రూ.4.07 లక్షలకోట్లు మాత్రమే సేకరిస్తుంది. ఈ ఆర్థికసంవత్సరంతో పోల్చుకుంటే రూ.73,000 కోట్లు తగ్గిందని చెప్పవచ్చు. సవరించిన అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ నుంచి రూ.4.79 లక్షలకోట్లు సేకరిస్తుంది. అయితే బడ్జెట్ అంచనా మాత్రం రూ.3.5 లక్షల కోట్లు. అయితే మార్కెట్ల నుంచి ఈ ఆర్థికసంవత్సరం గరిష్ఠంగా రూ.5.99 లక్షల కోట్లు సేకరించాలని నిర్ణయించింది. బడ్జెట్ అంచనా మాత్రం రూ.5.8 లక్షల కోట్లు. వచ్చే ఆర్థికసంవత్సరానికి గరిష్టంగా మార్కెట్ల నుంచి రూ.6.05 లక్షల కోట్లు సేకరించాలని నిర్ణయించింది. గరిష్ఠంగా నిధులు ఎందుకు సేకరిస్తుందంటే తీసుకున్న రుణాలు దానిపై వడ్డీలు చెల్లించడానికి వినియోగిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పాత రుణాలు రూ.1.4 లక్షల కోట్ల వరకు ఉన్నాయి.

ప్రజాహిత వ్యాజ్యాలు ప్రధాన న్యాయమూర్తికే

కొత్త రోస్టర్ ప్రకటించిన సీజేఐ దీపక్ మిశ్రా

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కేసు విచారణ రోస్టర్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దీపక్ మిశ్రా తొలిసారి బహిరంగ ప్రకటన చేశారు. కొత్త రోస్టర్ ప్రకారం సిజేఐ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, ఎన్నికల వివాదాల కేసులు, నేర సంబంధిత కేసులు సామాజిక న్యాయానికి సంబంధించిన కేసులను విచారిస్తారు. కేసుల విచారణ సమయంలో అవసరమైతే రాజ్యాంగ బెంచ్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ నెల 5వతేదీనుంచి సుప్రీం న్యాయమూర్తులు విచారణకు స్వీకరించే కేసులకు సంబంధించి రోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. రోస్టర్ విధానంపై కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టులో సంక్షోభం ఏర్పడిన విషయం విదితమే. సుప్రీంకోర్టు వెబ్ సైట్‌లో రోస్టర్‌కు సంబంధించిన వివరాలు ఉంటాయి.

బడ్జెట్ వేళ.. మోడీకి షాక్!

న్యూఢిల్లీ: ఉప ఎన్నికల పోరులో అధికార బీజేపీకి చుక్కెదురైంది. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. రాజస్థాన్ లోని అల్వార్, అజ్మీర్ లోక్‌సభ స్థానాలతోపాటు, మండల్గర్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ విజయ బావుటా ఎగురేసింది. అదేవిధంగా పశ్చిమ బెంగాల్లోని ఉలుబెరియా లోక్‌సభ , నొయపారా అసెంబ్లీ స్థానాల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయ కేతనం ఎగురవేసింది. గత 2016 ఎన్నికల్లో కాంగ్రెస్ నొయపారా అసెంబ్లీ స్థానంతోపాటు 44 స్థానాలను గెలుచుకుంది. తాజాగా ఈస్థానాన్ని తృణమూల్ తన్నుకు పోయింది. ఉలుబెరియా లోక్ సభ స్థానాన్ని నిలబెట్టుకోవటంతోపాటు, నొయపారా అసెంబ్లీ స్థానాన్ని తన ఖాతాలో వేసుకుంది. రాజస్థాన్‌లో రెండు లోక్ సభ స్థానాలకు, ఒక అసెంబ్లీ స్థానానికి, పశ్చిమ బెంగాల్లో ఒక లోక్ సభ, ఒక అసెంబ్లీ స్థానానికి డిసెంబర్ 29న ఉప ఎన్నిక జరిగిన సంగతి విదితమే. రాజస్థాన్‌లోని మండల్‌గర్ అసెంబ్లీ స్థానంతొపాటు, అల్వార్, అజ్మీర్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ పరాజయం పాలైంది. రాజస్థాన్‌లో జరిగిన మూడు స్థానాల్లో అధికారక బీజేపీ సభ్యుల మరణంతో ఆయా స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించగా తాజా ఎన్నికల్లో ఆ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అదేవిధంగా బెంగాల్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ అధికార తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది.


విపక్ష నేతలతో సోనియా భేటీ

బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వంపై పోరు వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వంపై పోరాడేందుకు ఐక్యంగా అనుసరించాల్సిన వ్యూహంపై యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, విపక్ష నేతలతో చర్చించారు. గురువారం బడ్జెట్ సమావేశం ముగిసిన తర్వాత పార్లమెంటు లైబ్రరీ బిల్డింగ్‌లో ఆమె విపక్షనేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ,సీనియర్ నేతలు గులాంనబీ ఆజాద్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్, ఎన్సీ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత జై ప్రకాశ్ నారాయణ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, సిపిఐ నేత డి.రాజా , సమాజ్‌వాదీ పార్టీ నేత రాంగోపాల్ యాదవ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగిన తర్వాత సోనియాగాంధీ తొలిసారిగా ఈ సమావేశం నిర్వహించారు. యూపీఏ ఛైర్‌పర్సన్‌గా, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్‌గా ఆమె కొనసాగుతున్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లు తీసుకురానున్న నేపథ్యంలో దానిపై ఎలా వ్యవహరించాలనేదానిపై చర్చించారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మధ్య తలెత్తిన వివాదం, ఉత్తరప్రదేశ్‌లో మతఘర్షణలు తదితర అంశాలను సభలో ఎలా లేవనెత్తాలనేదానిపై వివిధ పార్టీల నేతల తమ అభిప్రాయాలు తెలిపారు. మూడురోజుల కిందట శరద్ పవార్ నివాసంలో విపక్ష నేతలు సమావేశమై ఉమ్మడిగా ప్రభుత్వంపై పోరాడే అంశాలపై చర్చించారు. అయితే దీనిపై విస్తృతంగా చర్చించేందుకు సోనియాగాంధీ అధ్యక్షతన మరోసారి సమావేశమైనట్లు తెలిసింది.



ఏపీకి తీవ్ర అన్యాయం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేశాయి. మన రాష్ట్రానికి సంబంధించి పూర్తి నిరుత్సాహకరమైన బడ్జెట్ ఇది. ఇదే చివరి బడ్జెట్ కాబట్టి విభజన హామీలను ఇందులో పెట్టాలని కోరాం. లేఖ రాశాం. ఒక్క అంశం కూడా ఇందులో ప్రస్తావించలేదు. ఎక్కడా ప్రత్యేక హోదా ఊసే ఎత్తలేదు. పోలవరం ప్రాజెక్టు ప్రస్తావన రాలేదు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణాన్ని 2019 నాటికి పూర్తి చేయాలనేలక్ష్యం కూడా బడ్జెట్‌లో లేదు. కడపస్టీలు ప్లాంటు, రైల్వే జోన్ ప్రసక్తి లేదు. ఏపీలో గత నాలుగేళ్ల నుంచి కరవు తాండవిస్తోంది. గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారిని ఆదుకోడానికి రుణమాఫీ వంటి పథకాలు ఏమీ లేవు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి అన్యాయం చేసింది. కనీస మద్ధత ధర అంటున్నారు. అది ఏ మేరకు రైతులకు ఉపయోగపడుతుందో చూడాలి. ఆరోగ్యపరంగా చూస్తే రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని తలపించే పది కోట్ల కుటుంబాలు, 50 కోట్ల మందికి లబ్ది చేకూరేలా ఆపరేషన్ బీమా పథకం ఒక్కటే మేలైన కార్యక్రమం. అది తప్ప సామాన్యుడికి మేలు చేసేది ఏదీ లేదు.

ఏపీకి ఒరిగిందేమీ లేదు : మిథున్ రెడ్డి, ఎంపీ

వైకాపా నేతలు, మిగతా నేతలంతా విభజన హామీలపై పట్టుబడుతున్నారు. స్టీల్ ప్లాంట్ పైనా స్పష్టత ఇవ్వలేదు. ఒకటిన్నర రెట్లు కనీస మద్ధతు ధర ఇవ్వాలి అన్నారు. రైతులకు ఉపయోగమని మేం పదే పదే అడగడంతో దానిపై సానుకూలంగా స్పందించారు. పోలవరాన్ని ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. నిధులు కేటాయించకుండా ఎలా పూర్తి చేస్తారో ప్రభుత్వమే చెప్పాలి. 16వేల కోట్ల రూపాయల



ప్రాజెక్టు తడిసి మోపెడయ్యింది. ఇంకా 40 వేల కోట్లు కేటాయించాలి. స్పెషల్ స్టేటస్.. లేదు ప్యాకేజీ అన్నారు. ప్యాకేజీ స్టేటస్ కంటే బావుంటుంది అన్నారు. అదీ రాలేదు. ప్యాకేజీ మాట ఏమైంది..? స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఉన్న అప్పులకు మూడున్నర రెట్లు అప్పులు చేశారు. రాష్ట్ర పరిస్థితి చాలా దారుణంగా ఉంది. అయినా బడ్జెట్‌లో పూర్తిగా మొండిచేయి చూపారు. వాళ్ల మనసులో ఆంధ్ర రాష్ట్రం ఉందా లేదా అర్థం కావడం లేదు. బీజేపీ, తెదేపా వీళ్లతో ఏం పని అనుకుంటూ ఉండవచ్చు. వాళ్లకు ఈ బడ్జెట్ రాజకీయంగా పెద్ద దెబ్బ.

అసంతృప్తికర బడ్జెట్ : వరప్రసాద్, తిరుపతి ఎంపీ

విభజన చట్టంలో ఎన్నో చేస్తామన్నారు. ఏదీ జరగలేదు.



దుగ్గరాజపట్నం, కడప స్టీలు ప్లాంటు ప్రస్తావన ఏదీ లేదు. ఏ అంశమూ ఉత్సాహంగా కనిపించలేదు. గ్రామాలకు, నగరాలకు ఉన్న వ్యత్యాసం ఇంకా పెరిగిపోతుంది. ఏరోజైతే గ్రామాల అభివృద్ధి జరుగుతుందో అదే నిజమైన అభివృద్ధి. బడ్జెట్‌లో కార్పొరేట్ రంగం మీద ఎక్కువ ఫోకస్ చేసినట్టు అనిపిస్తోంది. దానికి బదులు పేదల మీద దృష్టి పెట్టి ఉంటే బావుండేది. ధరలు పెరిగి పోతున్న సమయంలో ట్యాక్స్ పేయర్లకు, ఉద్యోగులక ు పన్ను రాయితీలూ ఇచ్చి ఉంటే బావుండేది. ధరలు బాగా పెరిగిపోతున్నాయి కాబట్టి పన్ను మినహాయింపు పరిధి పెంచాల్సింది.

ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగండి

- **ఏపీ నేతలకు అమిత్ షా దిశానిర్దేశం**
- **పార్టీలో అంతర్గత విభేదాలపై క్లాస్**

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ బీజేపీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలపై పార్టీ అధినేత అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. గురువారం రాత్రి ఢిల్లీలోని తన నివాసంలో ఏపీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన గ్రూపు తగాదాలపై నేతలను నిలదీసినట్టు సమాచారం. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై సమీక్షించేందుకు దక్షిణాది రాష్ట్రాల నేతలను ఢిల్లీకి పిలిపించిన అమిత్ షా, ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, పురందేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, సోము వీర్రాజు, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారని తెలుస్తోంది. గంటకు పైగా జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ నియోజకవర్గాల వారిగా నియమించిన ఇంచార్జులు అందజేసిన నివేదికలపై చర్చ జరిగింది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులుగా ఎవరెవరికి అర్హతలున్నాయన్న విషయంపై నియోజకవర్గాల ఇంచార్జులు నివేదికలు అందజేశారు. అలాగే ఆయా నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులపైనా సమగ్ర అధ్యయనం చేశారు. ఉత్తరాంధ్ర నియోజకవర్గాలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, మధ్యాంధ్ర నియోజకవర్గాలకు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కే సింగ్, రాయలసీమ జిల్లాలకు మహారాష్ట్ర మంత్రి వినోద్ తవడే ఇంచార్జులుగా ఉండి పార్టీ స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదికలు రూపొందించారు. రాష్ట్ర నేతలు చెప్పే సమాచారానికి, కేంద్ర పార్టీ ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఇంచార్జిలు ఇచ్చిన సమాచారాన్ని పోల్చి చూసుకుంటూ అమిత్ షా సమీక్ష జరిపారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే హరిబాబు వర్గంగా పేరున్న నేతలకు, సోము వీర్రాజు, పురందేశ్వరి వర్గంగా పేరున్న నేతలకు మధ్య విబేధాలు కూడా చర్చకొచ్చాయని సమాచారం. సమావేశం అనంతరం బయటికొచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు మీడియాతో మాట్లాడుతూ, కింది స్థాయిలో కార్యకర్తల సంఖ్యను పెంచుకోవాలని, బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని పార్టీని సంస్థాగతంగా బలంగా తీర్చిదిద్దాలని అమిత్ షా సూచించారని తెలిపారు. సంస్థాగత అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగిందని అన్నారు. అమిత్ షా ఈసారి జరిపే రాష్ట్ర పర్యటన రాయలసీమ ప్రాంతంలో చేపట్టాలని కోరినట్టు చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. తెలుగుదేశం పార్టీతో పెరుగుతున్న దూరం గురించి ప్రశ్నించగా, ప్రస్తుతానికి రెండు పార్టీలు మిత్రపక్షాలుగానే ఉన్నాయని అన్నారు. మిత్రపక్షాల మధ్య ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పుకొచ్చారు. భాగస్వామ్య పార్టీల మధ్య అప్పుడప్పుడు వచ్చే చిటపటలు చిటికెలో పోతాయని వ్యాఖ్యానించారు. ఒకవేళ అలాంటి ఇబ్బందులేవైనా తలెత్తినా చర్చించుకుని పరిష్కరించుకుంటామని హరిబాబు తెలిపారు. 10న విజయవాడలో నియోజకవర్గాల ఇంచార్జిలు రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలతో సమావేశమవుతారని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కేంద్ర బడ్జెట్ ఒక రాష్ట్రం కోసం కాదు: పురంధేశ్వరి

సమీక్షా సమావేశంలో పాల్గొన్న మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి తెలుగుదేశం నేతల అసమ్మతి స్వరంపై పార్టీ అధినేతకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుస్తూ చేసిన వ్యాఖ్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. ఈ సందర్భంగా బదులిస్తూ.. కేంద్ర బడ్జెట్ ఏదో ఒక రాష్ట్రాన్ని దృష్టిలో పట్టుకొని చేసేది కాదని, దేశవ్యాప్తంగా అమలు చేసే పథకాలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే రూపొందిస్తారని అమిత్ షా చెప్పినట్టు ఆమె తెలిపారు.

మాతృ భాష పరిరక్షణ

మాతృమూర్తులదే



- **స్వయం ఉపాధి మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది: ఏపీ మహిళా కమిషన్ సభ్యులతో వెంకయ్య మాటామంతీ**

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మాతృభాష కళ్లవంటిదైతే... ఆంగ్లం కళ్లద్దాల వంటిదని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. దేశంలో మాతృభాష పరిరక్షణకు మాతృమూర్తులందరూ నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో తనను కలిసిన ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యులతో వెంకయ్య నాయుడు మరియు ఆయన సతీమణి ఉషా నాయుడు మాటామంతీ సాగించారు. మాతృభాషను ప్రోత్సహించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు పదో తరగతి వరకూ తెలుగును తప్పనిసరి చేయడం హర్షణీయమని, తప్పనిసరిగా ప్రతిఒక్కరూ తమ పిల్లలకు తల్లి భాషను నేర్పాలని సూచించారు. ఆంగ్లానికి తాను వ్యతిరేకం కాదని, మాతృభాష తర్వాతే ఇతర భాషల మీద దృష్టి పెట్టాలని వెంకయ్య అభిప్రాయపడ్డారు. భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని, పూర్వీకులు అందించిన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని అన్నారు. ప్రోత్సహించి ముందుకు పంపితే మహిళలు సాధించలేదని ఏదీ లేదని వెంకయ్య నాయుడు మహిళా కమిషన్ సభ్యులతో చెప్పుకొచ్చారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్న ఆయన, కేవలం రిజర్వేషన్లతోనే ఆడవారి సమస్యలన్నీ తీరిపోవనీ తెలిపారు. మహిళా బిల్లును ముందుకు తీసుకువెళ్లేందుకు రాజకీయ చిత్తశుద్ధి మరియు పరిపాలనా చిత్తశుద్ధి ఉండాలని అన్నారు.

దేశ ప్రగతికి చదువు చాలా అవసరమని, ప్రతి ఆడపిల్లా తప్పనిసరిగా చదువుకోవాలని వెంకయ్య నాయుడు సూచించారు. అలాగే మహిళలకు ఆర్థిక స్వావలంబన చాలా అవసరమని, వారికి ఆస్తిలో సమాన హక్కు కల్పించాలని అన్నారు. అలాగైతే మహిళలు స్వశక్తితో వారి కాళ్ళపై వారు నిలబడగలుగుతారని చెప్పారు. ఏపీ, తెలంగాణాల్లో స్వర్ణ భారత్ ట్రస్ట్ గ్రామీణ మహిళలకు, బాలికలకు కుట్టుపని, అల్లికలు, ఎంబ్రాయిడరీ వంటి పనులు నేర్పించడం, కౌశల్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి స్వయం ఉపాధి లభిస్తోందని, స్వావలంబన లక్ష్యంగా మహిళలు శిక్షణ పొందుతున్నారని ఉదహరించారు. వివిధ రంగాలలో బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇప్పించడంతో, వారు సొంతంగా పనులు చేసుకుంటూ మగవారికి చేయూతగా నిలుస్తున్నారని వెంకయ్య సంతోషం వ్యక్తం చేశారు. వరకట్న నిర్మూలనలోనూ మహిళలది కీలక పాత్ర అని అన్నారు. ఉప రాష్ట్రపతి, ఆయన సతీమణి తమ విలువైన సమయాన్ని కేటాయించి తమతో గడిపినందుకు ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి ధన్యవాదాలు తెలిపారు. వారిచ్చిన సలహాలు, సూచనలు తమనెంతో ఉత్తేజపరిచాయని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. మహిళా స్వావలంబనకు తమ వంతుగా కృషి చేస్తామని నన్నపనేని రాజకుమారి అన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఉపరాష్ట్రపతి మూడు రోజుల పర్యటన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మూడు రోజులపాటు తెలుగు రాష్ట్రాలలో పర్యటించనున్నారు. నేటి ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా మేడారం చేరుకుంటారు. దేశంలోనే అతి పెద్దదైన ఆదివాసీ జాతరకు వెళ్తారు. సమ్మక్క-సారలమ్మల గద్దెలను సందర్శించి బెల్లం మొక్కుబడి సమర్పించుకుంటారు. సాయంత్రానికి విజయవాడ చేరుకుని శంకర నేత్ర చికిత్సాలయంలో ఏర్పాటు చేసిన అదనపు సౌకర్యాలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత వెంకయ్య నాయుడు కృష్ణా జిల్లా ఆత్కూరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. శనివారం ఉదయం గుంటూరు జిల్లా పెద నందిపాడులో కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ స్వర? జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం ఒమేగా హాస్పిటల్‌లోని 150 పడకల సూపర్ స్పెషాలిటీ అంకాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ స్వర?జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆదివారం ఉదయం ఉపరాష్ట్రపతి కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర?భారత్ ట్రస్ట్ రెండవ వార్షికోత్సవంలో పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక అదేరోజు మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకుంటారు.

రాహుల్‌తో ఉత్తరాంధ్ర చర్చా వేదిక భేటీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు సమావేశమయ్యారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో మూడు రోజుల కిందట ఢిల్లీ వచ్చిన ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు ఏపీలోని పరిస్థితులకు సంబంధించి పలువురు నాయకులతో సమావేశమై చర్చలు జరిపారు. ఏపీకి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిర్మాణం, ఎయిమ్స్ ఏర్పాటు, హైకోర్టు బెంచ్ విశాఖపట్నంలో ఏర్పాటు వంటి 18 అంశాలపై చర్చించారు. గురువారం రాహుల్ తో ఆయన నివాసంలో భేటీ అయ్యి ఉత్తరాంధ్ర, రాయలసీమకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద వేదిక బృందం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది.





బడ్జెట్ 2018-19

ఏంజిల్ ఇన్వెస్టర్లపై పన్ను తగ్గింపు

వెంచర్ క్యాపిటల్ ఫండ్స్‌తో పాటు ఏంజిల్ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు ఆర్జించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేయబోతోంది. స్టార్టప్ కంపెనీలకు వీరిని పెద్దమొత్తంలో పెట్టుబడులు ఆకర్షించడానికి బడ్జెట్‌లో కొన్ని నిర్ణయాలు తీసుకుంది. దేశంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తక్షణమే దీనిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో మాత్రం ఇతమిద్ధంగా తెలియదు. స్టార్టప్ కంపెనీల్లో ఏంజిల్ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతున్నట్లు వారిపై పన్ను మినహాయింపులు ఉండాలని కోరుతున్నారు. 2012 బడ్జెట్‌లో ఏంజిల్ టాక్స్‌ను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ టాక్స్ భారీగా 30 శాతానికి చేరిపోయింది. పెద్దమొత్తంలో పన్ను రుద్దడం వల్ల 2017లో దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 53 శాతం తగ్గాయని నాస్కాం పేర్కొంది. స్టార్టప్‌ల్లో పెట్టుబడులు కాస్తా రిస్కుతో కూడుకున్నవి కాబట్టి పన్ను విధానంలో కొన్ని సడలింపులు ఉండాలని వారు కోరుతున్నారు. దీంతో పాటు స్టార్టప్ షేర్ల విలువను ఖరారు చేయడంలో సరైన పద్ధతి పాటించాలని ఏంజిల్ ఇన్వెస్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఏంజిల్‌ఇన్వెస్టర్ల నుంచి సేకరించిన పెట్టుబడులపై ఆదాయపు పన్నుశాఖ అనవసరపు స్క్రూటినికి పాల్పడుతున్నాయని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పోరేట్ పన్ను తగ్గింపుపై హర్షం: దినేష్ ఆగర్వాల్



బడ్జెట్‌లో రూ.250 కోట్ల టర్నోవర్‌కంపెనీలపై కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించడం ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు. ఆన్‌లైన్‌లో రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తోందని, ఏంజిల్ ఇన్వెస్టర్ల అంశంపై కూడా ఆర్థికమంత్రి స్పందించారు కాబట్టి వ్యక్తిగతంగా తాను బడ్జెట్‌ను ఆహ్వానిస్తున్నానని ఇండియామార్ట్ వ్యవస్థాపకుడు దినేష్ అగర్వాల్ చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు.

మళ్లీ తెరపైకి ఎల్‌టీసీజీ ట్యాక్స్

● లక్ష దాటితే పన్ను కట్టాల్సిందే

ఆర్థికమంత్రి జైట్లీ బడ్జెట్ 2018-19లో తిరిగి దీర్ఘకాలిక క్యాపిటల్‌గెయిన్స్ టాక్స్ ప్రవేశపెట్టారు. లిస్టెడ్ కంపెనీల షేర్లు రూ.1 లక్షవరకు బదలీ చేస్తే 10 శాతం వరకు పన్ను చెల్లించాల్సిందే. జనవరి 31, 2018 వరకు మినహాయింపు ఉంటుంది. స్వల్పకాలికానికి క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ 12 నెలల కాలానికి 15 శాతం కొనసాగుతుంది. ప్రస్తుతం దీర్ఘకాలిక ప్రాతిపదికన ఈక్విటీ షేర్లను విక్రయించినా..ఈక్విటీ ఆధారిత మ్యూచువల్‌ఫండ్స్ పూర్తి స్థాయిలో పన్ను మిన హాయిం పుఉంది. ఒక సంవత్సరం కంటే ఎ క్కువ కాలం షేర్లను కానీ మ్యూచువ ల్‌ఫండ్ ఉంచుకొని విక్రయిం చుకుంటే వాటిపై ఎలాంటి పన్ను చెల్లిం చాల్సి ఉం డదు. స్వల్ప కాలానికి ఈక్విటీ షేర్లను లేదామ్యూచువ ల్‌ఫండ్స్‌ను విక్ర యిస్తే స్వల్పకాలిక షార్ట్‌టర్మ్‌గెయిన్ టాక్స్ 15.45 శాతం (ఎడ్యుకేషన్ సెస్)కలు పుకొని చెల్లించాల్సి ఉంటుంది.



బడ్జెట్‌కు కార్పొరేట్ జై

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2018-19 అద్భుతంగా ఉందని భారత్ కార్పొరేట్లు కొనియాడుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి అందుబాటులో ఉన్న అంశాలపై దృష్టి పెట్టింది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి పక్కా రోడ్‌మ్యాప్ రూపుదిద్దింది. మౌలికరంగాన్ని బలోపేతం చేస్తూ.. అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షను పాటించిందని కితాబిచ్చారు. జాతీయ ఆరోగ్య భద్రతా పథకం ప్రపంచంలోనే అతి పెద్దదని,, దీంతో పాటు విద్య, వృత్తినైపుణ్యం, రీసెర్చి అండ్ డెవలెప్‌మెంట్ (ఆర్‌అండ్‌డి)లపై చర్యలు తీసుకోవడం స్వాగతించాల్సిన అంశాలన్నారు.

దూరదృష్టితో రూపొందించిన బడ్జెట్



మొత్తానికి బడ్జెట్ దూరదృష్టితో రూపొందించిందని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయ డానికి పెద్దెత్తున చర్యలు తీసుకుందన్నారు. బడ్జెట్‌లో ప్రస్తుతం అవసరాలు ము ఖ్యం గా మౌలి కరంగం అభి వృద్ధి, వ్యవ సాయం, ఫైనాన్స్; ఆరోగ్యం, విద్య, సామా జిక భద్రతపై ఫోకస్ పెట్టిందని ఆమె అ న్నారు. అయితే ముడి చమురు ధరలు పెరిగి పోతున్న నేప థ్యంలో ఇంధనభద్రతపై దృష్టి పెట్టాలన్నారు.ముడి చమురుపై సుంకాన్ని 20 శాతం నుంచి 8 శాతానికి తగ్గించడంతో దేశీయంగా ఉత్పత్తి చేసుకోవడానికి ప్రోత్స హిస్తున్నట్లవుతుందని వేదాంత కెయిర్న్ ఇండియా సీఈవో సుధీర్ మాథూర్ అన్నారు. 2022 నాటికి పది శాతం ముడి చమురు దిగుమతులు తగ్గించాలని ప్రధానమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఎల్‌అండ్‌టి టెక్నాలజీ సర్వీసెస్ సీఈవో, ఎండీ, కేశబ్‌పాండావ్మాట్లాడుతూ...ప్రభుత్వం ఆర్‌అండ్‌డిని ప్రోత్సహించడాన్ని స్వాగతించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్, ఎడ్జ్ ఎనలిటిక్స్‌ను ప్రోత్సహిస్తే ప్రపంచంలోనే భారత్ డిజిటల్ హబ్‌గా మారుతుందన్నారు.

నరేశ్ మఖజాని కెపీఎంజీఇండియా వ్మాట్లాడుతూ...ఎల్‌టిసీజీ 10 శాతాన్ని తిరిగి ప్రవేశపెట్టడం కాస్తా ఇబ్బంది కలిగించేఅంశమని.. అయితే అదేసమయంలో ప్రభుత్వం ఎస్‌టిటిని ఉపసంహరించి కాస్తా ఊరట కలిగిందన్నారు.

దమ్మున్న బడ్జెట్: హిందూజా

ధైర్యసాహసాలతో కూడు కున్న బడ్జెట్ అని.. దేశాన్ని అభి వృద్ధి పథంలో తీసుకుపోయే బడ్జెట్ అని ఆయన కొనియాడారు. ముఖ్యంగా వ్యవసాయం, ఆరో గ్యం, విద్య, ఉపాధి కల్పనా రంగం, మౌలికరంగపై దృష్టి పెట్టడం వల్ల 2025 నాటికి దేశ జీడీపీ 8-10 శాతానికి చేరుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు.

ఆనంద్ మహీంద్రా .. స్పందిస్తూ.. ప్రజాకర్షక బడ్జెట్ అని.. ఎన్నికలకు ముందు బడ్జెట్ కాబట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టిపెట్టారని.. మొత్తానికి 10 కోట్ల మందినా ఆరోగ్యబీమా కిందికి తీసుకురావడాన్ని అభినందించాల్సిందేనని ఆయన అన్నారు. ఆరోగ్యకరమైన సమాజం ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు.

జాతీయ ఆరోగ్య విధానం భేష్



దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా గాడి నపడుతోందని స్పష్టమవుతోంది. జీఎస్టిఅమల్లోకి తేవ టడం వల్ల చాలా మంది పన్ను పరిధిలోకి వస్తున్నారని.. దీంతో ఆర్థికవ్యవస్థ బలోపేతం అయ్యి వచ్చే ఏడాది నాటికి జైట్లీ ద్రవ్య లోటును జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేసే స్థాయికి వస్తా రన్నారు. జాతీయ ఆరోగ్య విధానం కింద 50 కోట్ల మంది ప్రజలను తీసుకురావడం అనేది అతి పెద్ద నిర్ణయమన్నారు. ప్రభుత్వం శ్రద్ధతో దీన్ని అమలు చేస్తే ప్రపంచ ఆరోగ్యచిత్రపటంలో భారత్ చోటు దక్కించు కుంటుందన్నారు. జైట్లీ సీనియర్ సిటిజన్స్ పెద్దెత్తున పన్నురాయితీలు అందించడం అభినందనీయమన్నారు. పెరిగిపోతున్న ద్రవ్యోల్బణంతో వారి రాయితీలు ఇవ్వడం సరైందనేనని ఆమె అన్నారు. దీర్ఘకాలిక క్యాపిటల్‌గెయిన్ టాక్స్ 10 శాతం పెద్ద ఇబ్బందేమీలేదు. రూ.250 కోట్ల టర్నోవర్ కంఎనీలపై కార్పొరేట్ టాక్స్‌ణు 25 శాతానికి తగ్గించడం మధ్యతరహాకంపెనీలు బాగుపడతాయని ప్రీతారెడ్డి పేర్కొన్నారు.

గ్రామీణ ఆర్థికవ్యవస్థపై ఫోకస్

2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం పక్కాగా గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి పెద్దపీట వేసిందని,వ్యవసాయంతో పాటు వైద్య ఆరోగ్యంపై దృష్టి పెట్టడం శుభపరిణామమన్నారు. గతేడాది ప్రభుత్వం చౌకరకం గృహాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. దీంతో రియల్ ఎస్టేట్‌రంగంలో బలోపేతం అయ్యింది. చివరి జీఎస్టి మండలి సమావేశం క్రెడిట్ లింకెడ్ సబ్సిడీ స్కీం (సీఎల్‌ఎస్‌ఎస్) పై పన్నును 12 శాతం నుంచి 8 శాతానికి తగ్గించిదని గుర్తు చేశారు. దీన్ని బట్టి చౌకరకం గృహాలకు ప్రభుత్వం నేషనల్ హౌసింగ్ బ్యాంకు (ఎన్‌హెచ్‌బీ) ద్వారా రుణాలు మంజూరు చేసిందని ఆయన చెప్పారు. అయితే ఈ బడ్జెట్‌లోరియల్ ఎస్టేట్‌ను బలోపేతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రియల్‌రంగంలో కొత్త కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నారని, బడ్జెట్‌లో ఈ రంగం గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేదని బైజాల్ అన్నారు.



గ్రామీణరంగం పై ఫోకస్

● ఫినో పేమెంట్ బ్యాంకు ఎండీ రిషిగుప్తా

జైట్లీ బడ్జెట్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ఉందన్నారు. రైతు ఆదాయం పెంచడానికి పెద్దపీట వేస్తోందని.. ముద్రా స్కీం ద్వారా చిన్న మధ్యతరహా వ్యాపారులకు రుణాలు ఇవ్వడం స్వాగతించాల్సిన అంశమన్నారు. దీంతో పెద్దెత్తున ఉద్యోగాలు కల్పించవచ్చునని, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా పుంజుకుంటుందని ఆయన అన్నారు. కొత్త రకం బ్యాంకులు ఫినోబ్యాంకులు కూడా ప్రయోజనం పొందుతాయన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడితే చెల్లింపులు బ్యాంకులు లాభపడతాయన్నారు. ప్రస్తుతం ఫిన్ పేమెంట్ బ్యాంకులు 14 రాష్ట్రాల్లో 25000 మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు.

లగ్జరీ వాహనాల ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ : బడ్జెట్‌లో ఎక్సైజ్ సుంకం పెంచడంతో విలాసవంతమైన కార్లు, బైక్‌ల ధరలు 5 శాతం పెరుగుతాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై బడ్జెట్‌లో జైట్లీ ఐదు శాతం సుంకం పెంచారు. దీంతో మోటార్‌బైక్‌లు ట్రయంఫ్, హెర్లీ బైక్‌ల ధరలు రూ.15వేల నుంచి రూ.50వేల వరకు పెరుగుతాయి. అలాగే మెర్సిడెజ్ బెంజ్; బీఎండబ్ల్యు, ఆడి ధరలు రూ.1.25 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెరుగుతాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విలాసవంతమైన బస్సుల ధరల రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెరుగుతాయి. మేకిన్ ఇండియాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తయారీరంగాన్ని ప్రోత్సహించడానికి విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే మోటార్ వాహనాల విడిభాగాలపై పన్ను రేట్లను పెంచారు.

ఏప్రిల్-డిసెంబర్ ద్రవ్యలోటు 113.6శాతం

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలానికి ద్రవ్యలోటు ఏకంగా 97.27 బిలియన్ డాలర్లకు పెరిగిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి చివరినాటికి బడ్జెట్ అంచనాల లక్ష్యంగా డిసెంబర్ నాటికి 113.6 శాతానికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలానికి పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ.9 లక్షల కోట్ల రెవెన్యూ వచ్చినట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను అరుణ్‌జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.5 శాతానికి పెంచినట్లు చెప్పారు.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు ప్రోత్సాహకాలు

ఆర్థికమంత్రి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి అత్యాధునిక 42 మెగాఫుడ్ పార్కులను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీని ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలనేది ప్రభుత్వం లక్ష్యం. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 30 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 42 మెగాఫుడ్ పార్కులను ప్రకటించిన నేపథ్యంలో వాణిజ్యమంత్రిత్వశాఖ శక్తిమంతమైన విధానాలు రూపుదిద్ది వ్యవసాయోత్పత్తులు ఉదాహరణకు తేయాకు, కాఫీ, పండ్లు, కూరగాయలు రవాణాకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. దేశం నుంచి జరిగే ఎగుమతుల్లో 10 శాతం వ్యవసాయ ఉత్పత్తులు ఆక్రమించాయి. దేశం నుంచి ప్రధానంగా జరిగే వ్యవసాయ ఉత్పత్తులు ఇలా ఉన్నాయి. తేయాకు, కాఫీ, బియ్యం, కాయధాన్యాలు, పొగాకు, సుగంధ ద్రవ్యాలు, జీడీ, పండ్లు, కూరగాయలతో పాటు సముద్ర ఉత్పత్తులు ఎగమతులు చేస్తున్నాయి

మిశ్రమ స్పందన



● రూ. 250 కోట్ల టర్నోవర్ కంపెనీల కార్పొరేట్ ట్యాక్స్ 25శాతం

● స్టాండర్డ్ డిడక్షన్ రూ. 40వేలు

న్యూఢిల్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 కేంద్రబడ్జెట్ ప్రతిపాదనలపై మిశ్రమ స్పందన కనిపిస్తోంది. స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ టాక్స్‌ను తిరిగి తెరపైకి తీసుకొచ్చారు. అలాగే కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించారు. అయితే వేతన జీవులకు ఆదాయపు పన్నులో స్వల్ప ఊరట కలిగించారు. జైట్లీ తన బడ్జెట్‌లో దీర్ఘకాలిక క్యాపిటల్‌గెయిన్ రూ.1 లక్షల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించే వారిపై పది శాతం పన్ను విధిస్తామని ప్రకటించారు. అయితే జనవరి 31, 2018 వరకు ఆర్జించిన వాటిపై మాఫీ చేశారు. అలాగే డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ మ్యూచువల్‌ఫండ్‌పై 10 శాతం ప్రతిపాదించారు. స్వల్పకాలికానికి క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ 15 శాతం యధావిధిగా కొనసాగుతుంది. దీర్ఘకాలిక క్యాపిటల్‌గెయిన్స్ తిరిగి ప్రవేశపెడతారన్న ఊహాగానాలు కొత్త అవతారంతో మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతి బడ్జెట్‌లో క్యాపిటల్‌గెయిన్స్‌పై స్వల్పమార్పులు చేర్పులు చేస్తూ పోవడం ఇన్వెస్టర్లకు రుచించలేదు. దీని ప్రభావం స్టాక్‌మార్కెట్లపై కనిపించింది. బీఎస్ఈ 300 పాయింట్లు నష్టపోయి తర్వాత 250 పాయింట్ల వరకు కోలుకుంది. కార్పొరేట్లను ప్రసన్నం చేసుకోవడానికి ఆయన రూ.250 కోట్ల టర్నోవర్‌కంపెనీలపై కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించారు. దీంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రంగానికి చెందిన కంపెనీలు లాభపడాయని, అదే సమయంలో ప్రభుత్వం ఖజానాకు రూ.7,000 కోట్ల భారం పడుతుందని చెప్పారు. మొత్తానికి చూస్తే జైట్లీ పన్ను రేట్ల తగ్గింపు నిరుత్సాహపర్చింది. వేతన జీవులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఊరట లభించలేదు. రవాణా, వైద్య ఖర్చుల కింది స్టాండర్డ్ డిడెక్షన్ కింద రూ.40వేల వరకు ప్రకటించారు. అదే సమయంలో సీనియర్ సిటిజన్స్‌కు ఇన్స్యూరెన్స్ ప్రీమియంపై ఏడాది రూ.50వేల వరకు పెంచారు. గతంలో ఇది రూ.30వేల వరకు ఉండేది. అలాగే సీనియర్ సిటిజన్స్‌కు ఎల్ఐసీ పై రూ.7.5 లక్షల వరకు పెట్టుబడులపై వడ్డీపై ఎలాంటి పన్ను లేదు. దీన్ని రూ.15 లక్షల వరకు పెంచారు.

ఉద్యోగులకు స్టాండర్డ్ డిడెక్షన్ రూ.40వేల పెంచడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని.. ప్రస్తుతం వైద్యఖర్చులతో ఏడాది రూ.15వేల రీఎంబెర్స్‌మెంట్ ఉంది. అలాగే రూ.1600 రవాణా పై ఉంది. ఈ రెండు లెక్కిస్తే ఏడాదికి రూ.34,200 అవుతుంది.

బడ్జెట్‌లో పెంచిదే కేవలం రూ.5,800 మాత్రమేనని పన్ను నిపుణులు చెబుతున్నారు.ఎలక్ట్రానిక్ వస్తులు ఉదాహరణకు మొబైల్‌ఫోన్స్‌లు ఖరీదైన వ్యవహారంగా మారపోతాయి. దేశీయ తయారీరంగాన్ని ప్రోత్సహించడానికి దీని ద్వారా ఉద్యోగావకాశాలు పెంచుకోవడానికి దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్ వస్తువులపై కస్టమ్స్ సుంకం 15 నుంచి 20 శాతానికి పెంచారు.

ప్రాధాన్యత రంగాలపై దృష్టి

బడ్జెట్ ప్రాధాన్యతా రంగాలపై ఫోకస్ పెట్టింది. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రాధాన్యతా రంగాలపై ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.. గ్రామీణ పేదలను పైకి తేవడంతో పాటు వైద్యం, ఆరోగ్యం, మౌలికరంగం, డిజిటల్ ఇండియాపై దృష్టి పెట్టారు. వచ్చే ఏడాది ద్రవ్యలోటు స్వల్పంగా 3.3 శాతానికి పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం 3.5శాతానికి పరిమితం చేస్తామని అంచనా వేసింది. జాతీయ ఆరోగ్య రక్షణ స్కీం కింది 10 లక్షల కుటుంబాలను రూ.5 లక్షల బీమా కిందికి తేవడం అభినందయనీయమని అన్నారు. ఈ బడ్జెట్ కూడా ప్రజాకర్షక బడ్జెట్ అని వ్యవసాయరంగం ద్వారా పెద్దమత్తంలో లబ్ధి చేకూరుతుందని దీంతో పాటు వైద్య, విద్యరంగాలు లబ్ధి పొందుతాయని ఆమె అన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు పెద్ద పీట

● హిమాలయా ఫుడ్స్ ఇంటర్నేషనల్ సీఎండీ



బడ్జెట్‌లో ఫుడ్‌ప్రాసెసింగ్‌కు గుర్తింపునిచ్చింది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది రైతు ఆదాయంపెరుగుతుందని హిమాలయా ఫుడ్స్‌సీఎండీ మన్‌మెహన్ మాలిక్ అన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్‌ను గుర్తించడ వల్ల ఎగుమతులు పెరుగుతాయని ముద్రారుణాలు అందుబాటులో ఉండటం వల్ల రైతులకు తేలికగా రుణాలు లభిస్తాయని కొత్త కొత్త వ్యాపారులు ఈ రంగంలో ప్రవేశించడానికి అవకాశం ఉందని హిమాలయఫుడ్స్ వ్యవస్థాపకుడు, సీఎండీ మన్ మొహన్ మాలిక్ అన్నారు.

మార్కెట్లను వణికించిన బడ్జెట్

● భారీ నష్టాల నుంచి స్వల్ప నష్టాలతో ముగింపు

● క్యాపిటల్ గెయిన్స్‌టాక్స్ ముంచింది

ముంబై : పద్నాలుగు సంవత్సరాల తర్వాత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ క్యాపిటల్ గెయిన్‌టాక్స్ ప్రకటించడంతో స్టాక్ మార్కెట్లు చిగురుటాకుల్లా వణికిపోయాయి. దీంతో పాటు ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోవడంతో మార్కెట్లు ఒకానొక దశలో 460 పాయింట్ల వరకు పడిపోయాయి. తర్వాత దేశీయ సంస్థాగత మదుపరులు రంగంలోకి దిగి షేర్లను పెద్దెత్తున కొనగోలు చేయడంతో చివరకు 58.36 పాయింట్లు నష్టపోయి 35,906.66 పాయింట్ల వద్ద, నిఫ్టీ 10.80 పాయింట్లు క్షీణించి 11,016.90 వద్ద ముగిశాయి. బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.5 శాతానికి పెంచడంతో మార్కెట్‌కు రుచించలేదు. గతంలో ద్రవ్యలోటు లక్ష్యం 3.2 శాతంగా ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును 3.3 శాతానికి పరిమితం చేసింది. లోకసభలో జైట్లీ ప్రసంగం మొదలైన వెంటనే స్టాక్‌మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. అయితే దేశీయ సంస్థాగత మదుపరులు పెద్దెత్తున కొనుగోళ్లకు పాల్పడ్డంతో మార్కెట్లు మరింత పతనం కాకుండా అడ్డుకున్నాయి. మొత్తానికి గురువారం మార్కెట్ 36,048.99 వద్ద లాభాలతో ప్రారంభమైంది. అటు తర్వాత 36,256.83 పాయింట్ల వరకు ఎగబాకింది. జైట్లీ స్టాక్ మార్కెట్ల లాభాలపై క్యాపిటల్ గెయిన్‌టాక్స్ ప్రకటించిన వెంటనే ఏకంగా 35,501.74 పాయింట్లకు దిగివచ్చింది. చివర్లో కోలుకొని 58.36 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 10.80 పాయింట్ల నష్టంతో 11,0161.90 వద్ద ముగిసింది. గతేడాది ఇదే బడ్జెట్ రోజుసూచి 485.68 పాయింట్లు, నిఫ్టీ 155.10 పాయింట్ల ర్యాలీ ఏర్పడింది. బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థికవ్యవస్థను పటిష్టం చేయడానికి బడ్జెట్‌లో పెద్దమొత్తంలో కేటాయింపులు చేయడం సెంటిమెంట్ బలపడుతుందని మార్కెట్ తిరిగి గాడిన పడుతుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మౌలికరంగంపై పెద్దెత్తున వ్యయం చేయడంతో పాటు రూ.250 కోట్ల టర్నోవర్ కంపెనీలపై కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించడం మార్కెట్లకు కలిసొచ్చే అంశాలని చెబుతున్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ రంగానికి రూ.1400 కోట్లు కేటాయించడంతో శీతల్ కూల్, అవంతిఫీడ్స్, గోద్రెజ్ ఆగ్రివెట్, ఫ్రెష్‌ట్రోప్ ఫ్రూట్స్ షేర్లు 10 శాతం పెరిగాయి. వ్యవసాయరంగానికి చెందిన షేర్లు ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్, పీఐ ఇండస్ట్రీస్, యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఈక్విప్‌మెంట్, మోన్‌సాంటో ఇండియా షేర్లుమదుపరులను ఆకర్షించాయి.

బడ్జెట్‌తో బలోపేతం

● గ్రామీణం, డిజిటల్, మేక్ ఇన్ ఇండియా దిశగా ప్రాధాన్యత ● సంతృప్తిని వ్యక్తం చేసిన సీఐఐ





హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర వార్షిక బడ్జెట్ దేశాభివృద్ధి, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా దిశగా ఉందని భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) తెలంగాణ చాప్టర్ పేర్కొంది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఆరోగ్య, విద్యారంగాన్ని ప్రోత్సహించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని తెలిపింది. దీర్ఘకాలిక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తూ పేదల వర్గాలకు చేయూత ఇచ్చేవిధంగా ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని సిఐఐ తెలిపింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకోకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారని అభిప్రాయ పడింది. వార్షిక బడ్జెట్ 2018-19పై సిఐఐ శాఖల వారీగా పరిశీలించి తమ అభిప్రాయాలను గురువారం వెల్లడిం చింది.

ఆర్థిక వ్యవస్థ బలోపేతం దిశగా : అనిల్ కుమార్

కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అనుకూలంగా ఉందని సిఐఐ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ వేపూరి చెప్పారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించే విధంగా బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. వ్యక్తులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం కాకుండా వ్యవస్థాపరంగా సానుకూల ఫలితాలు సాధించేలా దూర దృష్టితో బడ్జెట్ రూపకల్పన చేశారని అనిల్ చెప్పారు.

రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యంగా : గోపాలకృష్ణ

రెతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ సాగునీరు, కనీస మద్దతు ధర పెంచేఅంశాలపై దృష్టిసారించారని గోపాలకృష్ణ పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుపై 50శాతం ఆదాయం వచ్చేలా కనీస మద్దతు ధర అమలు చేయాలన్న ప్రతిపాదన రైతాంగానికి ఊరట కలిగిస్తుందన్నారు. దేశంలోని వ్యవసాయ మార్కెట్లను అనుసంధానం చేసే ఈ-నామ్ కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో మార్కెట్ ధరలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరుగుతుందని ఆయన చెప్పారు.

42 మెగా ఫుడ్‌పార్క్స్ ఏర్పాటు, పండ్లు, కూరగాయల లాంటి ఉత్పత్తులను సకాలంలో మార్కెట్‌కు చేర్పించే విధంగా గ్రామీణ రోడ్డు, రవాణా వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని గోపాలకృష్ణ చెప్పారు. సహకార రంగంలో ఏర్పాటుచేసే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు నూరుశాతం వ్యక్తిగత ప్రయోజనాలపై బడ్జెట్ కేటాయింపుల్లో దృష్టి సారించకుండా, కేవలం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో తమకు అనుకూలంగా లేదనే భావన వ్యక్తుల్లో తలెత్తినప్పటికీ దీర్ఘకాలంలో ఆర్థిక ఫలితాలు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి దోహద పడతాయని ఆయన అన్నారు. ఉత్పత్తులు పెంచి ఎగుమతులు సాధిస్తే అవి రైతాంగానికి లబ్ధి చేకూరుస్తాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందని ఆయన చెప్పారు.

ఆదాయ పన్నులో ఊరట కల్పించలేదన్న అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆదాయాన్ని పెంచే మార్గాలు చూపిస్తే పన్నులు చెల్లించడం ఒక సమస్య కారాదన్నారు. పేదలకు రూ.5 లక్షల మేరకు ఆరోగ్యబీమా చేసి 50 కోట్ల మందికి లబ్ధి చేకూర్చే బృహత్తర కార్యక్రమాన్ని గమనంలోకి తీసుకోవాలని శ్రీనివాస్ అన్నారు.

ఉత్పాదన రంగంపై పన్నుల్లో మార్పులేదు : డి.రాజు

ఉత్పాదన రంగంలో పరోక్ష పన్నుల్లో ఎలాంటి మార్పు లేదనీ, మేక్ ఇన్ ఇండియా దిశలోనే దిగుమతి సుంకాలు పెంచారని డి.రాజు చెప్పారు. దిగుమతులు తగ్గించి దేశీయ ఉత్పత్తులు పెంచాలనీ, అది ఉపాధి, ఎగుమతులకు దోహదపడేలా ప్రాధాన్యత తెచ్చారని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలను అక్కడ నెలకొల్పేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. వార్షిక బడ్జెట్ స్వరూపం సమగ్రంగా పరిశీలిస్తే పారిశ్రామిక రంగాలకు సంతృప్తికరంగానే ఉందని డి.రాజు అన్నారు.

తెలంగాణలో ఐటిఐఆర్‌కు మొండిచేయి : బసిరెడ్డి


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఐటిఐఆర్ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో మొండి చేయి చూపారని కె.బసిరెడ్డి విచారం వ్యక్తంచేశారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియాకు ప్రాధాన్యత ఇస్తూనే తెలంగాణలో ఐటిఐఆర్ ప్రాజెక్టును కేంద్రం విస్మరించిందని ఆయన అన్నారు. డిజిటల్ శిక్షణ, డిజిటల్ టెక్నాలజీ పెంచేందుకు సానుకూలమైన ప్రతిపాదన చేశారని, ఇది ఐటి కంపెనీలు, విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని బసిరెడ్డి అన్నారు.



బడ్జెట్ 2018-19

భద్రతకు భరోసా

- రైల్వేలకు రూ.1.48 లక్షల కోట్లు
- ఆధునికీకరణ.. భద్రత, సామర్థ్య పెంపునకు ప్రాధాన్యత
- 18 000 కి.మీ డబ్లింగ్ పనులకు నిర్ణయం
- అన్ని స్టేషన్లలో ఎస్కలేటర్లు, వై-ఫై, సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో కొత్త కోచ్‌లు, వ్యాగన్ల నిర్మాణం




న్యూఢిల్లీ: రైల్వే ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. ఈసారి సాధారణ బడ్జెట్‌లో రైల్వేశాఖకు గరిష్టంగా రూ.1,48,528 కోట్లను కేటాయించారు. రైల్వే చరిత్రలో ఇదే అతిపెద్ద పద్దు. కిందటి యేడాది కేటాయింపులు రూ. 1.30 లక్షల కోట్లతో పోల్చితే ఈసారి 13 శాతం అధికం. క్షీణిస్తున్న ఆదాయ మార్గాలను తిరిగి పట్టాలెక్కించే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైల్వేల సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు ప్రకటించారు. సేఫ్టీ ఫస్ట్ పాలసీకి ఎన్డీయే ప్రాధాన్యం ఇస్తున్నదని అన్నారు. వచ్చే రెండేళ్లలో కాపలాలేని 4,267 లెవెల్ క్రాసింగ్‌ల తొలగింపు.. 600 మేజర్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణలో భాగంగా, అన్ని స్టేషన్‌లలో, రైళ్లలో వైఫై, సీసీ కెమెరాలు ఏర్పాటు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3600 కిలోమీటర్ల రైల్వే ట్రాక్స్ పునరుద్ధరణ... 18వేల కిలోమీటర్ల డబ్లింగ్ పనులు... 25వేల ప్రయాణీకుల రద్దీ కలిగిన అన్ని రైల్వే స్టేషన్‌లలో ఎస్కలేటర్లు...ప్రపంచస్థాయి ప్రమాణాలతో 12,000 వ్యాగన్లు, 5160 కోచ్‌లు.. 700 లోకోమోటీవ్‌ల ఉత్పత్తికి చర్యలు తీసుకోబోతున్నట్లు జైట్లీ వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో పరిపుష్టం చేస్తామని అన్నారు. పూణె- లోనావాలా మూడవ, నాల్గో రైల్వేలైన్ కోసం రూ. 4,253కోట్లు కేటాయించారు.

హైస్పీడ్ రైళ్ల కోసం ఉద్యోగుల నియామకాలను భర్తీ చేస్తామన్నారు. రైల్వేల విద్యుతీకరణకు ప్రాధాన్యతనిస్తామని, వడోదరలో రైల్వే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముంబై, బెంగళూరు నగరాల్లో సబర్బన్ రైల్ మార్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. ఫాగ్ సేఫ్టీ పరికరాలతో సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగు పరుస్తామని, తద్వారా ప్రయాణీకుల భద్రతకు పటిష్ట చర్యలు చేపడతామని ఈ బడ్జెట్ నేపథ్యంలో జైట్లీ వివరించారు. తొలిసారిగా ముంబై, బెంగళూరు రవాణా వ్యవస్థ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నేపథ్యంలో, ఈ ప్రాజెక్టుకు అవసరమైన మానవ వనరుల తయారీకి యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ స్పష్టం చేశారు.

ముంబై, బెంగళూరు సబర్బన్‌కు ప్రాధాన్యత

ముంబై, బెంగళూరు నగరాల్లో 465 కిలోమీటర్ల పరిధిలో సబర్బన్ రైలు మార్గాల నిర్మాణానికి రూ. 11,000 కోట్ల రూపాయలు కేటాయించారు. రూ.40వేల కోట్లతో సిటీ రైల్వేలను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటక రాష్ట్రానికి జైట్లీ పద్దులో ప్రాధాన్యం దక్కింది. బెంగళూరు నగరంలో లోకల్ రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధికి 17వేల కోట్లను ప్రకటించారు. అదేమాదిరి దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరంలో 90కి.మీ డబ్లింగ్ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం జరిగింది. మిగతా 150 కిలోమీటర్ల సబర్బన్ నెట్‌వర్క్ విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు జైట్లీ స్పష్టం చేశారు. ప్రస్తుతం ముంబై సబర్బన్ రైల్వే ద్వారా 2,342 రైళ్లు నడుస్తున్నాయి. ప్రతినిత్యం 7.5 మిలియన్ల ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేర్చుతుంటాయి. బెంగళూరు సబర్బన్ మార్గానికి ప్రభుత్వం చేయూతనిచ్చింది. 160 కి.మీ. రైల్వే లైన్ విస్తరణకు జైట్లీ పద్దులో కేటాయింపులు లభించాయి.

- కిందటి సారితో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రైల్వే కేటాయింపులు 1.31 లక్షల కోట్ల నుంచి 1.48 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో బడ్జెట్ ఆధారిత కేటాయింపులు 55వేల కోట్ల నుంచి 65వేల కోట్లకు పెరిగాయి.



- సిగ్నలింగ్ వ్యవస్థ, పట్టాల పునరుద్ధరణ వంటి మౌలిక ఆధునికీకరణ పనులకు రైల్వే బడ్జెట్‌లో సింహభాగం ఖర్చుచేయనున్నారు. ఉన్నతాధికారుల అంచనాల ప్రకారం ఆధునికీకరణకు సుమారు 95వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తారు.




- ప్రయాణీకుల భద్రత దృష్ట్యా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, రైల్వే బోగీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 3000 వేల కోట్లు ఖర్చుచేస్తారు. ప్రీమియర్, సబర్బన్ రైళ్లు సహా సుమారు 11వేల రైళ్లలో నిఘా నేత్రాన్ని అమర్చుతారు. అదేవిధంగా 85వేల రైల్వే స్టేషన్లను సీసీ సర్వైలెన్స్ పరిధిలోకి తీసుకొస్తారు.
- కొత్త రైలు మార్గాలు, గేజ్ మార్పిడి, డబ్లింగ్, విద్యుదీకరణ పనులు మౌలిక అభివృద్ధి ప్రణాళికలో అంతర్భాగంగా ఉంటాయి.



- రైల్వేల సామర్థ్యంపెంపు నేపథ్యంలో ఈ రంగంలో పెట్టుబడుల సమీకరణ అతిపెద్ద సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం నష్టాల బాటలో పరుగులు తీస్తున్న రైల్వేలను తిరిగి లాభాల బాట పట్టించేందుకు భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. గత బడ్జెట్ నాటికి రైల్వే 40వేల కోట్ల మేరకు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నది. ప్రస్తుత లక్ష్యాలను చేరుకునే క్రమంలో రుణభారం మరింత పెరగడం ఖాయం.



- వారణాసి, పాటియాలలో డీజిల్ లోకోమోటివ్‌ల స్థానంలో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల తయారీకి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. రానున్న కొద్ది సంవత్సరాల్లో ఎలక్ట్రో లోకోమోటివ్‌లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ఈ మేరకు మార్పులు అనివార్యం. ఇందుకు అదనంగా నిధులు అవసరం.



- దేశవ్యాప్తంగా అన్ని రైలు మార్గాలను దశలవారీగా విద్యుదీకరణ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో మరిన్ని విద్యుత్ రైలు ఇంజన్లు తయారు చేయాలి. అయితే, అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరలు, జీఎస్టీ రాబడుల తగ్గుదల కారణాల నేపథ్యంలో ఈ దిశగా ప్రభుత్వ కేటాయింపులు సులువు కాబోదు.



- సాధారణ బడ్జెట్ నుంచి వచ్చే కేటాయింపులపైనే ఆధార పడకుండా, అంతర్గత ఆదాయ సమీకరణ మార్గాలను అన్వేషించాలని రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ ఇప్పటికే అధికార యంత్రాంగానికి సూచించారు. ప్రకటనలు, ప్రసార ఆస్తుల విక్రయం, వినియోగంలో లేని రైల్వే భూముల్లో వాణిజ్య సముదాయాలను నిర్మించడం, గరిష్ట ఆదాయ మార్గాలపై దృష్టిసారించడం వంటి చర్యల ద్వారా ఆదాయ వనరులను సృష్టించుకోవాలని గోయెల్ సూచించారు.



- ప్రస్తుతం ప్యాసింజర్ సర్వీసుల్లో క్రాస్‌సబ్సిడీల రూపంలో 30వేల కోట్లకు మించి ఆదాయం వస్తోంది. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ల ఆవరణల్లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని రైల్వేశాఖ నిర్ణయించింది. రైలు సమాచారాలకు సంబంధించి ప్రయాణికుల మొబైల్‌కు సంక్షిప్త సందేశాలను చేరవేయడం, ప్రాంగణాల్లో వై-ఫై సౌకర్యం కల్పించడం వంటి చర్యలకు తాజా బడ్జెట్ దిశానిర్దేశం చేసింది.
- ప్రధాన అర్బన్, సబర్బన్ స్టేషన్లలో 3000వేల ఎస్కలేటర్లు, 1000 లిఫ్టుల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రయాణ, రవాణా చార్జీల భారం మోపకుండా, గత మూడేళ్లలో తీసుకున్న నిర్ణయాలను స్థిరీకరించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తున్నది.



తెలుగు రైలుకు అన్యాయం

కేంద్ర వార్షిక బడ్జెట్‌లో భాగంగా ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు అత్తెసరు కేటాయింపులే లభించాయి. తాజా బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ప్రకటించిన కొత్తలైన్లు, ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టులకు జరిపిన కేటాయింపులు ఇవే..

- కోటిపల్లి - నర్సాపూర్ కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ. 430 కోట్లు కేటాయింపు
- విజయనగరం - స్తంభాలపూర్ మూడో రైల్వేలైన్‌కు రూ. 90 కోట్లు
- నడికుడి- కాళహస్తి కొత్త రైల్వే లైన్‌కు రూ. 340 కోట్లు
- కాజీపేట- విజయవాడ మూడో రైల్వేలైన్‌కు రూ. 100 కోట్లు
- నల్లపాడు- గుంతకల్ లైను విద్యుదీకరణకు రూ. 150 కోట్లు
- విజయవాడ - గుడివాడ, మచిలీపట్నం- భీమవరం, నర్సాపూర్-నిడదవోలు రైల్వేలైన్ల డబ్లింగ్ పనులకు రూ. 122 కోట్లు కేటాయింపు
- విజయనగరం- రాయగడ- రాయ్‌పూర్ విద్యుదీకరణకు రూ. 120 కోట్లు
- విజయవాడ - గూడురు మూడోలైన్‌కు రూ. 100 కోట్లు
- ఓబులవారి పల్లె- కృష్ణపట్నం కొత్త రైల్వేలైన్‌కు రూ. 100 కోట్లు
- గుంతకల్ - బళ్లారి- హెూస్పేట్ విద్యుదీకరణకు రూ. 70 కోట్లు
- కడప- బెంగళూరు రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ. 240 కోట్లు
- కాకినాడ- పిఠాపురం కొత్త రైల్వేలైన్‌కు రూ. 150 కోట్లు
- మునీరాబాద్ - మహబూబ్‌నగర్ కొత్త రైల్వేలైన్‌కు రూ. 300 కోట్లు
- మనోహరాబాద్ (మేడ్చల్) - కొత్తపల్లి (కరీంనగర్) లైన్‌కు రూ. 350 కోట్లు
- అక్కన్నపేట - మెదక్ మధ్య 17 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ. 196 కోట్లు
- భద్రాచలం నుంచి సత్తుపల్లి కొత్త రైల్వేలైన్‌కు రూ. 300 కోట్లు
- కాజీపేట - బళ్లారి మూడోలైన్‌కు రూ. 160 కోట్లు
- సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులకు రూ. 50 కోట్లు
- హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండోఫేజ్‌కు రూ. 100 కోట్లు
- రూ. 5 కోట్లతో చర్లపల్లి స్టేషన్‌లో శాటిలైట్ టర్మినల్



- **తెలంగాణలో ఏ-1 స్టేషన్లు:** కాజీపేట, మంచిర్యాల, ఖమ్మం, వరంగల్
- **తెలంగాణలోని ఆదర్శ స్టేషన్లు :** రఘునాథపల్లి, బాసర, గద్వాల, కేసముద్రం, శంకర్‌పల్లి
- **తెలంగాణలో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్న స్టేషన్లు:** వనపర్తి, డోర్నకల్, లింగంపల్లి, కాజీపేట, ఆదిలాబాద్, నిజామాబాద్



రాష్ట్రప్రభుత్వం భూమి, నిధులిస్తే యాదాద్రి వరకు ఎంఎంటిఎస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తే నగరం నుంచి యాదాద్రికి ఎంఎంటిఎస్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే రైలు మార్గాన్ని పొడిగించేందుకు రైల్వే శాఖ సుముఖంగా ఉంది. రాయగిరి నుంచి యాదాద్రి వరకు నాలుగు కిలోమీటర్ల వరకు కొత్త రైల్వే లైన్ నిర్మించి, విద్యుదీకరించి యాదాద్రిలో రైల్వే స్టేషన్‌ను నిర్మించారు. స్టేషన్ నిర్మాణానికి 40 నుంచి 50 ఎకరాలు కేటాయించడంతో పాటు ఆర్థిక భాగస్వామ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయాల్సి ఉంది. ప్రస్తుతం యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని ప్రతి నిత్యం దాదాపు మూడు లక్షల మంది భక్తులు సందర్శిస్తుండగా, శని, ఆదివారాలు, సెలవు దినాలలో ఈ సంఖ్య 5 లక్షలు దాటుతోంది. హైదరాబాద్ నుంచి వందలాది బస్సులు, వేల సంఖ్యలో ప్రైవేట్ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు 34 కిలోమీటర్ల మేర రైల్వే లేన్‌లను విస్తరించేందుకు రైల్వే శాఖ రూ. 330 కోట్లతో ప్రణాళికలను సిద్ధం చేసింది.

అందులో 51 శాతం నిధులను రాష్ట్రం భరిస్తే మిగతా 49 శాతం నిధులను రైల్వే శాఖ భరించేలా ఒప్పందం చేసుకున్నారు. వచ్చే ఏప్రిల్‌లో టెండర్లు ఆహ్వానించేందుకు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఏర్పాట్లు చేస్తోంది.

విశాఖ జోన్ హుళక్కి!

● మెట్రోరైలు ప్రాజెక్టుపై ప్రస్తావనలేని వైనం ● విశాఖలో బడ్జెట్ నిరసన సెగలు

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: విభజన నేపథ్యంలో ఏపీకి కేటాయించిన ప్రాజెక్టులకు సంబంధించి ఒక్కటి కూడా కేటాయించక పోవడంతో విశాఖలో నిరసన సెగలు మిన్నంటాయి. ప్రత్యేక హోదా సంగతి పక్కనపెడితే కనీసం ఈ సారి బడ్జెట్‌లో విశాఖకు రైల్వేజోన్ కేటాయిస్తారని ఈ ప్రాంత ప్రజలంతా ఆశగా ఎదురు చూశారు. అయితే గురువారం కేంద్ర ఆర్థికశాఖామంత్రి అరుణ్‌జెట్లి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశాఖకు సంబంధించి ఒక్క చెప్పుకోదగ్గ ప్రాజెక్టు మంజూరు చేయలేదు.

2018-19 బడ్జెట్‌కు సంబంధించి విశాఖకు ఏ ఒక్క ప్రాజెక్టు కేటాయించలేదు. కేవలం అరకు, బొర్రా, ఎస్.కోట వంటి చిన్న చిన్న రైల్వేస్టేషన్‌లలో ఫ్లాట్‌ఫారమ్‌లు విస్తరిస్తామని మాత్రమే ప్రకటించడంతో ఉత్తరాంధ్ర ప్రజలు భగ్గుమంటున్నారు. ఇక విశాఖకు కేటాయించిన మెట్రో ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో ఒక్కరూపాయి కేటాయించలేదు.

ఇప్పటికే మెట్రోకు సంబంధించిన డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి రెండేళ్లకు పైగా దాటినప్పటికీ కేంద్రం నుంచి ఎటువంటి కేటాయింపులు లేకపోవడం వల్ల ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, మెట్రో రైలు ప్రాజెక్టుతో పాటు ఏ ఒక్క విభజన హామీ అమలు కాకపోవడం వల్ల ఆయా ప్రాంత ప్రజలు కేంద్రప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారు.

ఏపీలోని ఆదర్శ రైల్వే స్టేషన్లు: వినుకొండ, గుంటూరు, మంత్రాలయం రోడ్, మచిలీపట్నం, మర్కాపూర్ రోడ్, రాజమండ్రి, ఒంగోలు, దొనకొండ, ఆదోని, విశాఖ, దువ్వాడ, బొబ్బిలి, పార్వతీపురం, కడప, తిరుపతి, విజయవాడ, విశాఖ

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్న స్టేషన్లు : రేణిగుండ, ధర్మవరం, రాజమండ్రి, తుని, బేతంచర్ల ఫ్లాట్‌ఫారమ్ విస్తరణ: రాయనపాడు, గుంతకల్, పలాస, మర్కాపూర్, పాకాల, పానపాకం, నక్కనదొడ్డి, పుల్లంపేట, సాలూరు, కొత్తవలస, లక్కవరపు కోట, ఎస్ కోట, శివలింగాపురం, బొద్దవర, బొర్రా గుహలు, అరకు, సిమిలిగూడ





బడ్జెట్‌పై పెదవి విరుపు


● ఏపీకి ఒరిగిందేమీ లేదన్న ఎంపీలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పార్లమెంటరీ పార్టీ నేత, కేంద్ర సహాయ మంత్రి వై.ఎస్. చౌదరి (సుజనా చౌదరి) తన నివాసంలో మీడియా సమావేశంలో బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిపిన కేటాయింపులపై పెదవి విరిచారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేకత చూపలేదని వ్యాఖ్యానించారు.



రెవెన్యూ లోటు, రాజధాని అమరావతికి నిధులు వంటి అంశాల ప్రస్తావనే లేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో నాబార్డు ద్వారా నిధులు అందించే ఏర్పాటు చేసినప్పటికీ, నిధుల ప్రవాహం సాఫీగా సాగడం లేదని సుజనా చౌదరి అన్నారు. ముంబై మెట్రో సహా ఇతర రాష్ట్రాల్లో పట్టణ ప్రజారవాణా వ్యవస్థల కోసం భారీగా నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు మొండి చేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ప్రభుత్వంలో ఉన్నామని, అయితే ఇంకా ఒత్తిడి చేయాల్సి ఉంటుందని అన్నారు. చివరి నిమిషం వరకు తమ ఒత్తిడి చేస్తూ ప్రయత్నిస్తూనే ఉంటామని అన్నారు. కొన్ని అంశాలను బడ్జెట్లో ప్రస్తావించకపోయినా, లైన్ అకౌంట్ నుంచి ఇచ్చే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. రైల్వే జోన్ బడ్జెట్‌లో ప్రకటించకపోయినప్పటికీ, కచ్చితంగా తీసుకొచ్చి తీరుతామని అన్నారు. కేంద్రంలో బీజేపీతో తెగదెంపులు చేసుకుంటారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ, తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడే నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారా మాత్రమే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు.

విభజనలాంటి అన్యాయం మళ్లీ జరిగింది



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించడం ఎంత పెద్ద అన్యాయమో, ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయం అంతే పెద్దదని తెలుగుదేశం పార్టీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. అయితే వెయ్యి ఇవ్వాల్సిన చోట పదిచ్చి, బిచ్చం జల్లినట్టు చల్లారు తప్ప చెప్పుకోదగ్గది ఏదీ లేదని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు సాధించుకోలేకపోవడంలో ముఖ్యమంత్రి వైఫల్యం ఏమాత్రం లేదని, రాష్ట్రస్థితిగతుల గురించి ఎప్పటికప్పుడు ప్రధాని మోడీకి వివరిస్తూనే ఉన్నారని దివాకర్ రెడ్డి అన్నారు. కానీ మోడీ అసలు పట్టించుకోవడం లేదని వాపోయారు. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని, రాష్ట్రంలో టీడీపీ బలంగా ఉంటే బీజేపీ ఎదగలేదన్న ఉద్దేశంతో తమను బలహీనపర్చడం కోసమే ఇలా చేస్తున్నారేమోనని జేసీ అనుమానం వ్యక్తం చేశారు. 4న ముఖ్యమంత్రితో సమావేశమవుతున్నామని, ఆ రోజు ఏ నిర్ణయం తీసుకుంటారో చూసి తదనుగుణంగా నడుచుకుంటామని అన్నారు.

రాజీనామా సహా ఏ త్యాగాలకైనా సిద్ధం

ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆశతో ఎదురుచూసి భంగపడ్డారని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి శ్రీనివాస్) అన్నారు. లోటు బడ్జెట్, రైల్వే జోన్ ఇస్తారని చాలా ఆశతో ఎదురు చూశారని చెప్పారు. నాలుగేళ్లుగా తాము మిత్ర ధర్మంతో వ్యవహరిస్తూ ఓర్పు, సహనం పాటించామని అన్నారు. విభజన కారణంగా జరిగిన నష్టాన్ని పూడుస్తూ కేంద్రం న్యాయం చేస్తుందని అనుకున్నామని, కానీ చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ''ప్రత్యేక హోదా అడిగితే ప్యాకేజీ ఇస్తామన్నారు, చివరకు హోదా లేదు, ప్యాకేజీ లేదు, కనీసం డబ్బులు కూడా లేవు'' అని అవంతి శ్రీనివాస్ అన్నారు.



రైల్వే జోన్ ఇవ్వాలని విభజన చట్టంలోనే ప్రస్తావించినందున ఒక కమిటీ వేశారని, ఆ నివేదిక రావాలని అంటున్నారని, అదెప్పుడు వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థలకు నిధులివ్వామని అంటున్నారని, విశాఖ ఐఐఎం కోసం ఎకరం రూ. 5 కోట్లు విలువ చేసే 250 ఎకరాలిస్తే కేంద్రం మాత్రం కేవలం రూ. 40 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఇది కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కూడా సరిపోదని అన్నారు. ఏపీ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, 2020 వరకు రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉంటుందని స్వయంగా నీతి ఆయోగ్ లెక్కలే చెబుతున్నాయని అవంతి గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రత్యేకంగా చూడాలని, రాజధాని, విద్యా సంస్థలకు పూర్తిగా నిధులివ్వాలని డిమాండ్ చేశారు. రైల్వే జోన్ తక్షణం ప్రకటించాలని అన్నారు.


అత్యంత నిరాశాజనకం



బడ్జెట్‌ను అత్యంత నిరాశాజనకమైన బడ్జెట్‌గా శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు. 2 గంటల సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ గత 2 దశాబ్దాలుగా ఉందని, బడ్జెట్ ద్వారా దీనికి సమాధానం చెప్పవచ్చని తెలిపారు. అరాకొరా కొన్ని అంశాలు మాత్రమే ప్రకటించారని, వాటి విషయంలో హర్షం ప్రకటిస్తున్నామని అన్నారు. తాము అడిగినవేవీ ఇవ్వకుండా ఏవో ఒకటిరెండు ప్రాజెక్టులు ప్రకటించినంత మాత్రాన సరిపోతుందా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకుని పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్ వస్తాయని అనుకుంటున్న సమయంలో కేంద్రం ఇలా చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం ఎంపీలంతా నిరాశతో ఉన్నారని, ఎంపీలే మాత్రమే కాదు రాష్ట్ర ప్రజలు కూడా తీవ్ర ఆవేదనతో ఉన్నారని అన్నారు. ఈ విషయాలన్నీ ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఎన్డీయేలో ఉండాలా లేదా బయటకు రావాలా అన్న విషయంపై తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

కోనసీమ రైల్వే కేటాయింపులపై సంతోషం: పి. రవీంద్రబాబు

తెలుగుదేశం ఎంపీలందరూ బడ్జెట్ కేటాయింపుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేయగా, అమలాపురం ఎంపీ పి. రవీంద్రబాబు మాత్రం కాస్త భిన్నంగా స్పందించారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు మాత్రం పూర్తిగా రాలేదని ఆయన అన్నారు. ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్, రెవెన్యూ డెఫిసిట్ వంటి అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదని, బడ్జెట్‌తో సంబంధం లేకుండా కూడా వీటిని పరిష్కరించవచ్చని అన్నారు. అలాగే బడ్జెట్ కేటాయింపులపై ఇప్పుడే పూర్తిగా అసంతృప్తి చెందాల్సిన అవసరం కూడా లేదని, మధ్యలో రివైజ్డ్ బడ్జెట్ ఎస్టిమేట్స్ ద్వారా మార్పులు చేర్పులు చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఇక తన నియోజకవర్గానికి సంబంధించి జరిగిన కేటాయింపుల గురించి మాట్లాడుతూ, కోనసీమ రైల్వేకు రూ. 431 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో జరిపిన కేటాయింపులు కలిపితే తన హయాంలో మొత్తం రూ. 1000 కోట్ల వరకు ఈ ఒక్క రైల్వే లైన్ కోసం కేంద్రం కేటాయించిందని తెలిపారు. బీజేపీ సర్కారు నిధుల కేటాయింపులో న్యాయం చేయలేదని అన్నారు. మిగతా అంశాల్లో కూడా బీజేపీ ఇలాగే న్యాయం చేస్తుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు.



సమన్వయమా? సమరమా?!

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. మంత్రివర్గం ఎంపీల సమావేశంలో చర్చించిన అనంతరం భవిష్యత్‌లో కేంద్రంతో వ్యవహరించే తీరుపై లోతుగా చర్చించే అవకాశాలున్నాయి. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి అవసరమయ్యే నిధులను సమీకరించుకోవాలా, లేదా విబేధించాలనా అనే విషయం ఆదివారం ప్రకటించే అవకాశముంది. రాష్ట్రానికి నిధుల కేటాయింపు విషయంలో వివక్ష చూపిందని, ఇతర రాష్ట్రాలపై చూపిన ప్రేమ ఆంధ్రప్రదేశ్‌పై చూపలేదనే విషయాన్ని ప్రధానంగా మంత్రులు సీఎం వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తుంది. గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల కేటాయింపు, విభజన హామీలు పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో మార్గం సుగమం అవుతుందని ఊహిస్తే, అందుకు భిన్నంగా జరగడం సీఎంకు, మంత్రులకు మింగుడు పడటం లేదు. రాజధాని అమరావతి అభివృద్ధి, విశాఖ రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం అంశాలే బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడాన్ని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యాసంస్థలకు కూడా అరకొర నిధులే కేటాయించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరులకు అధికంగా నిధులు కేటాయించారనీ, అంత ప్రేమ అమరావతిపై చూపలేదనే అసంతృప్తిని మంత్రులు సీఎం వద్ద వ్యక్తం చేసినట్లు సమాచారం. మిత్రపక్షంగా వ్యవహరించిన బీజేపీ రాష్ట్రం పట్ల సానుభూతి వ్యక్తం చేయలేదనే ఆవేదనను మంత్రులు వెలిబుచ్చారు. సీఎంతో అత్యవసర భేటీలో మంత్రులు యనమల రామకృష్ణుడు, నక్కా ఆనందబాబు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమా తదితరులున్నారు.

ఏపీని కేంద్రం నట్టేట ముంచింది




విభజన అనంతరం కష్టకాలంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రప్రభుత్వం నట్టేట ముంచిందని రాష్ట్రప్రజలు బలంగా నమ్మే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మంత్రి గంటా మాట్లాడుతూ కేంద్ర కేటాయింపులు రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశను మిగిల్చాయన్నారు. కేంద్ర విద్యాసంస్థలుకు రూ.4500కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపితే కేవలం రూ.245 కోట్లు కేటాయించడం ఎంత వరకు సమంజసమని మంత్రి గంటా ప్రశ్నించారు. కొత్త రాజధాని అమరావతి, రాష్ట్ర ప్రజల జీవనాడి, పోలవరం ప్రాజెక్టు పట్ల కేంద్రం ప్రస్తావించకపోవడం రాష్ట్రం పట్ల కేంద్రం వివక్షతకు తార్కాణాలని భావించాల్సి వస్తుందన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ తప్ప లోటు బడ్జెట్‌తో ఏ రాష్ట్రం లేదన్న విషయం కేంద్రానికి తెలియనది కాదన్నారు.

ప్రజల విషయంలో రాజీపడం



ప్రజల విషయంలో రాజీపడేది లేదని కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని మంత్రి సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రితో అత్యవసర భేటీ అనంతరం సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. విభజన అన్యాయం నుంచి బయటపడాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. బడ్జెట్‌లో రాజధానికి నిధులు కేటాయించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరకుంటే తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇతర నగరాలపై చూపిన ప్రేమ అమరావతిపై చూపలేదనే అసంతృప్తి సర్వత్రా ఉంది. ఈ విషయంపై శుక్రవారం జరిగే మంత్రి వర్గ సమావేశం, ఆదివారం జరిగే టీడీపీ ఎంపీల సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి అవసరమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. బడ్జెట్ విషయంలో కాంగ్రెస్, వైకాపాలు టీడీపీని విమర్శించే నైతిక హక్కులేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్గతిలో ఉండటానికి కారణం కాంగ్రెస్ పార్టీనే అని ధ్వజమెత్తారు. విభజన సమస్యల పరిష్కారం కోసం మిత్రపక్షంగా ఉండికూడా తాము కేంద్రంపై ఒత్తిడి తేవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజీపడే ప్రసక్తేలేదని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

అన్యాయం జరిగింది




కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని మంత్రి అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మిత్రపక్షంగా ఉన్నా ఈవిధమైన కేటాయింపులు జరపడం బాధాకరమన్నారు. రైల్వే జోన్ అంశాన్ని బీజేపీనే సెంటిమెంట్‌గా మార్చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో మాకు, బీజేపీకి ఇద్దరికి ఇబ్బంది కలిగే అంశంగా పేర్కొన్నారు. బడ్జెట్ ఆమోదం పొందేలోగా రాష్ట్రానికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామన్నారు.

ఆనందబాబు అసంతృప్తి



సీఎంతో అత్యవసర సమావేశ అనంతరం మంత్రి నక్కా ఆనందబాబు బడ్జెట్‌పై పెదవి విరిచారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు జరగలేదని సర్వత్రా నిరుత్సాహంగా ఉందన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులంతా బడ్జెట్‌పై అసంతృప్తితో రగిలి పోతున్నారన్నారు. సీఎం వద్ద కూడా తమ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు మంత్రి ఆనందబాబు తెలిపారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం



బడ్జెట్‌తో 5 కోట్ల ఆంధ్రులు నిరాశ, నిస్పృహలకు లోనయ్యారని మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన 'ఆంధ్రప్రభ'తో మాట్లాడుతూ ఏవో వర్సిటీలకు రూ.10 కోట్లు, 20 కోట్లు కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. విభజన హామీల్లో భాగమైన విశాఖ, విజయవాడ, తిరుపతి మెట్రో రైలు ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించకుండా కేంద్రం మొండిచేయి చూపించిందని మంత్రి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు మంత్రివర్గ సమావేశం

శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వెలగపూడి సచివాలయంలో జరగనున్న సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షత వహిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై కేబినెట్ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. ఇదే సమావేశంలో ఇటీవల కేంద్రానికి నివేదించిన సమస్యలపై లోతుగా చర్చించనున్నారు. ప్రధానంగా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు ఉన్న ప్రాధాన్యత కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం లేదని విషయమై ముఖ్యమంత్రితో పాటు మంత్రులు మరోసారి తమ గళాన్ని వినిపించనున్నారు. ప్రాధాన్యత ప్రాతిపదికను బడ్జెట్‌లో విస్మరించారని దీనిని ముమ్మాటికి వ్యతిరేకించాలనే పట్టుదల కనిపిస్తుంది. కొన్ని సంస్థలకు భూముల కేటాయింపు, దావోస్ పర్యటన త్వరలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు, పోలవరం ప్రాజెక్టు, విద్యా సంస్థలకు అరకొర నిధులు కేటాయింపు, అమరావతి రాజధాని నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్న శాశ్వత భవనాల నిర్మాణం వంటి పలు అంశా లు కూడా ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి.

ఉ. 10:30 గంటలకు వెలగపూడి సచివాలయంలోని 1వ నెంబర్ బ్లాక్‌లో తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరగనుంది. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో కూడా ప్రధానంగా కేంద్రమంత్రి కేటాయింపుల అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. కేంద్రంతో తాడోపేడో తెల్చుకోవాలనే అభిప్రాయం కేంద్రమంత్రులు, ఎంపీలు, రాష్ట్ర మంత్రుల్లో బలంగా వ్యక్తమవుతున్నది. రాష్ట్రమంత్రి ఏపీ టిడిపి అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావుతో పాటు ఉపముఖ్యమంత్రులు, సీనియర్ నేతలు సమన్వయ కమిటీ భేటీలో పాల్గొననున్నారు.

ఆధ్యాత్మిక నగరంగా అమరావతి

● అంతర్జాతీయ కేంద్రంగా బ్రహ్మకుమారి సంస్థ ● శాంతి, దైవచింతనతో రాష్ట్రాభివృద్ధి ● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఏర్పాటు వలన ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకోబోతోందని సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. అధికారుల సమావేశాలు, పార్టీ నేతల సమాలోచనలు దేశ, విదేశీ వ్యాపార పారిశ్రామిక సంస్థల అధిపతుల భేటీలతో నిరంతరం బిజీగా ఉండే ముఖ్యమంత్రి చంద్రబాబు వాటన్నింటికీ దూరంగా ఆధ్యాత్మిక చింతన, భక్తి భావనతో తన్మయులైన ఘటన గురువారం రాజధాని ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం యూనివర్సల్ పీస్ రిట్రీట్‌మెంట్ సెంటర్ భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగం ఆసాంతం ఆధ్యాత్మిక ప్రవచనంలా సాగింది. బ్రహ్మకుమారి సంస్థ రాజయోగిని జానకిదాది రాజధాని ప్రాంతానికి రావడంతో ఈ ప్రాంతం పునీతమైందన్నారు. ఆమె పవిత్ర హృదయంతో సందేశానిచ్చి ఆశీర్వదించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బ్రహ్మకుమారి కుటుంబసభ్యులుగా తనను గుర్తించడం పూర్వజన్మ సుకృతమని సీఎం భక్తి పారవశ్యంతో అన్నారు. ప్రపంచానికి శాంతి, ఆనందం ఇచ్చే ఏకైన సంస్థ బ్రహ్మకుమారీస్ అని సీఎం కొనియాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా అమరావతిలో ఏర్పాటు చేసిన సంస్థను రూపొందించాలని సీఎం కోరారు. పూర్తయితే ఈ ప్రాంతం గొప్ప మానసిక వికాస కేంద్రంగా ఆవిర్భవించనుందన్నారు. యోగా, ఆధ్యాత్మికతే కాకుండా యువతలో చైతన్యం, నాయకత్వ లక్షణాలు, మహిళాభివృద్ధి తదితర కార్యక్రమాలెన్నో ఈ కేంద్రం ద్వారా చేపట్టనున్నట్లు సీఎం వివరించారు. మంత్రులు, విధాన రూపు కర్తలు, సంస్థల అధిపతులు, అధికారులు, న్యాయమూర్తులకు ఆధ్యాత్మిక ప్రబోధనలివ్వాలని తద్వారా సమాజహితం జరుగుతుందన్నారు. ఈ సంస్థలో అత్యధికంగా మహిళలే శక్తివంతంగా పనిచేస్తూ అంతర్జాతీయ సంస్థగా రూపొందించారన్నారు. ప్రపంచంలోని అన్ని కేంద్రాల కంటే అమరావతి బ్రహ్మకుమారి కేంద్రం ఉత్తమ కేంద్రంగా తయారు చేయాలన్నారు. ఆధ్యాత్మిక సంస్థ ప్రపంచానికి చిరునామాగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. బ్రహ్మకుమారీలను తెల్ల పోలీసులుగా చంద్రబాబు అభివర్ణించారు. బ్రహ్మకుమారీస్ ఎక్కడ ఉంటే అక్కడ శాంతి సౌభ్రాతత్వాలు వెల్లివిరిస్తాయన్నారు. రాజయోగిని జానకిదాది ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షంగా ఉండాలని రాజధాని నగరం ప్రపంచంలోనే అత్యంత ఉత్తమ నగరంగా రూపుదిద్దుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, రాష్ట్ర మంత్రులు అయ్యన్నపాత్రుడు, పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, నారాయణ, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ కోన శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రతన్‌దాదాజీ, సంతోష్, కులదీప్, సవిత, శాంతి, మృత్యుంజయ, తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయంగా ఉన్న బ్రహ్మకుమారీలు సిల్క్ వస్త్రాలతో కార్యక్రమానికి రావడం ఓం శాంతి ఉచ్చారణ చేయడంతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక చింతనతో మునిగి పోయింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును రాజయోగిని జానకిదాది ఘనంగా సత్కరించారు. అలాగే సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున జానకిదాదితోపాటు బ్రహ్మకుమారి ప్రతినిధులను సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నెక్కల్లు సమీపంలో బ్రహ్మకుమారీస్‌కు కేటాయించిన పదెకరాల భూమిలో పీస్ రిట్రీట్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

8న దుబాయ్ పర్యటనకు ముఖ్యమంత్రి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక రోజు పర్యటన నిమిత్తం ఫిబ్రవరి 8న దుబాయ్ వెళ్తున్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రి విజయవాడ నుంచి బయలుదేరి తిరిగి 8వ తేదీ రాత్రి ఉండవల్లికి చేరుకుంటారు. ఫిబ్రవరి నెలాఖరులో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. దీనికి ముందు సన్నాహకంగానే కొన్ని పారిశ్రామిక సంస్థలతో చర్చించి వాటిని విశాఖ సదస్సుకు ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి దుబాయ్ వెళ్తున్నట్లు తెలిసింది.

ప్రసూతి మరణాల తగ్గింపునకు యునిసెఫ్‌తో ఒప్పందం

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో ప్రసూతి మరణాల శాతాన్ని తగ్గించేందుకు యునిసెఫ్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు గురువారం సచివాలయంలో యునిసెఫ్‌కు ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల ప్రతినిధి మెయిటల్ రుసుడియాతో రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్యలు ఈ ఎంవోయుపై సంతకాలు చేశారు.

ఐఎస్ఐ ఆసుపత్రిలో మంత్రి పితాని ఆకస్మిక తనిఖీ

అమరావతి, ఆంధ్రప్రభ : విజయవాడలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ హాస్పిటల్ (ఇఎస్ఐ)ను సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. రూ.500 కోట్లతో ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వం ఖరారు చేయనున్నదన్నారు. గురువారం ఉదయం గుణదలలోని ఇఎస్ఐ హాస్పటల్‌ను మంత్రి పితాని సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులలో కొద్ది సేపు మాట్లాడారు. హాస్పటల్ భవనం శిథిలావస్థలో ఉండటం గమనించారు. రికార్డులను తీసుకుని పరిశీలించారు. ఈ తనిఖీలలో మంత్రితో పాటు హాస్పటల్ సూపరిండెంట్ పిఆర్ఎస్ జాన్సన్, వివిధ విభాగాల డాక్టర్లు , లేసెక్రటరీ బి.కృష్ణకిషోర్ ఉన్నారు.

డీజీపీకి వైకాపా నేతల ఫిర్యాదు

● పోలీసు అధికారుల తీరు సరిగా లేదని ఆరోపణ ● నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వినతి



అమరాతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, సత్వర మే జోక్యం చేసుకుని వాటిని నియంత్రించాలని రాష్ట్ర డీజీపీ ఎం మాలకొండయ్యను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోరారు. ఈమేరకు గురువారం వారు డీజీపీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమ ర్పించారు. అనంతరం రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి తమ పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బాధ్యత కలిగిన ప్రతిపక్షపార్టీగా ప్రభుత్వం పాలనలో లోపాలను ఎత్తి చూపుతోందన్నారు.

రబీలో విద్యుత్ డిమాండ్ 180 మిలియన్ యూనిట్లు

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రస్తుతం రబీలో విద్యుత్ డిమాండ్ రోజుకు 180 మిలియన్ యూనిట్లుగా ఉన్నట్లు అంచనా వేశామని ఇంధన, ఐ అండ్ ఐ, సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. గురువారం స్థానిక విద్యుత్ సౌధలో ఇంధన శాఖ సలహాదారు కె. రంగనాథం, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎంఎం నాయక్, హెచ్‌జే దొర, ట్రాన్స్‌కో జేయండీలు దినేష్ పర్చూరి, పి ఉమాపతి, సోలార్ కార్పొరేషన్ ఎండీ ఆదిశేషులతోపాటు ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని డైరెక్టర్లు, సీ.ఈలతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ సీజన్‌లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వారంలోగా రూపొందించి సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యాచరణ రూపకల్పనకు సంబంధించి రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి కిమిడి కళా వెంకట్రావుతో కూడా ఇప్పటికే చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి మార్చి 2వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లల్లో రైతులు, ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాలు అందరితో కలిసి సబ్ స్టేషన్ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు సబంధించి ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు ఇతర ప్రజా ప్రతినిధులకు సంబంధిత సీఎండీలు లేఖలు రాయాలని ఇంధన శాఖా మంత్రి సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈఈఎస్ఎల్ సహకారంతో మార్కెట్‌లోకి 1500 విద్యుత్ వాహనాలు రానున్నాయని ఆయన తెలిపారు.

నదుల అనుసంధానంతో నీటి కొరత లేకుండా చర్యలు



● వ్యవసాయంలో 15 శాతం వృద్ధే లక్ష్యం ● కేపీఎమ్జీ సిలికాన్ వ్యాలీ ఎగ్జిక్యూటివ్స్ సమావేశంలో మంత్రి లోకేష్

అమరావతి, ఆధ్రప్రభ: నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గురువారం శాన్ ఫ్రాన్సిస్కోలోని కెపిఎమ్జీ సిలికాన్ వ్యాలీ ఎగ్జిక్యూటివ్స్ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ ఏపీలో అధ్బుతమైన యవతీ, యువకులు ఉన్నారని, వారికి అధునాత టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో ఏపీ అగ్రస్థానంలో ఉందన్నారు. తక్కువ వర్షపాతం ఉన్నా టెక్నాలజీ ఉపయోగించి వ్యవసాయ రంగంలో రెం డంకెల వృద్ధి సాధించామని, 15శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని, పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద కార్ల కంపెనీల్లో ఒకటైన కియా ఏపీకి వచ్చిందని, టెక్నాలజీని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నామన్నారు. రియల్ టైం గవర్నెన్స్ అమలు చేస్తున్నామని, ప్రజల సంతోష సూచికపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఐఓటీ, బిగ్ డేటా అనలిటిక్స్ ద్వారా వివిధ శాఖల్ని అనుసంధానం చేస్తున్నామన్నారు.

స్టాన్ ఫోర్డ్ బిజినెస్ స్కూల్ డీన్ జోనతాన్‌తో మంత్రి లోకేష్ భేటీ

ఏపీలో స్టార్టప్ కంపెనీలకు సిలికాన్ వ్యాలీ అనుభవాలు, మేధస్సు అందించడానికి ఫాల్కన్ ఎక్స్ వేదిక ఏర్పాటు చేశామని, దీని అభివృద్ధికి స్టాన్ ఫోర్డ్ భాగస్వామ్యం కావాలని మంత్రి లోకేష్ అన్నారు. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్ డీన్ జోనతాన్ లెవిన్‌తో భేటీ అయిన మంత్రి ఏపీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణల గురించి వివరించారు. ఇటీవల కాలంలో ప్రారంభించిన ఫాల్కన్ ఎక్స్ ఇంక్యుబేటర్‌కు సహకారం అందించాలని జోనతాన్‌ని కోరారు. రాష్ట్ర విభజన తరువాత స్టార్టప్ కంపెనీలా అనేక సమస్యలు ఎదుర్కొంటూ అభివృద్ధి సాధిస్తున్నామని, ప్రతి ఒక్కరికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రా భివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జోనతాన్ లెవిన్‌ని కోరారు. దీనిపై స్పందించిన డీన్ లెవిన్ ఫాల్కన్ ఎక్స్‌కు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. స్టాన్ ఫోర్డ్ బిజినెస్ స్కూల్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీడ్ యాసిలిటేటర్ కార్యక్రమంలో భాగంగా ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి లెవిన్ అంగీకరించారు. సీడ్ యాసిలిటేటర్ కార్యక్రమం ద్వారా ఏపీలో ప్రారంభమయ్యే స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు ప్రపంచ స్థాయి కంపెనీలుగా ఎదిగేందుకు సహకారం అందిస్తామన్నారు. డీమిక్స్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా ఏపీలోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, ఈకార్యక్రమంలో భాగంగా ఏపీ ప్రభుత్వంతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటామని లెవిన్ స్పష్టంచేశారు.

కోవలెంట్ వెంచర్స్, జనరల్ క్యాటలిస్ట్ అధిపతులతో మంత్రి లోకేష్ సమావేశం

రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందని, 2019లో భాగంగా బ్లాక్ చైన్ టెక్నాలజీ యూనివర్శటీని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేష్ అన్నారు. గురువారం కోవలెంట్ వెంచర్స్ సీఈఓ యలమంచిలి రామ్, జనరల్ క్యాటలిస్ట్ ఎండీ హేమంత్ తనేజాతో భేటీ అయిన మంత్రి ఏపీని ప్రంచంలోనే బ్లాక్ చైన్ రాజధానిగా ఏపీని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో ల్యాండ్ రికార్డ్సు టాంపరింగ్ జరగకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగిస్తున్నామని, సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ లాకర్ ద్వారా ఆధార్ నెంబర్ ద్వారా అన్ని సర్టిఫికెట్లు ఆన్ లైన్‌లో వచ్చేవిధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని జనరల్ క్యాటలిస్ట్ ఎండీ హేమంత్ తనేజాను మంత్రి కోరారు. దీనిపై స్పందించిన తనేజా ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సుముఖతే వ్యక్తంచేశారు.

ఫస్ట్ అమెరికన్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి చర్చలు

టైటిల్, ఇన్సూరెన్స్ సర్వీసెస్, మోర్టేజ్ హోమ్ వారంటీ సర్వీసెస్ అందిస్తున్న ఫస్ట్ అమెరికన్ కంపెనీ సీఈఓ డెన్నిజ్ జే గిల్మోర్, ఎక్సిక్యూటివ్ ప్రెసిడెంట్ కెన్త్ డిజియోర్జియో, ఛీఫ్ ఫైనాన్సియల్ ప్రెసిడెంట్ మార్క్‌తో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ల్యాండ్ రికార్డ్సు డిజిటలైజ్ చేస్తున్నామని, బ్లాక్ చైన్ టెక్నాలజీతో టాంపరింగ్ లేకుండా చేస్తున్నామని, దీని వలన రైతుల తక్కువ సమయంలో టైటిల్ ఇన్సూరెన్స్, రుణాలు పొందే అవకాశం వచ్చిందన్నారు. సర్టఫికెట్ లెస్ గవర్నమెంట్ తీసుకొస్తున్నామని, అధునాతన హంగులతో రాజధాని అమరావతి నిర్మించబోతున్నామన్నారు. దీనిపై స్పందించిన ఫస్టు అమెరికన్ ప్రతినిధులు త్వరలోనే ఏపీకి వస్తామని, అక్కడ జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూస్తామన్నారు. అదేవిధంగా ఫైబర్ గ్రిడ్‌ని ఉపయోగించుకొని వర్క్ ఫ్రమ్ హోమ్ పైలెట్ ప్రాజెక్టు కొన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని స్పష్టంచేశారు.

తెలుగు భాష అభివృద్ధికి అందరూ కలిసి కృషిచేయాలి : మంత్రి లోకేష్

తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయాలు మర్చిపోతే మనకు గుర్తింపు, భవిష్యత్తు ఉండదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గురువారం కాలిఫోర్నియాలో సిలికాన్ ఆంధ్రా యూనివర్శిటీ ప్రథమ వార్షికోత్సవంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. అమెరికాకు వస్తే మన భాష, సంస్కృతి, సాంప్రదా యాలు మర్చిపోతారనుకున్నానని, కానీ ఇక్కడ అన్నీ గుర్తు పెట్టుకుంటున్నారని, ఇండియాలోనే మర్చిపోతున్నారన్నారు. సిలికాన్ ఆంధ్రా తెలుగు భాష పరిరక్షణకు ఎంతో కృషిచేస్తుందని, సిలికాన్ ఆంధ్రాయూనివర్శిటీలో కూచిపూడి నాట్యం, కర్నాటక మ్యూజిక్ భావితరాలకు తెలిసేలా చేస్తున్నారన్నారు. తెలుగు భాషమీద రీసెర్చ్ జరగాలని, ఒక రీసెర్చ్ ప్లాట్ ఫార్మ్ ఏర్పాటు చేయాలని, దీనికి సిలికాన్ ఆంధ్రా సహకారం కావాల న్నారు. కూచిపూడిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని, ఏపీలో కూచిపూడి సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు. దీనికి సిలికాన్ ఆంధ్రా సహకరించాలని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు కలిసి ఉండాలని, తెలుగు భాష అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు.





ఇది అభివృద్ధి, జనహిత బడ్జెట్

● గ్రామీణ భారతానికి ఊతం ● నవభారత నిర్మాణం బలోపేతం
● అన్ని రంగాల పట్ల అంకిత భావం ● జైట్లీ బృందానికి ప్రధాని అభినందనలు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను అభివృద్ధి హితమైనదిగా గురువారం పేర్కొన్నారు. బడ్జెట్ ఒక నవభారత్ దృక్కోణాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. రైతులు, దళితులు,గిరిజన వర్గాలు బడ్జెట్ ద్వారా లబ్ధి పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆయన బృందాన్ని ప్రధాని అభినందించారు. బడ్జెట్ గ్రామీణ భారతానికి ఉపాధి అవకాశాలు సృష్టిస్తుందని తెలిపారు. ఇది సాధారణ ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రభుత్వపు చివరి పూర్తి స్థాయి బడ్జెట్. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరుగుదొడ్ల నిర్మాణం, గృహనిర్మాణం, విద్యుత్, ఆరోగ్యం సహాపలు రంగాలకు తమ ప్రభుత్వం చేపట్టిన పలు పథకాలను విడమరిచి చెప్పారు. బడ్జెట్ వ్యవసాయం నుంచి మౌలిక సదుపాయాల కల్పన దాకా అన్ని రంగాల పట్ల అంకిత భావం ప్రదర్శించిందని మోడీ తెలిపారు. బడ్జెట్ రైతులకు, సామాన్య పౌరులకు, వాణిజ్య రంగానికి అనుకూలమైనదని చెప్పారు. అది సులువైన జీవనం, సులువుగా వ్యాపారం చేసుకునే వెలుసుబాటును కల్పిస్తున్నదని ప్రధాని తెలిపారు. నిర్ధరక ఆస్తులు(ఎన్‌పీఏ), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) రంగానికి సంబంధించి ప్రభుత్వం త్వరలో పటిష్ఠమైన ప్రణాళికలు ప్రకటిస్తుందని మోడీ చెప్పారు.

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్‌లకు వేతనాల పెంపు





న్యూఢిల్లీ : రాష్ట్రపతి నెల వేతనాన్ని పెంచుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో నిర్ణయించారు. రాష్ట్రపతి వేతనాన్ని రూ.5లక్షలుగా, ఉప రాష్ట్రపతి వేతనాన్ని రూ.4లక్షలుగా పెంచుతూ ప్రకటించారు. గవర్నర్ నెలవారీ వేతనాన్ని రూ.3.5లక్షలుగా నిర్ధారించారు. ఇటు పార్లమెంట్ సభ్యుల జీత భత్యాలపైనా కీలక నిర్ణయం తీసుకున్నారు. పన్ను మినహాయింపుల్లో వేతన జీవులకు ఊరట ఇవ్వని జైట్లీ.. దేశాధినేతలు, రాష్ట్రసారథులను మాత్రం సముచితంగా గౌరవించారు. ఇక నుండి ప్రతి ఐదేళ్లకోసారి వీరి వేతనాలు పెరుగుతాయని చెప్పారు. రాష్ట్రపతి వేతనాన్ని రూ.1.50లక్షల నుండి రూ.5లక్షలకు, ఉప రాష్ట్రపతి వేతనాన్ని రూ.1.30లక్షల నుండి రూ.4లక్షలకు, గవర్నర్ వేతనాన్ని రూ.1.10లక్షల నుండి రూ.3.5లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. ఈ పెంపు 2018 జనవరి వర్తిస్తుందని వివరించారు. ప్రస్తుతం ఉన్న కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో పోలిస్తే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్‌లకు చాలా తక్కువగా జీతాలు ఉన్నాయని తెలిపారు. జనవరి 1, 2016 7వ పే కమిషన్ అమలు తరువాత కేబినెట్ కార్యదర్శి, దేశంలోని అగ్రశ్రేణి అధి కారులు నెలకు రూ.2.50లక్షలు పొందుతున్నారు. యూనియన్ ప్రభుత్వ కార్యదర్శికి రూ.2.25లక్షల వేతనం ఉందని జైట్లీ గుర్తు చేశారు. నేవీ, ఆర్మీలో కూడా చాలా జీతాలు ఉన్నాయని, వారికి బాస్‌గా ఉన్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతికి వేతనాలు తక్కువ ఉండటాన్ని గమనించి వారికి గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో వారి వేతనాలు పెంచుతున్నట్టు ప్రకటించారు. ఆర్మీ చీఫ్ కంటే ప్రస్తుతం రాష్ట్రపతి వేతనం చాలా తక్కువగా ఉందని పోల్చారు.



ఎంపీల వేతనం రూ.50వేలు నుంచి రూ.లక్షకు పెంపు

ఇక ఎంపీల జీతభత్యాల పెంపు విధానాన్ని రూపొందించామని, ద్రవ్యోల్బణాన్ని అనుసరించి ప్రతి ఐదేళ్ల ఒకసారి ఎంపీల జీతాలు ఆటోమెటిక్‌గా పెరుగుతాయని తెలిపారు. ఎంపీల జీతం, నియోజకవర్గ భత్యం, కార్యాలయ ఖర్చులు, సమావేశ భత్యం ఏప్రిల్, 2018 నుండి ప్రారంభం అవుతుందని జైట్లీ చెప్పుకొచ్చారు. బేసిక్ వేతనం రూ.50వేలు ఉండగా దాన్ని 1లక్షకు పెంచుతూ బడ్జెట్‌లో ప్రతిపాదన చేశారు. నియోజకవర్గాల ఖర్చులు రూ.45వేలుగా ఉంది. ప్రభుత్వం ఓ ఎంపీకి సుమారు రూ.2.7లక్షలు చెల్లిస్తున్నది. రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు బడ్జెట్ సమా వేశంలో భాగంగా ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు.

జైట్లీ ఎవరిని ఎన్ని సార్లు అన్నారు?!

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో గురువారం చేసిన బడ్జెట్ ప్రసంగంలో మొత్తం 6,600 పదాలు ఉన్నాయి. 110 నిముషాల ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా రైతు అనే పదాన్ని 27 సార్లు, పేదలు అనే పదాన్ని 21 సార్లు, గ్రామీణం 20 సార్లు, వ్యవసాయం 16 సార్లు, మహిళలు అనే పదాన్ని 10 సార్లు ప్రస్తావించారు. అదే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఎదిగి వచ్చిన తీరును నాటకీయంగా వర్ణించారు. మేడమ్ స్పీకర్, ప్రస్తుతం ఈ దేశ అగ్రనాయకత్వం పేదరికాన్ని అత్యంత దగ్గరగా చూసిన తర్వాతనే ఈ స్థాయికి చేరుకుంది. మా నాయకత్వానికి సమాజంలో ఎస్సీ, ఎస్టీ బీసీ, ఆర్థికంగా బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు బాగా తెలుసు అని ఆర్థిక మంత్రి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు వారికి కేస్ స్టడీలు కారు. మరోవైపు సాక్షాత్తూ వారే కేస్ స్టడీగా నిలిచారు అని జైట్లీ వివరించారు.

బడ్జెట్‌కు ఐఎంఎఫ్ జయహో

వాషింగ్టన్: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో విధించిన ఆర్థిక లక్ష్యాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) గురువారం స్వాగతించింది. బడ్జెట్‌ను పూర్తిగా అంచనా వేసే అవకాశం తమకు రాలేదని ఐఎంఎఫ్ ఉప అధికార ప్రతినిధి విలియం ముర్రే విలేకరులతో అన్నారు. కానీ బడ్జెట్ లక్ష్యాలను తాము స్వాగతిస్తున్నట్టు తెలిపారు. వాటిలో జీడీపీలో ద్రవ్యలోటు 3.3 శాతం కీలకమైనదని చెప్పారు. అది బడ్జెట్‌ను క్రమక్రమంగా ఆర్థిక స్థిరీకరణ మార్గంలోకి తిరిగి తీసుకువస్తుందని తాము భావిస్తున్నట్టు ముర్రే తెలిపారు. అదే సమయంలో భారత్ అవసరాలకు మద్దతు సమకూర్చాల్సిన ఆవశ్యకతను, ఆర్థిక సర్వేను అది గమనంలోకి తీసుకుంటుందని చెప్పారు.

ఉద్యోగులకు రవాణా, మెడికల్‌లో రాయితీ

న్యూఢిల్లీ: ప్రతీ ఏడాది రూ.40వేలు తిరిగి చెల్లించే వారికి రవాణ, మెడికల్ రంగంలో కాసింత ఊరట ఇచ్చారు. 1 శాతం అలవెన్స్‌ను పెంచుతూ ఆర్థిక శాఖ మంత్రి జైట్లీ నిర్ణయం తీసుకున్నారు. వ్యక్తిగతంగా పన్నులు చెల్లించేవారు రవాణా అలవెన్స్ కింద రూ.19,200 కోట్ల బెనిఫిట్స్ పొందుతున్నారు. అదేవిధంగా హెల్త్ అలవెన్స్ కింద 15,000 కోట్ల రాయితీలు అందుతున్నాయి. రెండు సేవా రంగాల కింద పన్ను ప్రతీ ఏడాది రాయితీ రూ.34,200గా ఉంది. రూ.40వేల వేతనం ఉన్న వారు ట్యాక్స్ కట్టగా చివరి డిడక్షన్ కింద ప్రతీ ఏడాది రూ.5,800 తిరిగి పన్ను శాఖ చెల్లిస్తుంది.

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ విదియ సా. 3.52 వరకు, అనంతరం తదియ; నక్షత్రం: మఖ సా. 4.02 వరకు, అనంతరం పుబ్బ; అమృతకాలం: మ. 1.50 నుండి 3.20 వరకు; వర్జ్యం: రా. 11.45 నుండి 1.16 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, మ.12.24 నుండి 1.12వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు;

కేటాయింపులిలా...!

బడ్జెట్ హైలైట్స్

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018-19 సార్వత్రిక బడ్జెట్‌ను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పారదర్శక పాలనను అందిస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. అవినీతి రహిత సర్కార్ ఏర్పాటుకు కృషి చేశామని తెలిపారు. భారత్‌తో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగాయన్నారు. ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ లావాదేవీలు పెరిగాయన్న జైట్లీ.. ఆర్థిక వ్యవస్థ గాడిలో పడిందని చెప్పారు. త్వరలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రెండో త్రైమాసికంలో వృద్ధిరేటు 6.3 శాతంగా ఉందని, వచ్చే ఏడాది 7.4 శాతం వృద్ధిరేటు సాధ్యమవుతుందని వెల్లడించారు. ఎగుమతుల్లో 15 శాతం వృద్ధి సాధ్యమన్నారు. సాధించిన ప్రగతిని పటిష్టం చేసుకోవడమే ప్రస్తుత బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని అరుణ్ జైట్లీ పేర్కొన్నారు.


- గ్రామీణ వ్యవసాయ, విద్యారంగాలపై ప్రత్యేక దృష్టి
- ఉజ్వల, సౌభాగ్యయోజన పథకాల ప్రస్తావన
- గ్రూప్-సి, డి ఉద్యోగాలకు ఇంటర్వ్యూ లేకుండా చేశాం
- వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి రైతులకు లాభాలు పెరగాలి
- 86 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే
- గ్రామీణ మార్కెట్లలో 2వేల కోట్లతో సదుపాయాల అభివృద్ధి
- ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-3లో అన్ని వాతావరణాలను తట్టుకునేలా రోడ్లు నిర్మిస్తాం
- అత్తరు లాంటి ఉత్పత్తుల కోసం రూ.200 కోట్లు కేటాయింపు
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రూ.1400 కోట్లు
- 42 మెగా ఫుడ్ పార్కులలో అత్యాధునిక సౌకర్యాలు
- వెదురు ఉత్పత్తికి రూ.1290 కోట్లు
- వ్యవసాయ రుణాలు 11 లక్షల కోట్లకు పెంపు
- ఢిల్లీ పరిసరాల్లో వాయు కాలుష్య నియంత్రణకు ప్రత్యేక పథకం
- ఉజ్వల యోజన కింద 8 కోట్ల మంది మహిళలకు గ్యాస్‌కనెక్షన్లు
- స్వచ్ఛభారత్ కింద 2 కోట్ల మరుగుదొడ్లు నిర్మించడమే లక్ష్యం
- పేదల గృహ వసతి కోసం 51 లక్షల ఇళ్ల నిర్మాణం
- 96 వెనుకబడిన జిల్లాలో ప్రతి చేనుకు సాగు నీరు పథకం
- గిరిజన ప్రాంతాల్లో విద్యాభివ ద్ధికి ఏకలవ్య పాఠశాలలు
- నాలుగేళ్లలో లక్ష కోట్లతో విద్యాభివృద్ధికి రైజ్ పథకం
- వేయి మంది బీటెక్ విద్యార్థులకు ప్రధాని రీసెర్చ్ ఫెలో పథకం



- రూ.1200 కోట్లతో పేదల కోసం ఆరోగ్య కేంద్రాలు
- కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా
- ప్రతి ఒక్కరికి రూ.330 ప్రీమియంతో రూ.5లక్షల బీమా
- టీబీ చికిత్స కోసం 600 కోట్లు కేటాయింపు
- ప్రధాని జీవన్ బీమా యోజనతో 5.23 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలకు రూ.56 వేల కోట్లు
- చిన్న సూక్ష్మ పరిశ్రమల పరపతికి రూ.3700 కోట్లు
- 3 లక్షల కోట్ల ముద్ర రుణాలు
- 2019 నాటికి మహిళా సంఘాలకు రూ.75వేల కోట్ల రుణాలు
- జాతీయ జీవనోపాధి మిషన్‌కు రూ.5750 కోట్లు
- కొత్త ఉద్యోగులకు ఈపీఎఫ్ కింద 12 శాతం కంట్రిబ్యూషన్
- జౌళిరంగానికి 7148 కోట్లు కేటాయింపు
- లడ్డాక్‌లో శేలాపాస్ దగ్గర సొరంగం నిర్మాణానికి చర్యలు
- స్మార్ట్ సిటీ పథకం విజయవంతం
- 9వేల కి.మీ జాతీయరహదారుల నిర్మాణం
- 5.35 లక్షల కోట్లతో 35000 కి.మీ రహదారుల నిర్మాణం
- ప్రాంతీయ విమానయానరంగంలో 56 ఎయిర్‌పోర్టులు
- టెలికం మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.10వేల కోట్లు
- టోల్‌గేట్ల వద్ద పే యాజ్ యూ యూజ్ పథకం
- రక్షణ రంగంలో దేశీయ ఉత్పత్తుల పెంపునకు కొత్త విధానం

కేంద్ర బడ్జెట్ కేటాయింపులు

- కేంద్ర బడ్జెట్ అంచనా రూ. 24 లక్షల కోట్లు
- మూలధన వ్యయం రూ. 7, 78, 712 కోట్లు
- కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులకు రూ. 7,8,934 కోట్లు
- ఇతర వ్యయాలు, వడ్డీ చెల్లింపులకు రూ.5,75,975 కోట్లు
- గ్రామీణ పారిశుధ్య పథకానికి రూ. 16,713 కోట్లు
- వ్యవసాయ రుణాలకు రూ. 11 లక్షల కోట్లు
- రైల్వేలకు రూ. 1.48 లక్షల కోట్లు
- ఎస్సీల సంక్షేమం కోసం రూ. 56,619 కోట్లు
- ఎస్టీల సంక్షేమం కోసం రూ. 39,135 కోట్లు
- చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల కోసం రూ. 3,790 కోట్లు
- టీబీ రోగుల సంక్షేమం కోసం రూ. 600 కోట్లు
- గ్రామీణ పారిశుధ్య పథకానికి రూ. 16,713 కోట్లు
- విద్య, ఆరోగ్య, సంక్షేమానికి రూ. 1.38 లక్షల కోట్లు
- రోడ్లు, మౌలిక వసతులకు రూ. 9.64 లక్షల కోట్లు
- ఇంటింటికీ తాగునీటి పథకానికి రూ. 77,500 కోట్లు
- 99 నగరాల ఆధునీకరణకు రూ. 2.04 లక్షల కోట్లు
- చేనేత, జౌళి రంగానికి రూ. 7,500 కోట్లు
టెక్స్ టైల్ రంగానికి రూ. 7,140 కోట్లు
- 2019 నాటికి మహిళా సంఘాలకు రూ. 75 వేల కోట్ల రుణాలు
- ఆహార శుద్ధి రంగానికి రూ. 1400 కోట్లు
- రూ.2 వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో వ్యవసాయమార్కెట్ల అభివృద్ధి



- ఆపరేషన్ గ్రీన్ కోసం రూ. 500 కోట్లు
- గంగా ప్రక్షాళనకు రూ. 16,700 కోట్లు
- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల మేర ముద్రారుణాలు
- వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం రూ. 1200 కోట్లు
- గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.14.34 లక్షల కోట్లు
- జాతీయ జీవనోపాధి మిషన్ కోసం రూ. 5,750 కోట్లు
- వెదురు పరిశ్రమ ప్రోత్సాహం కోసం రూ. 1290 కోట్లు
- నీటి వసతి లేని 96 జిల్లాల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు

రైల్వే బడ్జెట్ కేటాయింపులు



- 4 వేల కి.మీ విద్యుద్దీకరణ పనులు చేపట్టాం
- 4200 మానవరహిత రైల్వే లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు
- అన్ని రైళ్లలో వైఫై, సీసీ టీవీలు ఏర్పాటు చేయడమే లక్ష్యం
- ముంబై లోకల్ రైళ్ల కోసం 90 కి.మీ మేర డబుల్ లైన్
- ముంబై సబర్బన్ రైల్వేకు రూ.17వేల కోట్లు
- బెంగళూరు మెట్రోకు రూ.17వేల కోట్లు

ఏపీకి కేటాయింపులు

- ఏపీ సెంట్రల్ యూనివర్సిటీకి రూ.10 కోట్లు
- ఏపీ నిట్‌కు రూ.54 కోట్లు
- ఏపీ ఐఐటీకి రూ.50కోట్లు, ఐఐఎంకు రూ.42 కోట్లు
- ఏపీలో ట్రిపుల్ ఐటీకి రూ.30 కోట్లు
- ఏపీ ఐఐఎస్‌సీఆర్‌కు రూ.49కోట్లు
- ఏపీ ట్రైబల్ యూనివర్సిటీకి రూ.10కోట్లు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌కు రూ.5కోట్లు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియంకు రూ.32 కోట్లు
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు రూ.19.62 కోట్లు
- విశాఖ పోర్టుకు రూ.108 కోట్లు
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.1400 కోట్లు

తెలంగాణకు కేటాయింపులు

- తెలంగాణ ట్రైబల్ యూనివర్సిటీకి రూ.10 కోట్లు
- హైదరాబాద్ ఐఐటీకి రూ.75 కోట్లు
- సింగరేణికి రూ.2 వేల కోట్ల పెట్టుబడులు

అరుణ్ జైట్లీ ప్రసంగం వేళ.. సభ సాగిందిలా..!



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు వరుసగా ఐదవ బడ్జెట్‌ను గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటలు ప్రసంగించారు. వంగపండు రంగు కుర్తా, నల్ల రంగు నెహ్రూ కోటు ధరించిన 66 సంవత్సరాల ఆర్థిక మంత్రి సభకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే వచ్చి ఆయన తన సీట్లో కూర్చున్నారు. ఆర్థిక మంత్రికి లోక్‌సభ సిబ్బంది ఒక లాపెల్ మైక్రోఫోన్ అందించారు.

నిలబడి.. కూర్చొని.. నిలబడి.. ప్రసంగం

ఆర్థిక మంత్రి మొదటగా 25 నిముషాల సేపు సభను ఉద్దేశించి నిలబడి మాట్లాడారు. ఆ తర్వాత తన స్థానంలో కూర్చొని సభకు ప్రసంగ పాఠం వినిపించారు. మరికొద్ది నిముషాల్లో ముగుస్తుందనగా జైట్లీ లేచినిలబడి ప్రసంగించారు. హిందీ, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ ఆయన ప్రసంగం సాగింది. ప్రసంగం ముగించిన వెంటనే ఆయన్ను ప్రధాని నరేంద్ర మోడీ పలకరించారు.

ఉల్లాసంగా అద్వానీ.. జైట్లీ పక్క సీటులో బాతాఖానీ

బీజేపీ సీనియర్ నేత ఎల్.కె. అద్వానీ మంచి హుషారుగా ఉన్నట్టు కనిపించారు. నేవీ బ్లూ రంగు సఫారీ అదే రంగు టోపీ ధరించిన అద్వానీ సభ ప్రారంభం కావడానికి ఐదు నిముషాల ముందు ప్రవేశించారు. అప్పటికే జైట్లీ తన సీట్లో కూర్చొని ఉన్నారు. అద్వానీ తన సీటు వైపునకు నడచి వెళుతుండగా జైట్లీ ఆయన్ను పలకరించారు. కానీ ఆర్థిక మంత్రిని గమనించని అద్వానీ బీజేపీ సీనియర్ ఎంపీ శాంతా కుమరంద్, కేంద్ర మంత్రి పొన్ రాధాకృష్ణన్ పలకరింపులకు స్పందించారు. జైట్లీ పక్క సీట్లోనే కూర్చున్న అద్వానీ ఆర్థిక మంత్రిని చూసి నవ్వారు. కాసేపు మాట్లాడారు. అదే సమయంలో జైట్లీ ఆయన చేతులను తడుముతూ కనిపించారు.

గట్టిగా బల్ల చరిచిన ప్రధాని

జైట్లీ ప్రసంగిస్తున్నంతసేపూ ప్రధాని తరచుగా బల్ల చరుస్తూ కనిపించారు. దాంతో ఆయన కేబినెట్ సహచరులు, ఎన్‌డీఏ ఎంపీలు మోడీ బాట పట్టారు. ప్రధాని ఆర్థిక మంత్రిని ప్రోత్సహిస్తూ వచ్చారు. ప్రధాని మంత్రి ఉజ్వల పథకం,10 కోట్ల మంది పేదలు, బడుగు, బలహీనవర్గాలకు వర్తించే జాతీయ ఆరోగ్య రక్షణ పథకం గురించి జైట్లీ మాట్లాడుతున్నప్పుడు ప్రధాని మరింత గట్టిగా బల్ల చరచడం కనిపించింది.

ఇది 2022 బడ్జెట్ ప్రసంగమా?

ఆర్థిక మంత్రి 2022 లక్ష్యంగా పూర్తిగా అమలు చేయాల్సిన పలు పథకాల గురించి అదే పనిగా ప్రసం గిస్తుండగా లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే అడ్డుకున్నారు. జైట్లీ చదువుతున్న బడ్జెట్ ప్రసంగం 2018-19 కోసమా లేక 2022 సంవత్సరానికా అని నిలదీశారు. విపక్షాల వ్యాఖ్యలకు చలించనట్టుగా జైట్లీ తన ప్రసంగ పాఠాన్ని చదువుకుంటూ పోయారు. ఆర్థిక మంత్రి మధ్యతరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు (ఎంఎస్ంఈలు) ఊరటను ప్రకటిస్తున్నప్పుడు ఆ రాయితీలు ఇచ్చేది కార్పొరేట్లకు మాత్రమే అని విపక్షాలు గగ్గోలు పెట్టాయి.

పలకరింపులు.. కరచాలనాలు

ఆర్థిక మంత్రి భార్య సంగీత, కుమారుడు రోహన్ స్పీకర్ గ్యాలరీ నుంచి బడ్జెట్ సమర్పణ కార్యక్రమాన్ని వీక్షించారు. బడ్జెట్ సమర్పించిన అనంతరం జైట్లీని పలకరించినవారిలో ఆయన కేబినెట్ సహచరులు సుష్మా స్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ ఉన్నారు. అయితే సస్పెండైన బీజేడీ నేత బై జయంత జె పాండే మినహా విపక్ష నేతలెవరూ ఆర్థికమంత్రిని పలకరించలేదు. పాండే ప్రధానమంత్రితో రెండు పర్యాయాలు కరచాలనం చేశారు.

రంగురంగుల తలపాగాలతో ఎంపీలు

పలువురు ఎంపీలు మరీ ముఖ్యంగా బీజేపీకి చెందినవారు రంగు రంగుల తలపాగాలతో కనిపించా రు. పట్టణాభివృద్ధి, హౌసింగ్ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి తన జాకెట్‌కు తగ్గట్టుగా మరువపు రంగు తలపాగా ధరించారు. ఎస్ఏడీ పార్టీకి చెందిన ప్రేమ్ సింగ్ చందుముజ్రా ఎప్పటిలాగానే కాషాయ తలపాగాతో రాగా, ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ భగవత్ మన్ పసుపు రంగు తలపాగాతో కనిపించారు.

రాహుల్ కబుర్లు.. సభ నుంచి రాకపోకలు


కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బడ్జెట్ ప్రసంగం జరుగుతున్నంత సేపూ జ్యోతిరాదిత్య సింధి యా, కమల్‌నాథ్‌లతో పిచ్చాపాటీగా మాట్లాడుతూ కనిపించారు. లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేపటికే సభలోకి అడుగుపెట్టారు. కాసేపటి తర్వా త వెలుపలకు వెళ్ళారు. మరికాసేపట్లో బడ్జెట్ ప్రసంగం ముగుస్తుందనగా తిరిగి సభలోకి ప్రవేశించారు. యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం.తంబిదురై, లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే, మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ, సమాజ్‌వాది పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్, బడ్జెట్ సమర్పణ కార్యక్రమానికి హాజరయ్యారు.



జైట్లీ సరికొత్త పదప్రయోగం

గ్రాండ్ ఫాదర్‌డ్

● దీర్ఘకాలిక మూలధనరాబడులపై 10 శాతం పన్ను ప్రతిపాదన ● మినహాయింపుపై ఆర్థిక మంత్రి వాక్చాతుర్యం



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో సర్వసాధారణంగా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కేవలం నిపుణులకు మాత్రమే అర్థమయ్యే పద ప్రయోగం ఉంటుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో చేసిన ఐదవ కేంద్ర బడ్జెట్ ఇందుకు మినహాయింపు కాదు. అయితే జైట్లీ తన ప్రసంగంలో అత్యంత ఆసక్తి కలిగించే గ్రాండ్‌ఫాదర్‌డ్ అనే పదప్రయోగం చేశారు. ఆయన పన్నుల విధానం గురించి మాట్లాడుతున్నప్పుడు దీర్ఘకాలిక మూల ధన రాబడులను పన్ను పరిధిలోకి తీసుకురావలసిన అవసరం ఉందని అన్నారు. ఒక లక్ష రూపాయలకు మించిన అలాంటి దీర్ఘకాలిక మూల ధన రాబడులను ఏదేనీ లాభదాయక సూచీలోకి అనుమతించకుండా వాటిపై 10 శాతం పన్ను విధింపును నేను ప్రతిపాదిస్తున్నాను. అయితే 2018, జనవరి 31వరకు అన్ని రాబడులు గ్రాండ్‌ఫాదర్‌డ్ అవుతాయి అని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

గ్రాండ్‌ఫాదర్‌డ్ అంటే?


వినడానికి ఇది ఒక మెరుగుపరిచిన పదంగా ఉన్నప్పటికీ వాస్తవానికి అది ఒక ఆర్థిక మూలసూత్రంగా పేరుగాంచిన గ్రాండ్‌ఫాదరింగ్ నుంచి ఉద్భవించింది. పాత నియమాలు, చట్టాలు, నియంత్రణలు ప్రస్తుత పరిస్థితులకు వర్తిస్తున్నప్పుడు మరియు భవిష్యత్తులో అన్ని పరిస్థితులకు వర్తించేలా ప్రస్తుతం ఒక కొత్త నియమం తీసుకువచ్చిన పరిస్థితిని వివరించడానికి దీనిని వినియోగిస్తారు. మినహాయింపు పొందిన ప్రజలు, సంస్థలు, పెట్టుబడులు, తదితరాలు గ్రాండ్‌ఫాదర్‌డ్ అవుతాయి లేదా పిత్రార్జిత హక్కులు లేదా సముపార్జించుకున్న హక్కులను పొందినట్టుగా చెపబడతాయి. ప్రస్తుత విషయానికి వస్తే జైట్లీ దీర్ఘకాలిక మూలధన రాబడులపై 10 శాతం పన్ను విధించారు.

అయితే ప్రస్తుతం పొందుతున్న రాబడులన్నీ 2018, జనవరి 31వరకు గ్రాండ్‌ఫాదర్‌డ్ అవుతాయి. దానర్థం కొత్త నియమం భవిష్యత్తులో దీర్ఘకాలిక మూలధన రాబడులపై పన్ను విధిస్తున్నప్పటికీ ఒక నిర్దేశిత తేదీకి ముందు చేసిన పెట్టుబడులపై ప్రస్తుత రాబడులు మినహాయింపు పొందుతాయి. అయితే చట్టంలో సవరణ ఆమోదం పొందిన అలాంటి రాబడులకు పన్ను వర్తిస్తుంది.



ఆయుష్మాన్ భవ

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం



రూ.1200 కోట్లు కేటాయింపు

50 కోట్ల మందికి లబ్ధి

- ఒబామా హెల్త్‌కేర్ తరహాలో మోడీకేర్
- ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల ఆరోగ్య బీమా
- క్షయ రోగులకు రూ.500 ఔషధ సాయం
- ప్రతి మూడు లోక్‌సభ స్థానాలకు ఒక మెడికల్ కళాశాల
- వైద్య, విద్య రంగాల బలోపేతానికి 1% సుంకం పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ ఆరోగ్యభారత మంత్రాన్ని పఠించింది. బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ఆరోగ్యభద్రతకు ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ నిధులతో 10 కోట్ల మందిభారతీయ కుటుంబాలు లబ్ది పొందేలా జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకానికి(నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్)కు శ్రీకారం చుట్టారు. దేశంలో పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఒక్కో కుటుంబం ఆరోగ్య పరిరక్షణకు ఏడాది రూ.5 లక్షలు మెడికల్ రీయింబర్స్ మెంట్ గా ప్రకటించారు. దాదాపు50 కోట్ల మంది ఈ పథకం ద్వారా లబ్ది పొందుతారని అంచనా. ఐదోసారి పార్లమెంట్ లో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ దేశవ్యాప్తంగా 24 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పాటు ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న ఆస్పత్రులను నవీకరణ చేయనున్న ట్లు స్పష్టం చేశారు. స్వచ్ఛ భారత్ (హెల్త్ ఇండియా) ద్వారానే సమృద్ధి భారత్ సాధ్యమౌతుందని జైట్లీ పునరుద్ఘాటించారు.ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం దేశ వ్యాప్తంగా 116 జిల్లాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆరోగ్య భారత్ లక్ష్యంగా దేశ పౌరులకు భద్రత కల్పిస్తామన్నారు. మేం ప్రతిష్టాత్మక జాతీయ ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభించబోతున్నాం. దీని ద్వారా పదికోట్ల పేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత లభిస్తుంది. (దాదాపు 50 కోట్ల మంది భారతీయులు దీని ద్వారా లబ్ధి పొందుతారు.) ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. 5లక్షల రూపాయలతో ఆరోగ్య భద్రత కల్పిస్తాం. అని జైట్లీ తన ప్రసంగంలో వెల్లడించారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ అత్యుత్తమ ఆరోగ్య భద్రతను కల్పించాలనే ఉద్దేశంతో జాతీయ ఆరోగ్య భద్రత కార్యక్రమానికి శ్రీకారం చుడుతోందని తెలిపారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఇలాంటి వాటిని అమలు చెసినట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రీయ స్వాస్థ్యా బీమా యోజన (ఆర్ఎస్‌బీవై) ద్వారా పేదల్లో ఒక్కో కుటుంబానికి కేవలం రూ.30 వేల రూపాయలు మాత్రమే కేటాయిస్తుండగా.. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్న లక్షలాది మంది పేదలు వైద్య సేవలకు డబ్బు లేక తమ ఆస్తు లు అమ్మివేయడమో.. చేయడమో చేస్తున్నారని పరిగణించిన ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించేసదుద్దేశంతో ఒక్కో కుటుం బానికిరూ. 5 లక్షలు కేటాయిం చామన్నారు.

న్యూ ఇండియాకు ఆయుష్ భారత్



ఆయుష్ భారత్ కార్యక్రమం లో భాగంగా జైట్లీ మరో రెండు ప్రధాన కార్యక్రమాలను ప్రకటించారు. రోగులు సంపూర్ణ ఆరోగ్య వంతులయ్యే వరకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, మొదటి, రెండో, మూడో తరగతి ఆరోగ్య సేవలు అందేలా ఆరోగ్య భద్రత కల్పిస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం సరికొత్త భారత్ నిర్మాణానికి నాంది పలుకుతుంద న్న జైట్లీ ..ఆరోగ్య సేవలు అందరికీ చేరువయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్ ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు.

- ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతానికి 1% సుంకం పెంపు



ఆరోగ్య, విద్యా రంగాన్ని మరింత తగా బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ రెండు రంగాల బలోపే తానికి ప్రస్తుతం విధిస్తున్న పన్నును ఒక శాతం పెంచుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి జైట్లీ ప్రకటించారు. ఆరోగ్య, విద్యసెస్ ను మూడు శాతం నుంచి నాలుగు శాతానికి పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. పేద, గ్రామీణ కుటుంబాల్లో ఆరోగ్య, విద్యా పరమైన సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు శాతం సెస్ ను విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విధిస్తున్న మూడు శాతం సెస్ లో రెండు శాతం ప్రాథమిక విద్యకు, ఒకశాతం మాధ్యమిక, ఉన్నత విద్యకు కేటాయిస్తున్నారు. పర్సనల్ ఇన్ కమ్ టాక్స్, కార్పోరేషన్ పన్నుల నుంచి ఈ సెస్ ను వసూలు చేస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి విద్య, ఆరోగ్య పరిరక్షణ కోసం పన్నును పెంచినట్లు జైట్లీ చెప్పుకొచ్చారు. సెస్ పెంపు ద్వారా అదనంగా రూ.11వేల కోట్లు పన్ను రూపంలో వసూలౌతుందని పేర్కొన్నారు.

విప్లవాత్మకమైన మార్పు

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ ఆరోగ్య భద్రత పథకం పేదలకు వరం లాంటిదని అపోలో హాస్పి టల్స్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి అన్నారు. 10 కోట్ల కుటుంబాల్లో ఏడాది రూ. 5 లక్షలతో ఆరోగ్య భద్రత కల్పిస్తూ కేంద్రం చేసిన ప్రకట న ఆహ్వానించదగిన పరిణామమని కొనియా డారు. ఆయుష్మాన్ భారత్ పథకానికి బడ్జెట్ లో రూ.1200 కోట్లు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆయుష్ రంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదన్న ఈ రంగంలో మరిన్ని పరిశ్రమలు అవసరమని గుర్తు చేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు వరం



క్షయ (టీబీ) వ్యాధితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. టీబీ బారిన పడి ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతుండటం.. వారిలో చాలా మంది పేదలే కావడంతో క్షయ రోగులు చికిత్స పొందినంత కాలం ప్రతీనెల రూ.500 లను అందిస్తామని ప్రకటించింది క్షయ వ్యాధిగ్ర స్తులకు మందులు, పౌష్టికాహారం అం దించేందుకు అదనంగా రూ. 600 కోట్లు కేటాయిం చినట్లు జైట్లీ స్పష్టం చేశారు.

జైట్లీ బడ్జెట్ ప్రసంగం తర్వాత కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ట్వీట్ చేస్తూ.. ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

బడ్జెట్ లో ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసి.. ప్రజలకు మెరుగైన వైద్యసే వలు అందేలా నిధులు కేటాయించడంతో పాటు ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్య తనివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

లక్ష వెల్‌నెస్ సెంటర్ల ఫ్రీ మెడిసిన్

మోడీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచితంగా మెడిసిన్ అందించాలని నిర్ణయించింది. అందుకోసం దేశవ్యాప్తంగా లక్షా 05వేల వెల్‌సెన్ సెంటర్లు ఏర్పాటు చేయటానికి నిర్ణయించింది. వీటి ద్వారా పేదలకు అవసరం అయిన మందులను ఉచితంగా అందిస్తారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించారు. ఆస్పత్రిపాలయ్యే వారికి ఆరోగ్య బీమా కల్పిస్తున్న సర్కార్.. ఉచితంగా మందులు కూడా అందించటానికి సంకల్పించింది.

మౌలిక అభివృద్ధికి రూ. 5,97 లక్షల కోట్లు

దేశ ఆర్థిక వృద్ధిలో కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5.97 లక్షల కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. గత ఆర్థిక ఏడాది కంటే లక్ష కోట్లమేర అధిక కేటాయింపులు జరిగినట్లు ఆయన వివరించారు. జీడీపీ పెరుగుదలకు కీలకమైన మౌలిక రంగ అభివృద్ధిపై ప్రధాని మోడీ ప్రత్యేకంగా దృష్టిసారించ డంతో ఆ మేరకు నిధుల కేటాయింపునకు ప్రాధాన్యత ఇచ్చినట్లు జైట్లీ పేర్కొన్నారు. ఇందులో రూ.5.35 లక్షల కోట్ల నిధులతో భారత్‌మాలా పథకం కింద 35 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు.

మహిళా సాధికారతకు ప్రోత్సాహం


- 8 కోట్ల మందికి ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు
- ముద్ర రుణాల్లో 75% మహిళలకే



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో భాగంగా ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మహిళలపై వరాల జల్లులు కురిపించారు. ఈ ఏడాది కొత్తగా 8 కోట్ల మంది పేద మహిళలకు ఉచితంగా ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జైట్లీ ప్రకటించారు. ఉజ్వల పథకం కింద 8 కోట్ల ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించనున్నట్లు ప్రకటించడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం కట్టుబడి ఉందనే సంకేతాలు ఇచ్చేందుకు గాను కొత్తగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఎన్నికలను పురస్కరించుకుని మహి ళలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ఈమేరకు వ్యవహరించి ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రావిడెంట్ ఫండ్ కాంట్రిబ్యూషన్‌పై మొదటి మూడు సంవత్సరాలకు 8 శాతం వడ్డీ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఎక్కువ మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. ఈపీఎఫ్, మిగెల్నెసియల్ ప్రావిజన్స్ యాక్ట్ 1952లో సవరణలు చేసింది. ముద్ర యోజన యోజన కింద చిన్న పరిశ్రమలకు రుణాలు ఇచ్చే యోచన. రుణాల్లో 75 శాతం మహిళలకు కేటాయిస్తున్నట్టు నిర్ణయించారు. 2005-06లో 24 శాతం ఉన్న మహిళల ఉపాధి 2015-16కు వచ్చే సరికి 36 శాతానికి పెరిగింది. నిరుపేద మహిళలకు కట్టెల పొయ్యి నుండి విముక్తి కల్పించడానికి గాను ఉజ్వల్ పథకాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ పథకం కింద వారికి గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నారు. 5 కోట్ల మందికి ఉచిత కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. కానీ దీన్ని 8 కోట్లకు పెంచుతూ నిర్ణయించినట్టు బడ్జెట్‌లో వివరించారు. స్వయం సహాయక గ్రూపులకు చేయూత అందించడానికి గాను, సేంద్రియ వ్యవసాయం చేపట్టడానికి ప్రోత్సాహం అందిస్తున్నది. దీనికి మార్చి 2019 వరకు రూ.75వేల కోట్లు కేటాయించింది. 2016-17లో స్వయం సహాయ సంఘాల రుణాలు రూ.42,500 కోట్లు ఉండగా, గతేడాది కంటే 37 శాతం పెరిగింది. మహిళలకు విద్య అందించే విషయమై తీసుకొచ్చిన బేటీ బచావో, బేటీ పఢావో పథకంతో ఎంతో అభివృద్ధి సాధించామని, అదేవిధంగా సుకన్య సమృద్ధి యోజన కూడా 2015, జనవరిలో తీసుకొచ్చినట్టు వివరించారు. నవంబర్ 2017 వరకు సుమారు 1.26 కోట్ల ఖాతాలు తెరిచినట్టు తెలిపారు. బాలికలకు రక్షణ కల్పించే విషయమై దీన్ని తీసుకొచ్చారు. దీనికి కూడా రూ.19,183 కోట్లు కేటాయించారు.

విద్యకు ఆధునికత

- విద్యకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులు
- మెరిట్ విద్యార్థులకు ప్రధాని ఫెలోషిప్
- కొత్తగా 24 మెడికల్ కాలేజీలు
- గిరిజన ప్రాంతాల్లో నవోదయ స్కూళ్ల ఏర్పాటు



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యంగా వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులను ప్రోత్సహించేలా కేటాయింపులు చేశారు. ఈ ఏడాది నుంచి ప్రధానమంత్రి ఫెలోషిప్ పథకం కింద దేశంలోని టాప్ 1000 బీటెక్ విద్యార్థులకు పెల్లోషిప్స్ అందించనున్నట్లు జైట్లీ ప్రకటించారు. వీరంతా ఐఐటీ, ఐఐఎస్‌సిలలో పీహెచ్‌డీ చేసేందుకు ఈ ఫెలోషిప్స్ ఉపయోగపడతాయన్నారు. వైద్యవిద్యకు ప్రోత్సాహమందించేలా దేశంలో 24 నూతన మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యకు చేయూత నివ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం 85 వేల 10 కోట్ల రూపాయలు కేటాయించినట్లు జైట్లీ స్పష్టం చేశారు. ఉన్నత విద్యకు 35వేల10 కోట్లు కేటాయించగా...50 వేల కోట్లను పాఠశాల విద్యకు కేటాయించారు. మనం పిల్లలను స్కూళ్లకు పంపుతున్నాం కానీ నాణ్యమైన విద్య అనేది ఇంకా అందటం లేదన్న ఆందోళన ఉంది. విద్యాబోధన నర్సరీ నుంచి ఇంటర్ వరకు చారిత్రకంగా సాగాయి అని జైట్లీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో పునరుత్తేజం కలిగించేలా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నా రు.2022 నాటికి ప్రతీ బ్లాక్‌లో 50 శాతం కంటే ఎక్కువ గిరిజన జనాభా ఉంటే అక్కడ ఒక నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. ఐఐటీల కింద రెండు పూర్తిస్థాయి ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాలయాలు,నిట్ కింద 18 ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాలయాలు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. వైద్యులు, రోగుల మధ్య ఉండే అంతరాన్ని తొలగించేందుకు దేశంలో24 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రస్తుతమున్న ఆస్పత్రులను అప్ గ్రేడ్ చేయడం ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. వర్గాలకు ఒక మెడికల్ కాలేజీ కొత్తగా ప్రతీ మూడు పార్లమెంట్ నియో జక వర్గాలకు కనీసం ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతీ రాష్ట్రంలో కనీసం ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. జాతీయ ఆరోగ్య విధానం 2017 ద్వారా ఆరోగ్య, వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేశామన్నారు. జాతీయ ఆరోగ్య విధానానికి రూ.1200 కోట్లు కేటాయించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్న జైట్లీ.. దీని ద్వారా లక్షా50వేల ఆరోగ్య, వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటై.. ప్రజల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పించగ లుగుతామన్నారు. ఇలాంటి సెంటర్ల నిర్వహణకు ప్రైవేట్ సంస్థల సహకారం, దాతృత్వ సంస్థల మమకారం అవసరమన్నారు.

లోక్‌పాల్ బడ్జెట్‌లో మార్పులేదు

న్యూఢిల్లీ: అవినీతి పరుల అంతం చూస్తూ.. అవినీతి రహిత భారతదేశం కోసం పోరాడుతున్న 'లోక్‌పాల్'కు మొండిచేయి మిగిలింది. గత బడ్జెట్‌లో కేటాయించిన 4.29 కోట్ల రూపాయలనే ఈసారి కూడా కేటాయించడం నిరాశ కలిగించే అంశమే. ప్రస్తుతం నల్లధనం, అవినీతి వంటి రుగ్మతలు దేశాన్ని మరింతగా పట్టి పీడిస్తున్నాయి. వీటిని అంతమొందించడానికి 'లోక్‌పాల్' వంటి వ్యవస్థలకు దన్నుగా నిలవాల్సిన కేంద్రం ఆ వ్యవస్థపై శీతకన్ను వేయడం ఆశ్చర్యంగా ఉంది. అయితే గుడ్డిలో మెల్లలా కేంద్ర విజిలెన్స్ కమీషన్‌కు మాత్రం గత బడ్జెట్‌లో కేటాయించిన 32.61 కోట్లకు అదనంగా 1.58 కోట్ల రూపాయలను కేటాయించారు

గుజరాత్‌లో ఐఎఫ్ఎస్‌సీ ఏర్పాటు

ఢిల్లీ : ఆర్థిక వ్యవస్థల ఏకీకృత నియంత్రణ కోసం గుజరాత్‌లో గిఫ్ట్ సిటీ (గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ టెక్‌సిటీ)లో ఐఎఫ్ఎస్‌సి(అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ)ని ఏర్పాటు చేయనున్నట్లు అరుణ్‌జైట్లీ ప్రకటించారు. సమగ్ర మరియు ఇంటిగ్రేటెడ్ రెగ్యులరేటరీ ఫ్రేమ్‌వర్క్ పూర్తిగా అభివృద్ధి చేయడానికి, ఇతర ఆర్థిక సంస్థలతో పోటీ పడటానికి దీని అవసరం ఇప్పుడు చాలా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఐఎఫ్ఎస్‌సీ కోసం గత కొద్ది సంవత్సరాలుగా పలురకాలుగా పన్నుల్లో ప్రోత్సాహకాలను కల్పించడం జరిగింది అని కూడా చెప్పారు.

రక్షణ రంగానికి 7.81% పెరిగిన నిధులు



ఓ వైపు పాకిస్థాన్, మరోవైపు చైనా ఇలా దేశ సరిహద్దుల్లో ఇరువైపులా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రక్షణ రంగానికి ఈసారి బడ్జెట్‌లో రూ.2,95,511 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.1,95,947.55 కోట్లు వేతనాలు, సాధారణ ఖర్చులు కాగా రక్షణ ఆధునీకరణ, ఆయుధాల కొనుగోలు కేటాయింపులు రూ.99,563.86 కోట్లు మాత్రమే. గత ఆర్థిక సంవత్సరం నిధులైన రూ.2,74,114 కోట్ల కంటే ప్రస్తుత రక్షణ బడ్జెట్ 7.81 శాతం అధికం. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సర జీడీపీతో పోల్చితే ఇది కేవలం 1.58 శాతం మాత్రమే. పాక్, చైనా సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు రక్షణ రంగ కేటాయింపులు జీడీపీతో పోల్చితే కనీసం 2.5 శాతమైన ఉండాలని రక్షణ రంగానికి చెందిన విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



- కార్లు, మోటార్ సైకిళ్ళు
- మొబైల్ ఫోన్లు/వెండి/ బంగారం
- సన్ స్క్రీన్/ పాదరక్షలు
- కూరగాయలు పండ్ల రసాలు
- సన్ గ్లాసెస్/సోయా ప్రోటీన్ కాని ఇతర ఆహార పదార్థాలు/పెర్ఫ్యూమ్స్ మరియు టాయిలెట్ వాటర్

రంగు రత్నాలు

- వజ్రాలు/ ఇమిటేషన్ జ్యెయల్లరీ
- స్మార్ట్ గడియారాలు / ధరించగలిగిన పరికరాలు
- ఎల్‌సీడీ/ఎల్ఈడీ టీవీ ప్యానెల్లు
- దంత ఉత్పత్తులు,/ సిల్క్ ఫ్యాబ్రిక్స్
- ఫర్నిచర్/ పరుపులు/ లాంప్స్

అన్ని రకాల గడియారాలు

- ట్రైసైకిల్, స్కూటర్లు, పెడల్ కార్లు, చక్రాల బొమ్మలు, బొమ్మల క్యారేజీలు, బొమ్మలు,
- వీడియో గేమ్ కన్సోల్లు
- స్పోర్ట్స్, అవుట్డోర్ క్రీడలు, స్విమ్మింగ్ సామగ్రి
- సిగరెట్, లైటర్లు, కొవ్వొత్తులు
- కైట్స్/ వంటనూనెలు: ఆలివ్‌నూనె, వేరుశనగ నూనె / ఇతర కూరగాయల నూనెలు


తగ్గే ఉత్పత్తులు/సేవల జాబితా

- జీడిపప్పు/ముడిపదార్థాలు, కాంక్లియర్ ఇంప్లాంట్స్ తయారీలో ఉపయోగించే భాగాలు, ఉపకరణాలు/ సోలార్ ప్యానెల్స్/ మాడ్యూల్స్ కోసం ఉపయో గించే సౌర స్వభావిత గాజు
- కొన్ని క్యాపిటల్‌గూడ్స్, ఎలక్ట్రానిక్ ఉత్పతులు,

పెరిగేవి, తగ్గే వస్తువల వివరాలు ఇవే

ధరలు పెరిగే వస్తువుల వివరాలు

మొబైల్స్, కార్లు, మోటార్ సైకిల్స్, వెండీ, బంగారం, వెజిటబుల్, పండ్ల రసాలు, నారింజ, సన్ గ్లాసెస్, సోయా ప్రోటీన్, ఫెర్ఫ్యూమ్ చెప్పులు వంటి దిగుమతి చేసుకున్న వస్తువుల ధరల పెరగనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్లో సూచించారు.



ధరలుతగ్గేవి

ముడి జీడిపప్పు, గాజు, ముడి పదార్థాలు, కోక్లియార్, టాయిలెట్ వాటర్, సన్ స్క్రీన్స్, టూత్ పేస్ట్, కండరాల ఫిక్సేటివ్ పాస్టేస్, ఫేస పౌడర్లు, షేవింగ్ క్రీమ్, సుగంధ ద్రవాయాలు, టాయిలెట్ స్ప్రేలు, ట్రక్కు.. బస్ రేడియల్ టైర్లు, సిల్క్ ఫ్యాబ్రిక్స్, రంగు రత్నాలు, వజ్రాలు ఉన్నాయి

బడ్జెట్ తీరుపై ఎవరేమన్నారంటే..



కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్రు. ఇది దేశంలోని పేద, మధ్య తరగతి ప్రలకు ఎంతో ఉపయోగకరం. అంతే కాకుండా బడ్జెట్‌లో ప్రకటించిన యూనివర్సల్ హెల్త్ స్కీమ్ దేశంలో 40 శాతం మంది ప్రజలకు ప్రయోజనకరంగా ఉంది. -నితీశ్‌గడ్కరీ



జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో రైతులు, వృద్ధులు, వ్యాపార వేత్తలు, పేదల సంస్కరణల గురించి ప్రస్తావించారు. కావున ఇది అర్థవంతమైన బడ్జెట్. ఈ బడ్జెట్ ఖచ్చితంగా నూతన ఇండియాను ఆవిష్కరిస్తుంది. - సురేష్‌ప్రభు



బడ్జెట్‌లో ఢిల్లీపై కేంద్రం సవతి తల్లిలా వ్యవహరిస్తోంది. జాతీ య రాజధాని కోసం ముఖ్యమైన మౌలిక సదుపాయలకు, ప్రాజె క్టులకు కొంత ఆర్థిక సాయం అందుతుం దేమోనని ఆశించాం. మొండిచేయిలభించిందని వాపోయారు. -ఢిల్లీసీఎం




విద్య, వైద్య వ్యవసాయానికి కేటాయింపులు బాగున్నాయి. జాతీయ ఆరోగ్య బీ మా పథకం వల్ల10 కోట్ల కుటుం బాల కు లబ్ధి చేకూరనుంది దీనిని అభినందిస్తున్నా. -నితీశ్‌కుమార్



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ఎలాంటి ప్రత్యేకత చూపలేదు. ఇది చాలా నిరాశగా ఉంది. రెవెన్యూ లోటు, అమరావతికి నిధులు వంటి అంశాల ప్రస్తావన లేకపోవడం విచారం కలిగించింది. పోలవరం ప్రాజెక్టు నిధుల సమీకరణ నాబార్డు ద్వారా ఏర్పాటు చేశారు... కానీ నిధుల ప్రవాహమేమీ చెప్పుకోదగిన రీతిలో లేదు. ఎక్కడెక్కడో మెట్రోలు ఇచ్చారు కానీ విజయవాడ, విశాఖపట్నం నగరాలకు మెట్రో ప్రస్తావన లేదు. -సుజనాచౌదరి



కేంద్ర ఆర్థిక మంత్రి లోక్‌సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావన, పునర్విభజన చట్టంలోని అంశాలను ప్రస్తావించకపోవడం అన్యాయం. ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఏమీలేదు. -సుబ్బరామిరెడ్డి



లోక్‌సభఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. జీఎస్‌టీ, నోట్ల రద్దు , గుజరాత్ ఫలితాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా అడుగులు వేసింది. -శివ సేన



ఈ బడ్జెట్‌లో రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలేవీ లేవు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల గురించి ప్రస్తావన లేదు. సెస్సుల పెంపుతో ప్రజలపై మరింత భారం మోపారు -సీతారాం ఏచూరి



బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా ఉంది. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ చెప్పిన అచ్చేదిన్ ఏమైంది? భాజపా నేతృత్వంలోని ఎన్‌డీయే హయాంలో మరింత పేదలుగా మారారు. నిరుద్యోగిత మరింత పెరిగింది. ధనికులు, పేదల మధ్య అగాధం ఏర్పడింది. -మాయావతి



నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఇంకా రైతులకు మద్దతు ధర హామీ ఇస్తున్నారు. నాలుగేళ్ళు గడిచిపోయాయి. బడ్జెట్‌లకు ఏ మాత్రం సరితూగని ఫ్యాన్సీ పథకాలు ప్రవేశపెట్టారు. నాలుగేళ్ళు గడిచిపోయాయి. మన యువతకు ఉద్యోగాల్లేవు. ఈ ప్రభుత్వానికి ఇక ఏడాది కాలం మాత్రమే మిగిలి ఉన్నందుకు ధన్యవాదాలు -రాహుల్



బడ్జెట్‌లో ఎగుమతులకు సంబంధించి ఎలాంటి చర్యలూ లేవు. దిగుమతులకు సంబంధించి కస్టమ్స్ సుంకాన్ని పెంచారు. దావోస్‌లో ప్రధాని ప్రసంగాన్ని కొన్ని రోజుల్లోనే విస్మరించారు. సగటు పన్ను చెల్లింపుదారుడికి ఊరట కలిగించలేదు.- చిదంబరం



రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు జాతీయస్థా యిలో ప్రసంశలు పొందినా కేంద్రప్రభుత్వం మాత్రం వీటిపట్ల బడ్జెట్లో చిన్నచూపే చూసింది. భూగర్భ జలాల పెంపుదలకు చేపట్టిన పథకాలపై కేంద్రం దృష్టి సారించదేలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.పదివేలకోట్లు ఇవ్వమ ని కోరినా పట్టించుకోలేదు. కేంద్రం నిధుల కేటాయింపుల్లో మాత్రం అసంతృప్తినే మిగిల్చింది. -ఆర్థికమంత్రి ఈటల




కేంద్ర బడ్జెట్ పేదల పక్షాన ఉండి ఉంటే బావుడేంది. గ్రామీణ ప్రజల అభివృద్ధికి బడ్జెట్ లో కేటాయింపులు లేవు. విద్య, ఆరోగ్యం పై దృష్టి పెట్టామని చెప్పినా పెద్దగా కేటాయిం పులు లేవు. ప్రత్యేక, పరోక్షపన్నుల విషయంలో మొదటి నుంచీ మోడీ వైఖరి విచిత్రంగా ఉంది. మహిళా సంక్షే మానికి బడ్జెట్ ప్రసంగంలో లేకపోవడం బాధాకరం.-ఎంపీకవిత



కేంద్ర బడ్జెట్‌లో పారదర్శకత లోపించింది. రాష్ట్ర ఆశలను కేంద్ర బడ్జెట్ వమ్ము చేసింది. కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి అదనంగా ఒరిగిందేమి లేదు. తెలంగాణలో అమలవుతున్న పలు ప థకాలకు కేంద్రం ఎటువంటి సాయం చేయలేదు. -జోగురామన్న



బడ్జెట్ కేటాయింపుల్లో తెలుగు రాష్ట్రాలకు మొండి చేయి చూపించడం బాధాకరం. తెలంగాణ రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఉనప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదు. కేంద్రం నుంచి బడ్జెట్ కేటా యింపులను రాబట్టడంలో తెరాస ఎంపీలు విఫలమయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేటాయించేవిధం గా ఎంపీలు ప్రయత్నం చేయలేదు. -ఎల్.రమణ



బడ్జెట్‌గ్రామీణ ప్రాంతరైతులకు మార్గనిర్దేశం చేసేదిగా ఉంది. గ్రామీణ వ్యవసాయ మార్కెటిం గ్ కోసం నిధులను కేటాయించింది.ఈ బడ్జెట్ ద్వారా కేంద్ర ప్రభు త్వం నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధిస్తుందన్న విశ్వాసం ఉంది. -ఇంద్రసేనారెడ్డి



కేంద్ర ఆర్థికశాఖ బడ్జెట్‌లో బీసీల గురించి మాట్లాడకుండా, వారికి కేటాయింపులు చేయ కుండా మరోసారి అన్యాయం చేసింది. -ఆర్ కృష్ణయ్య



అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యు లకు ఏ మాత్రం మేలు చేకూర్చేదిగా లేదు.సర్వే అంశాలను పరిశీలించిన తర్వాత వ్యవసాయం, విద్య, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తారని భావించాం. వ్యవ సాయ కేటాయింపులు క్లిష్టపరిస్ తులలో ఉన్న రైతాంగానికి ఏ మాత్రం ఉపయోగపడే విధంగా లేవు. -సురవరం



బడ్జెట్ 2018-19

విభజన కష్టనష్టాల గురించి
ప్రస్తావిస్తే బాగుండేది

• టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన బడ్జెట్‌లో విభజన కష్టనష్టాలతో ఏర్పడిన నూతనంగా ఏర్పడిన నవ్యాంధ్ర గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేదని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు వెల్లడించారు. యావత్ దేశ సంక్షేమానికై బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ ప్రతి రాష్ట్రం తమకు ఎంతమేర లాభం చేకూరుతుందనే ధోరణితో ఆలోచిస్తాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం, రెవిన్యూ లోటు, రైల్వే జోన్ తదితర అంశాల గురించైనా ప్రస్తావించి ఉంటే ప్రజలకు కొంత సంతృప్తి ఉండేదన్నారు. పాత ప్రాజెక్టులతో పాటు కొత్త ప్రాజెక్టులకు కొంత ప్రాధాన్యత ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్ ద్వారా చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు.

ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం బాధాకరం : డొక్కా మాణిక్య వరప్రసాద్



2018-19 ఏడాదికి గాను మోడీ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన బడ్జెట్‌లో కొత్తగా ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం బాధాకరమని మాజీ మంత్రి, మండలి ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలియజేశారు. దళిత సంక్షేమానికి రూ.56 వేల కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.39 వేల కోట్లను కేటాయించడంతోపాటు దేశ వ్యాప్తంగా 50 కోట్ల మంది ప్రజలకు లబ్ది చేకూర్చేలా భారీ హెల్త్ స్కీంకు కేంద్రం శ్రీకారం చుట్టడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. బడ్జెట్‌లో కేటాయింపులతో పాటు వాటిని జాగ్రతగా వినియోగించినపుడే అభివృద్ధి ఫలాలు పేద వారికి అందుతాయన్నారు. తాజా బడ్జెట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేకపోవడం కొంత అసంతృప్తికి గురి చేసిందని తెలిపారు.

విభజన హామీలపై స్పష్టత మరోసారి కొరవడింది : గొట్టిపాటి రామకృష్ణ



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు ఆశించినంత మేర నిధులు కేటాయించలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. వెనుకబడి, నష్టపోయి, అన్యాయానికి గురైన రాష్ట్రానికి మరింత సహాయం చేయాల్సి వుందని, సీఎం చంద్రబాబు కష్టానికి తగినంత నిధులు కేటాయించలేదని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం, అమరావతి రాజధాని గురించి ప్రస్తావించకపోవటం నిరాశపర్చిందన్నారు. విభజన హామీలపై స్పష్టత మరోసారి కొరవడిందని, యూనివర్శిటీలకు అరకొర నిధులు ఇచ్చారన్నారు. బడ్జెట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు వేగానికి, ఆలోచనకు తగినంత ప్రోత్సాహం ఉన్నట్లు ప్రజలు భావించటంలేదన్నారు.

బడ్జెట్‌లో ఏపీపై దృష్టి పెట్టలేదు : పంచుమర్తి అనురాధ



బడ్జెట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ మీద దృష్టిపెట్టలేదని, మూడేళ్ల బిడ్డగా ఉన్న రాష్ట్రంపై కేర్ తీసుకోలేదని రాష్ట్ర టీడీపీ మహిళా కార్పొరేషన్ చైర్మన్ పంచుమర్తి అనురాధ అన్నారు. చట్టంలో ఉన్నవాటినే మర్చిపోవటం కరెక్టు కాదన్నారు. అదేవిధంగా విభజన చట్టంలోని ఇచ్చిన హామీల అమలుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం టైం బాండ్ విధించకపోవటం వలనే ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు.

బడ్జెట్ నిరాశాజనకం : లంకా దినకర్



కేంద్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి అరకొర నిధుల కేటాయింపే తప్ప లోటు బడ్జెట్, పోలవరం ఏవిధంగా పూర్తిచేస్తారో, రైల్వే జోన్, రైల్వే ప్రాజెక్టులు, మెట్రో రైలు గురించి ప్రస్తావించలేదన్నారు.

ఏపీకి నష్టం జరగలేదు

• బీజేపీ ఎంపీ హరిబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: బీజేపీ ఎంపీ హరి బాబు మాత్రం ఏపీకి నష్టం జరగ లేదని అన్నారు. విభజన చట్టంలోని పేర్కొన్న ఐదు సంస్థలు రావాల్సి ఉందని, సెంట్రల్,గిరిజన యూనివర్శిటీలకు నిధులు కేటాయించారని అన్నారు. విభజన చట్టంలో రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపైనే జైట్లీ ప్రస్తావించారని అన్నారు. అధికారుల నివేదికతో సంబంధంలేకుండా రైల్వేజోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తామని అన్నారు.

గాంధీ కలలను సాకారం చేస్తున్న మోడీ : బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ



తాజా బడ్జెట్ కేటాయింపుల్లో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ సాకారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత కన్నా లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. అలాగే రైతులకు ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టి బీజేపీ రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి రుజువు చేసుకొందన్నారు. ఏపీకి ఎలాంటి సహాయ, సహకారాలను అందించాలో నీతి ఆయోగ్ ఇది వరకే చెప్పిందని, దాని సూచనల మేరకు ప్రతి అంశంలో ఏపీకి సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

విభజన హామీలన్నీ నెరవేరుస్తాం : ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ లక్ష్మీపతి



కొత్తగా ఏర్పడిన నవ్యాంధ్ర ప్రదేశ్ అంటే ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక అభిమానమని, విభజన చట్టాన్ని అనుసరించి ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందని బీజేపీ సీనియర్ నేత, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ లక్ష్మీపతి తెలియజేశారు. గురువారం బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో వైద్య రంగాభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం సంతోషకరమన్నారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

• పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు. ఇది పూర్తిగా ఓట్ల గారడి బడ్జెట్. రాష్ట్ర పునవ్యవస్థీకరణ చట్టంలోని చట్టబద్ధమైన హామీలకు కేటాయింపులు లేకుండా చేశారు. రాజధానికి నిధులు, రెవిన్యూలోటు భర్తీకి నిధులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, విశాఖ రైల్వే జోన్ హామీలను విస్మరించి, ఏపీ ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని ఆయన విమర్శించారు.

ఏపీకి మోడీ సర్కార్ మొండిచేయి : పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి కొలనుకొండ

మోడీ సర్కారు ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి మొండిచేయి చూపిందని, బడ్జెట్‌లో విభజన చట్టం, హామీల అమలు, ఆర్థికసాయం ఊసెత్తక పోవడం దారుణమని, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ కేంద్రప్రభుత్వంపై ధ్వజమెత్తారు. దీనిని రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, రాష్ట్రంపై వివక్షకు నిరసనగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్‌డిఏ సర్కార్ నుండి ఇద్దరు మంత్రులను ఉపసంహరించాలని శివాజీ డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం రాష్ట్ర ప్రజలంతా ఏకమై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన వ్యాఖ్యానించారు.

హామీలు విస్మరించారు: సుబ్బిరామిరెడ్డి

బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావన, పునర్విభజన చట్టంలోని అంశాలను ప్రస్తావించకపోవటం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.సుబ్బిరామి రెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ గురించి ప్రత్యేకించి, చెప్పుకోవడానికి ఏమి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏపీకి కేంద్రం తీరని అన్యాయం

• మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు



విశాఖపట్నం , ప్రభన్యూస్ బ్యూరో: కేంద్ర బడ్జెట్‌లో మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కళ్లు తెరిచి విభజన హామీలపై పోరాటం సాగించాల్సిన సమయం నెలకొందన్నారు. గురువారం మాజీ మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించి కొత్తగా ఎటువంటి కేటాయింపులు చేయకపోగా కనీసం పాత ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. గతంలో కేటాయించిన ప్రాజెక్టులకు ఒక్క రూపాయి నిధులు విడుదల చేయకపోవడం చూస్తుంటే ఏపిపై కేంద్రప్రభుత్వం ఏ రీతిన వివక్షచూపిస్తుందన్నది అర్థమవుతుందన్నారు. ప్రత్యేకహోదా, విశాఖకు రైల్వేజోన్, మెట్రో ప్రాజెక్టులకు నిదులు ఇలా ఏ ఒక్క ప్రాజెక్టును కేంద్రం పట్టించుకోలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనన్నారు. పార్లమెంట్ సభ్యులు, మంత్రులుతో కాకుండా ఈ విషయంలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అంకెల గారడీ... రైతుకు ఉపయోగం లేదు

• ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

అమరావతి, ఆంధ్రప్రభ: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అంకెల గారడీని తలపిస్తున్నదే తప్ప రైతుకు ఉపయోగకరంగా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదే విధంగా విభజన హామీలకు కూడా నిధులు కేటాయించకపోవడం దుర దృష్టకరమన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు అప్పుల నుండి బయటపడి స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే దిశగా లేదన్నారు. మౌలిక సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్ ఏమాత్రం ఉపయోగపడదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కౌలు రైతుల రక్షణకు నిధుల కేటాయింపులేకపోగా చట్టం తెచ్చే ప్రస్తావన కూడా చెయ్యకపోవడం దురదృష్టకరం అన్నారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు పెంచే ఆలోచన చెయ్యకపోగా ఖరీఫ్ పంటకు కేవలం 1.5 రెట్లు పెంచుతామంటూ చేసే ప్రకటనలు స్పష్టంగా లేవని, ప్రభుత్వం నుండి ఏ మాత్రం గ్యారంటీ లేదని ఆయన అభిప్రాయ పడ్డారు.

వ్యాపార, పారిశ్రామికవర్గాలకు నిరాశ : చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వక్కలగడ్డ

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 కేంద్ర బడ్జెట్ వ్యాపార, వర్తక, వాణిజ్య, పారిశ్రామికవర్గాలను నిరాశకు గురి చేసిందని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు పేర్కొన్నారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితి పెంచకపోవడం సరికాదన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహం, ఖాయిలా పరిశ్రమల పునరుజ్జీవనానికి చర్యలు లేకపోవడం విచారకరమన్నారు. ప్రత్యేక హోదా లేనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, వ్యాపారం, వాణిజ్యం అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. చిన్న, మధ్య, తరహా పరిశ్రమలకు మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉద్యోగులకు, కార్మికులకు మొండిచేయి

• సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగరావు

అమరావతి, ఆంధ్రప్రభ: మోడీ ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ కార్మికులకు, ఉద్యోగులకు మొండి చేయి చూపిందని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష సి.హెచ్ నర్సింగరావు అన్నారు. గత 7,8 సంవత్సరానల నుండి కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నప్పటికి వారి కోర్కెల పరిష్కారానికి బడ్జెట్ ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదన్నారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితి పెంచలేదని, అదే సమయంలో 250 కోట్ల రూపాయల లోపుటర్నోవర్ ఉన్న కార్పొరేట్ కంపెనీలకు ఆదాయ పన్ను 30 నుండి 25 శాతానికి తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇపిఎస్ పెన్షనర్ల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోలేదని, వారి కనీస పెన్షన్ పెంచేందుకు అవసరమైన కేటాయింపులు చేయలేదు, ఒక్కో పేద కుటుంబానికి రూ5 లక్షల రూపాయల ఆరోగ్య భీమా కలిపిస్తామని బడ్జెట్ ప్రకటించారు కానీ రాష్ట్రీయ బీమా పథకంలో నేషనల్ హెల్త్ మిషన్ కి తగిన కేటాయింపులు ఎక్కడ చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు బడ్జెట్ మరలా మొండి చేయి చూపిందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ మీద పన్నులు తగ్గించలేదన్నారు. ఇది కార్పొరేట్ బడ్జెట్ అని ఉద్యోగులకు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

కార్మిక సంక్షేమం పట్టించుకోని కేంద్ర బడ్జెట్

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు

కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమత్రం కార్మిక సంక్షేమాన్ని పట్టించుకోలేదని, దేశంలో నూతన ఉద్యోగాల కల్పనకు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఎటువంటి ప్రతిపాధనలు చేయలేదని ఎఐటియు సి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెఁకట రామారావు మండిపడ్డారు. గత మూడు సంవ త్సరాలుగా అన్ని కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ వారి డిమాండ్స్ పట్ల ఆర్థిక మంత్రి స్పందించక పోవడం విచారకరమన్నారు. మూతపడిన పరిశ్రమలు తెరిపించేందుకు ఎటువంటి హామీలు ఇవ్వలేదన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు అన్యాయం : వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేత విశ్వనాథ్

కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం జరిగిందని వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో చేనేతకు కేవలం రూ.396 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని ఆయన ధ్వజమెత్తారు. దేశ వారసత్వ సంపదైన చేనేతకు ఈ బడ్జెట్‌లో న్యాయం జరుగుతుం దని చేనేత కార్మికులు ఆశగా ఎదురు చూశారని, కానీ వారి ఆశలపై కేంద్రం నీళ్లు జల్లిందని ఆయన పేర్కొన్నారు. త్వరలో ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ అకౌంట్‌లో చేనేతకు కేంద్రం సరిపడ నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా చేనేతకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి కేటాయింపులు పెంచడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సామాన్యుల బడ్జెట్ కాదిది కార్పొరేట్ల బడ్జెట్
సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఏ మాత్రం మేలు చేకూర్చేదిగా లేదని, కార్పొరేట్లకు ప్రాధాన్యమిచ్చేదిగా ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో70 లక్షల ఉద్యోగావకాశాలను కల్పిస్తామని బడ్జెట్‌లో పేర్కొనడం ఒకపెద్ద జోక్ అని అన్నారు. రైల్వేకు కేటాయించిన నిధులు కూడా సామాన్యుడిపై భారం పడే విధంగా ఉన్నాయని, ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే సామాన్యుడికి అచ్చే దిన్ ఎక్కడ అనేది ప్రశ్నార్థకంగా ఉందన్నారు.

రాష్ట్రానికి తీవ్ర నిరాశ

• వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు

అమరావతి,ఆంధ్రప్రభ: మోడీ ప్రభుత్వం ప్రకటించిన తాజా బడ్జెట్‌లో ఒక్క శాతం కూడా లబ్దిలేక రాష్ట్రానికి తీవ్ర నిరాశ మిగిలిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు వెల్లడించారు. . ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదాసీన వైఖరితో ఇలాంటి దుస్థితి రాష్ట్రానికి ఏర్పడిందని, కీలకమైన రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రెవిన్యూ లోటు అంశాల ఊసే లేకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ప్రకటించిన బడ్జెట్ బీజేపీ ప్రభుత్వానికి చివరిదని, కనీసం ఈ బడ్జెట్‌లో అయినా న్యాయం చేస్తారా అని ఎదురు చూసిన ఆంధ్ర ప్రజానికానికి గత బడ్జెట్లలో వలే బీజేపీ పాలకులు మొండి చెయ్యి చూపారని తెలిపారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్

• సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పేదల కోసం మాటలు. పెద్దల కోసం మూటలు. కార్పొరేట్ కంపెనీలకు పన్నులు తగ్గించి, ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించలేదు. ఏపీకి, తెలంగాణాకు కేంద్రం నామాలు పెట్టింది. ఈ బడ్జెట్ పేదలకు, రైతులకు, విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదు. పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్. బడ్జెట్ లో ఉన్న అంశాలు వాస్తవ రూపంలోకి రావడం లేదు. కేంద్రం ఏపీకి అడుగడుగునా అన్యాయం చేస్తోంది. చట్టంలోని అంశాలను అమలు చేయడం లేదు.

రాష్ట్ర వ్యాప్త నిరసనలకు
సీపీఐ పిలుపు

అమరావతి,ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్ ఏపీ విభజన హామీల అమలుకు నిధులు కేటాయించకుండా రాష్ట్రా నికి జరిగిన అన్యాయంపై భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలున, దిష్టిబొమ్మ దగ్ధం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 1,2 తేదీలలో సిపిఐ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టడం సంతోషం

• జయప్రకాశ్ నారాయణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 2018-2019 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ లక్ష్యాలను సాధించే విధానాలు, చిత్తశుద్ధి, కేటాయింపులు మాం కొరవడ్డాయని వ్యాఖ్యానించారు. దాదాపు 10 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆరోగ్య బీమా కవరేజీ సాహోసపేతమైన పెద్ద అడుగని, కానీ ప్రాథమిక వైద్యం, ఫ్యామిలి డాక్టర్ ఏర్పాటు లేకుండా అమెరికా నమూనాలో తృతీయ స్థాయి వైద్యం, బీమా మీద దృష్టిపెట్టడం వల్ల ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు పెద్దగా మెరుగపడవన్నారు.

మార్చి 31 నాటికి
ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ- ఆఫీస్

• ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మార్చి 31 నాటికి ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేస్తామని, దీనికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ వెల్లడించారు. ఈమేరకు గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సత్యనారాయణతో కలిసి ఇంటిగ్రేషన్ ఆఫ్ ఎస్ఏపీతో ఈ-ఆఫీస్, ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ అటెండెన్స్ అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలను మార్చి 31 నాటికి పేపర్‌లెస్‌గా తీర్చిదిద్దుతామన్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు సత్వరమే పరిష్కారం అవ్వడమే కాకుండా ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందన్నారు. ఈ-ఆఫీస్ విధానంతో ఉద్యోగుల్లో జావాబుదారీతనం పెంపొందుతుందని చెప్పారు. అన్ని శాఖల్లో పనిచేసే ఉద్యో గుల సమగ్ర వివరాలను హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు ఇంటిగ్రేట్ చేస్తారన్నారు. ఐటీ సలహాదారు సత్యనారాయణ మాట్లాడుతూ, . శాఖల కోడింగ్ ప్రక్రియ వారంరోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ప్రభుత్వ కార్యాలయా లు ఉన్నాయని, ప్రతి కార్యాలయానికి ఒక కోడ్ ఇస్తారని స్పష్టంచేశారు.

ఏపీలో కరవు నివారణ ప్రాజెక్టు అమలు

• మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: కరవు ప్రాంత రైతులను ఆదుకునే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కరువు నివారణ ప్రాజెక్టును అమలు పరుస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలియజేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ డ్రాఫ్ మిటిగేషన్ ప్రాజెక్ట్ క్రింద విజయవాడలో ఏర్పాటు చేసిన సదస్సులో ఈ ప్రాజెక్టు వలన కరువు నుండి పంటలను రక్షించడానికి అనుకూలమైన నీటి పారుల పద్ధతులు, మెరుగైన భూసారపరీక్షలకు దోహదపడతాయన్నారు. ఈ ప్రాజెక్టుకు ఐసియా టోర్ పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

• మెడికల్ హబ్‌గా అమరావతి • గ్రామీణ పేదల కోసమే ఈ- ఐ కేంద్రాలు • మాతా, శిశు మరణాలను అరికడతాం • ఈ- ఐ కేంద్రాల ప్రారంభోత్సవంలో సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని స్పష్టం చేశారు. అంతేకాకుండా అమరావతిని మెడికల్ హబ్‌గా రూపొందించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా 14 వైద్య కళాశాలలు, మరో 14 వైద్య సంస్థలు రానున్నాయని వెల్లడించారు. భవిష్యత్తులో వైద్యం కోసం విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చే పరిస్థితి ఉండాలే కానీ ఇక్కడి నుంచి వేరే చోటకు వెళ్లే పరిస్థితి ఉండకూడదన్నారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 115 ఈ-ఐ (టెలీ అప్తామాలజీ) కేంద్రాలను ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిత్తూరు, తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని సెంటర్లలోని డాక్టర్లతో మాట్లాడారు. అనంతరం ఎంఎంఆర్, ఐఎంఆర్‌లపై యూనిసెఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సమక్షంలో ఎంవోయు చేసుకుంది. అదే విధంగా మాతృత్వ మరణాల తగ్గింపుకు సంబంధించి రూపొందించిన ట్యూటోరియల్ అప్లికేషన్ (యాప్)ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కంటి వైద్య కేంద్రాల ఏర్పాటు ద్వారా దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.దేశంలో తొలిసారి ఈ తరహా పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్న ఉద్దేశ్యంతోనే ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏఎన్ఎం, అంగన్‌వాడి, డాక్టర్లు అందుబాటులో ఉన్నప్పటికి ఇలాంటి పరిణామాలు జరగడం బాధాకరమన్నారు. ఏజెన్సీలోని ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా 4 పడకలు ఏర్పాటు చేసి తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు వైద్యం అందిస్తామన్నారు. అదే విధంగా కామెర్లు సోకిన వారికి కూడా తగిన చికిత్స లభిస్తుందని తెలిపారు. మాతృత్వ మరణాలను తగ్గించేందుకు తల్లి సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఎక్కడైతే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయో అక్కడున్న వైద్యులకు, ఏఎన్ఎంలకు నిపుణులు శిక్షణ తరగతులు ఆన్‌లైన్‌లో తీసుకుంటారని, త్వరలోనే రాష్ట్రంలో ఉన్న ప్రతి వ్యక్తికి డిజిటల్ లాకర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇంట్లో కూర్చునే నచ్చిన డాక్టర్‌తో నాణ్యమైన వైద్యం ఆన్‌లైన్‌లో పొందే విధంగా చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో పద్దతి ప్రకారం ఆసుపత్రులను అభివృద్ధి చేశానని ఇప్పుడు కూడా అదే తరహాలో పనిచేస్తున్నామన్నారు.

ఆశ దురాశైతే జైలుకే..

ప్రతి వ్యక్తికి ఆశ ఉండడం సహజమేనని అయితే ఇది దురాశగా మారకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఇలా దురాశకు పోయిన వారంతా ప్రతి శుక్రవారం కోర్టుకు ఆ తరువాత జైలుకు వెళ్ళాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి పరోక్షంగా వ్యాఖ్యనించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న ఆరుగురికి ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్స్ పాటిస్తున్న విజయనగరం, రాజమండ్రి, అనకాపల్లి జిల్లా ఆసుపత్రలకు ఒంగోలు ఎమ్‌సీహెచ్‌ల సూపరింటెండెంట్ సర్టిఫికెట్లను ముఖ్యమంత్రి బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, యూనిసెఫ్ భారత ప్రతినిధి మీటల్ రూజ్‌డియా, అపోలో టెలీ అప్తామాలజీ సీఈవో విక్రమ్ టాక్‌లూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై దాడులు కొనసాగుతాయి

• విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ అనురాధ




విశాఖ క్రైం, ప్రభన్యూస్: ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై వరుస దాడులు కొనసాగుతాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఎ.ఆర్.అనురాధ హెచ్చరించారు. అలాంటి వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. వారిపై కేసులు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్-7లో గల వుడా షాపింగ్ కాంప్లెక్స్‌లో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ నిఘా-అమలు విభాగం నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వలు చేస్తున్న వారిపై ఇటీవల వరుస దాడులు చేయడం జరిగిందని చెప్పారు. రేషన్ డిపోల్లో కూడా ఈ దాడులు నిర్వహించామని వెల్లడించారు. అటు ప్రజలను మోసం చేస్తూ ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిని వదలబోమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఐజి శ్రీకాంత్, నగర పోలీస్ కమిషనర్ టి.యోగానంద్, జీవీఎంసీ కమిషనర్‌హరినారాయణన్, విజిలెన్స్ ఎస్పి కోటేశ్వరరావు, జాయింట్ కమిషనర్లు రవికుమార్‌మూర్తి, నాగేంద్రకుమార్, డీసీపీ ఫకీరప్ప, జిల్లా ఎస్పి రాహుల్‌దేవ్ శర్మ , జిల్లా విజిలెన్స్ ఎస్పి బాలకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ సి.ఎం.నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

2016 గ్రూప్-1 అభ్యర్థులకు
ఇంటర్వ్యూ తేదీలు ఖరారు

అమరావతి, ఆంధ్రప్రభ : నోటిఫికేషన్ నెంబర్ 36 / 2016, తేదీ 30-12-2016 కు సంబంధించిన గ్రూప్ -1 సర్వీస్ పోస్టులకు గతంలో అభ్యర్థులకు నిర్వహించిన రాత పరీక్షల్లో ప్రాధమికంగా 78 పోస్టులకు గాను 151 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థులకు మార్చి 12 నుంచి మార్చి 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపింది. ఆయా తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నది. విజయవాడ బందర్‌రోడ్డులోని కమిషన్ కార్యాలయంలో అభ్యర్థులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపికైనా అభ్యర్థులందరికీ అతి త్వరలోనే వ్యక్తిగతంగా ఇంటర్వ్యూల సమాచారాన్ని పంపిస్తామని కమిషన్ కార్యదర్శి సాయి తెలిపారు.

క్రీడా బడ్జెట్‌కు రూ.2,196.36 కోట్లు



● సాయ్‌కు రూ. 66 కోట్ల కోత ● 2018-19 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ: క్రీడా మంత్రిత్వ శాఖకు 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)తో పోలిస్తే రూ.258.2 కోట్లను అధికంగా కేటాయించారు. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ మేరకు ప్రకటన చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.2,196.36 కోట్లను క్రీడా మంత్రిత్వ శాఖకు కేటాయించినట్లు మంత్రి సభలో తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపులు రూ.1938.16 కోట్లు. అయితే ఈ సారీ గుర్తించవలసిన అంశమేమిటంటే.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు(సాయ్) కేటాయింపులు తగ్గించారు.2017-18 ఆర్థిక సంవత్సరంలో సాయ్‌కు రూ.495.73 కోట్లు ఇవ్వగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు రూ.66.17 కోట్లు కోతపెట్టి రూ.429.56 కోట్లకే పరిమితం చేశారు. కాగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఖేలో ఇండియా ప్రాజెక్టుకు ఈ సారీ బడ్జెట్‌ను పెంచారు. గతంలో రూ.350 కోట్లు కేటాయించగా ఈ సారీ దాన్ని రూ.520.09 కోట్లకు పెంచారు. నిజానికి మొత్తం స్పోర్ట్స్ బడ్జెట్‌లో ఖేలో ఇండియా కేటాయింపులు 23.67 శాతం వాటాను కలిగివుంది.

జాతీయ క్రీడల అభివృద్ధి కార్యక్రమంలో ఖేలో ఇండియా ఒక విభాగం ఈ మొత్తం కార్యక్రమానికి రూ.1262.79 కోట్లు చేరుకున్నాయి. 2017-18 లో ఈ మొత్తం రూ.1047.19కోట్లుగా ఉంది.

ఎన్ఎస్ఎఫ్‌లకు కేటాయింపులు పెంపు

జమ్ము,కశ్మీర్‌లో క్రీడా వసతుల కల్పనకు ఈ సారీ కేటాయింపును రూ.50 కోట్లకు కుదించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.75 కోట్లుగా ఉంది. త్వరలో జరుగనున్న కామన్వెల్త్, ఆసియన్ క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న అథ్లెట్లకు బడ్జెట్ కేటాయింపులు ప్రకటించలేదు. అయితే పలు జాతీయ స్పోర్ట్స్ సమాఖ్యలకు(ఎన్ఎస్ఎఫ్) కేటాయింపులను సుమారుగా రూ.40కోట్లను పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఎఫ్‌లు రూ.302.18 కోట్లు కేటాయించగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.342 కోట్లకు పెంచారు. జాతీయ క్రీడల అభివృద్ధి నిధులు(ఎన్ఎస్‌డీఎఫ్)కు కేటాయింపుల్లో 2017-18 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తాన్ని 2018-19లో కూడా తేడాలేకుండా రూ.2 కోట్లు కేటాయించారు.వరల్డ్ ఆంటీ డోపింగ్ ఏజెన్సీ(డబ్ల్యుఏడీఏ) కు కోటి రూపాయలు కేటాయించారు. క్రీడాకారులిచ్చే ప్రోత్సాహక మొత్తం రూ. 23 కోట్లకు పెంచారు. 2017-18లో ఇది రూ.18.13 కోట్లుగా ఉంది. క్రీడల్లో మానవ వనరుల అభివృద్ధికి కొత పడింది. 2017-18లో రూ.10 కోట్లు కేటాయించగా, ఈ సారీ రూ. 5కోట్లకు ఆర్థిక మంత్రి జైట్లీ తగ్గించారు.

క్రీడాప్రభ

కొత్త నమూనా సీసాల్లో లోపాలున్నాయి: వాడా

● పాత పరీక్షపద్ధతే బెస్ట్



మాంట్రియాల్: దక్షిణా కొరియాలో జరుగునున్న శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో నిషిద్ధ ఉత్ప్రేరకాల వాడకాన్ని గుర్తించేందుకు పాత పరీక్ష విధానమే అనుసరించాలని వరల్డ్ ఆంటీ డోపింగ్ ఏజెన్సీ(డబ్ల్యుఏడీఏ) గురువారం స్పష్టం చేసింది. క్రీడాకారులపై జరిపే కొత్త విధానం పరీక్షల్లో వాడే డ్రగ్ కిట్లు టాంపరింగ్‌కు (చేతితో మూతలను తెరిచేందుకు)అనువుగా ఉన్నాయని అనుమానాలు వ్యక్తం కావడంతో ఏజెన్సీ పాత పరీక్షా విధానంవైపే మొగ్గు తున్నట్లు తెలిపింది. 'కొత్త జనరేషన్ బెరెగ్-కిట్ జెనీవా సెక్యూరిటీ బాటిల్స్ టాంపరింగ్ చేయడానికి అనువుగా ఉన్నాయని వాటిని ఫ్రీజింగ్‌లో ఉంచినప్పుడు.. గడ్డకట్టిన స్థితిలో కూడా బాటిళ్లను తెరువవచ్చని మేము నిర్ధారణకు వచ్చాము' అని వాడా ప్రకటించింది. ఫిబ్రవరి 9న శీతాకాల ఒలింపిక్స్ క్రీడలు ప్రారంభ కానున్న నేపథ్యంలో జర్మనీలోని కొలొగ్నెలోని లాబోరేటరీ ఈ కొత్త బాటిళ్ల పరీక్ష విధానం టాంపరింగ్‌కు అనువుగా ఉందని నివేదిక ఇవ్వడంతో ఒలింపిక్ కమిటీ ఈ విధానాన్ని పరిశీలించాలని వాడాను కోరింది. ఈ నేపథ్యంలో 2016 రియో డి జెనీరో ఒలింపిక్స్ క్రీడలకు విడుదల చేసిన పాత బెరెగ్-కిట్ 2016ను ఉపయోగించాలని సిఫారసు చేసింది. 'ప్యోంగ్‌చాంగ్‌లో డోపింగ్ పరీక్షల నిర్వహణకు పాత విధానం ఉపయోగిసున్నాము. ఇందుకు అవసరమైన కిట్లు మా వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఈ విధానంను అమలుచేయాలని ఐవోసికి మేము సిఫారసు చేస్తున్నాము. పాత పరీక్షపద్ధతిని ఇప్పటికి ప్రపంచంలో అనేక టెస్టింగ్ అథారిటీలు నిర్వహిస్తున్నాయి' అని వాడా డైరెక్టర్ అలివిర్ నిగ్గి అన్నారు. వాడా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన అనుబంధ లాబోరేటరీలకు ఆంటీ డోపింగ్ ఏజెన్సీలకు ప్రస్తుత పరిస్థితిని వివరించిందని అవి పాత పరీక్ష పద్ధతినే కొనసాగించాలని సూచించిందని నిగ్గి తెలిపారు. పాత పరీక్ష విధానంలో ఉపయోగించే సీసాలను ఉత్పత్తిచేసే స్విస్ తయారీ సంస్థ బెర్లింగర్ ఇకముందుకూడా వాటి ఉత్పత్తిని కొనసాగిస్తుందని ఆయన చెప్పారు.

ఐసీసీ అండర్-19లో పాక్‌కు 3స్థానం

క్వీన్స్‌టౌన్: ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్‌లో రెండు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన పాకిస్తాన్ మూడో స్థానంలో నిలిచింది. గురువారం మూడు, నాలుగో స్థానంకోసం పాక్ - ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దుకావటంతో పాక్ మూడో స్థానం పొందిందని అంపైర్లు ప్రకటించారు. నాలుగో స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ నిలిచింది. గ్రూప్ డి లో భాగంగా ఉన్న ఈ రెండు జట్లు ప్రారంభ మ్యాచుల్లో అఫ్ఘనిస్తాన్, పాక్‌ను ఓడించి గ్రూప్‌లో అగ్ర భాగాన నిలుచుంది. అయితే చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఐర్లండ్ చేతిలో ఓటమిచెందింది. ఐసీసీ అండర్-19 చరిత్రలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఇదే ఉత్తమ ప్రదర్శన. 2010లో 16వ స్థానం, 2012లో 10వ స్థానం, 2014లో ఏడవ స్థానం, 2016లో తొమ్మిదవ స్థానం పొందింది. కాగా పాకిస్తాన్ 2000, 2010 సంవత్సరాల్లో మూడుస్థానం పొందింది. 2012లో పాక్ ఎనిమిదవ స్థానం పొందింది. 2004, 2006లో ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సారీ టోర్నీలో మూడో స్థానంలో నిలవడం తమకు సంతృప్తిగా ఉందని.. అయితే మేము ఫైనల్లో ఉండాలని ఆశించామని పాకిస్తాన్ అండర్-19 టీం కెప్టెన్ మన్సూర్ రాణా అన్నాడు. కాగా శనివారం ఐసీసీ అండర్-19 ఫైనల్లో ఆస్ట్రేలియా, భారత్ తలపడనున్నాయి.

28 రష్యన్ అథ్లెట్లపై నిషేధం తొలగింపు



లుసాన్నె: సోచీ శీతాకాల ఒలింపిక్స్ -2014లో డోపింగ్ పరీక్షల్లో పట్టుబడ్డ 28 మంది రష్యన్ క్రీడాకారులపై విధించిన జీవిత కాల నిషేధాన్ని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) ఎత్తివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. సోచీ ఒలింపిక్స్ క్రీడల్లో మొత్తం 43 మంది రష్యన్ క్రీడాకారులపై డోపింగ్ ఆరోపణలు రాగా వారిలో 28 మంది జీవిత కాల నిషేధానికి గురయ్యారు. దీనితో వీరిలో కొంతమందికి దక్షిణా కొరియా శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనడానికి అవకాశమేర్పడింది. ఆంటీ డోపింగ్ పరీక్ష నిబంధనలు ఉల్లంఘించారని ఈ 28 మంది క్రీడాకారులపై మోపిన ఆభియోగాలను నిరూపించేందుకు ప్రతివాదులు సమర్పించిన సాక్ష్యాలు సరిపోలేదని కోర్టు పేర్కొంది. ఈ కేసులో ప్రతీ ఒక్కరికి వ్యతిరేకంగా ఐవోసి సమర్పించిన రుజువులు అన్నీ కేసుల్లో ఒకే రకంగాలేదని కాస్ వ్యాఖ్యానించింది. కాగా కోర్టు తీర్పుతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆనందం వ్యక్తం చేశాడని అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి మీడియాకు తెలిపారు. ప్యాంగ్‌చాంగ్ శీతాకాల ఒలింపిక్స్ పోటీల్లో రష్యా పాల్గొనకుండా ఐవోసి నిషేధం విధించడంతో రష్యాకు చెందిన 169 మంది అథ్లెట్లు తటస్థ హోదాతో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. నిషేధం తొలగించిన ఈ 28 మంది క్రీడాకారులతో సహా మరో 11 మంది రష్యన్ అథ్లెట్లపై నిషేధాన్ని కూడా ఎత్తేసినట్లు కోర్టు తెలుపింది. అయితే ఈ 11మందిని ప్యాంగ్‌చాంగ్ ఒలింపిక్స్ క్రీడలకు అనర్హులుగా ప్రకటించింది.

విరాట్ వీరంగం



● తొలి వన్డేలో భారత్ ఘన విజయం ● 6 వికెట్ల తేడాతో సఫారీలు చిత్తు ● డుప్లెసిస్ పోరాటం వృథా ● మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ విరాట్ కోహ్లీ

డర్బన్: స్థానిక కింగ్స్‌మీడ్ మైదానంలో భారత్, దక్షిణాఫ్రికాల మధ్య జరిగిన తొలి వన్డేలో భారత్ 6వికెట్ల తేడాతో సఫారీలను మట్టి కరిపించింది. కోహ్లీ సెంచరీ, రహానే సుదీర్ఘ భాగస్వామ్యం భారత్‌కు విజయాన్ని సంపాదించి పెట్టింది. డర్బన్ కింగ్‌స్టన్ మైదానంలో భారత్‌కిది తొలి విజయం. దక్షిణాఫ్రికా గడ్డపై సుదీర్ఘ లక్ష్యాన్ని ఛేదించడం ఇది ఐదోసారి. 1997లో జింబాంబ్వేపై 241 పరుగులను, 2003లో కెన్యాపై226 పరుగులను, అదే సంవత్సరంలోనే పాక్‌పై274 పరుగులను, 2011లో దక్షిణాఫ్రికాపై 221 పరుగులను చేజ్ చేస్తూ భారత్ గెలిచింది. ఉదయం టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెస్సిస్ బ్యాటింగ్‌ను ఎంచుకున్నాడు. ఓపెనర్లు ఆమ్లా, డికాక్‌లు భారత బౌలింగ్ ద్వయం భువనేశ్వర్, బుమ్రాలను దీటుగానే ఎదుర్కొన్నారు. తొలి ఐదు ఓవర్లు ముగిసేసరికి సఫారీలు వికెట్ నష్టపోకుండా 18 పరుగులు చేసింది. బూమ్రా వేసిన ఎనిమిదో ఓవర్లో మూడో బంతికి ఆమ్లా 16(17) ఎల్బీడబ్ల్యుగా వెనుతిరిగాడు. బ్యాటింగ్ వచ్చిన కెప్టెన్ డు ప్లెస్సిస్ భారత బౌలింగ్‌ను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా ఫోర్లు బాదుతూ స్కోరును ఉరకలెత్తించాడు. ఈ దశలో సఫారీలను నిలువరించడానికి కెప్టెన్ కోహ్లీ, 10వ ఓవర్లో హార్దిక్ పాండ్యాను, అనంతర ఓవర్లో స్పిన్నర్ యజువేంద్ర చాహల్‌ను బౌలింగ్‌కు దించాడు. ఈ వ్యూహం ఫలించింది. చాహల్ వేసిన 15వ ఓవర్ చివరి బంతికి డికాక్ ఎల్బీడబ్ల్యుగా34(49) ఔటయ్యాడు. డికాక్ స్థానంలో మోర్కెల్ సఫారీల కెప్టెన్ ప్లెస్సిస్‌కు జతకలిశాడు. డ్రింక్స్ అనంతరం కోహ్లీ చైనామ్యాన్‌గా పేరుపొందిన కులదీప్ యాదవ్‌ను బౌలింగ్‌కు దించాడు. చాహల్, యాదవ్‌లు వేసిన ఐదు ఓవర్లలో సఫారీలు సింగిల్స్‌కే పరిమితమ య్యారు. సఫారీలు 20.1 ఓవర్లలో 100 పరుగులు దాటారు. అదే ఓవర్లో చాహల్ వేసిన బంతిని ఆడబోయి మోర్కెల్ 9(21) పాండ్యాకు క్యాచ్ ఇచ్చి మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్ కు వచ్చిన డుమ్ని ఎక్కువసేపు ఆడలేకపోయాడు. కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో డుమ్ని 12(18) పరుగులవద్ద క్లీన్ బౌల్డ్ అయ్యాడు. బ్యాటింగ్‌కు వచ్చిన మిల్లర్ 7పరుగులు చేసి యాదవ్ బౌలింగ్‌లో కోహ్లీకు క్యాచిచ్చి ఔటయ్యాడు. మరోపక్క సఫారీల కెప్టెన్ తన అర్ధసెంచరీని పూర్తిచేసుకొని క్రీజులో కొనసాగుతున్నాడు. 30 ఓవర్లు ముగిసేసరికి సఫారీల స్కోరు ఐదు వికెట్లకు 141 పరుగులు. మిల్లర్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మోరిస్, డు ప్లెస్సిస్‌లు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 40 ఓవర్లు ముగిసేసరికి 200 పరుగుల మార్కుకు చేర్చారు. కాగా 47వ ఓవర్లో ప్లెస్సిస్ తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ చివర్ ఓవర్‌లో భువనేశ్వర్ వేసిన ఫుల్‌టాస్‌ను గాల్లోకి లేపిన ప్లెస్సిస్ లాంగ్ ఆఫ్‌లో పాండ్యాకు క్యాచిచ్చి ఔటయ్యాడు. ప్లెస్సిస్ 112 బంతుల్లో 120 పరుగులు చేసి తన జట్టుకు పటిష్ఠమైన పునాదిని వేశాడు. రబాడా బ్యాటింగ్‌కు వచ్చి ఒక పరుగుచేసి రనౌట్ అయ్యాడు. మొత్తం 50 ఓవర్లు ముగిసే సరికి దక్షిణాఫ్రికా 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. భారత బౌలర్లలో చాహల్ రెండు వికెట్లు, యాదవ్ మూడు వికెట్లు, భువనేశ్వర్,బుమ్రా చెరో వికెట్‌ను తీశారు. లక్ష్య ఛేదనను ప్రారంభించిన భారత్ ఓపెనర్లు శర్మ, ధావన్‌లు 5 ఓవర్లు ముగిసేసరికి భారత్ వికెట్ నష్టపోకుండా 26 పరుగులు జోడించారు. అయితే 7వ ఓవర్లో మోర్కెల్ బౌలింగ్‌లో రోహిత్20(30) డికాక్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కోహ్లీ సఫారీల బౌలింగ్‌ను ఎదుర్కొంటూ 12 ఓవర్లు ముగిసే సరికి భారత్ స్కోరును 66కు చేర్చారు. ధావన్ అనుకోకుండా రనౌట్ అయ్యాడు. మోరిస్ వేసిన బంతి ధావన్ ప్యాడ్లకు తగలడంతో ఎల్బీడబ్ల్యు అప్పీల్ చేశాడు. ధావన్ బంతి ఎక్కడుందో చూసేలోపలా అవతలిపక్కన ఉన్న కోహ్లీ సగం క్రీజులోకి వచ్చేశాడు. ధావన్ ముందుకు పరుగెత్తి తన వికెట్‌ను సమర్పించుకున్నాడు. ధావన్ ఔట్ తర్వాత అజింక్యా రహానే కెప్టెన్‌తో జత కలిసి స్కోరును నెమ్మదిగా ముందుకు కదిలిస్తూ సాగారు. కోహ్లీ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ తన అర్ధసెంచరీని 56 బంతుల్లో పూర్చిచేస కున్నాడు. మరోపక్క రహానే కూడా సమయోచితంగా ఆడుతూ భారత్ స్కోరును 30 ఓవర్లు ముగిసేసరికి రెండు వికెట్ల నష్టానికి 161 పరుగులు సాధించింది. కాగా 41 ఓవర్లో కోహ్లీ తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. గత నాలుగు వన్డేల్లో కోహ్లీకిది వరుసగా మూడో సెంచరీ. భారత గెలుపులో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడి ఇటీవల తన విమర్శకుల నోళ్లు మూయించాడు. 41 ఓవర్లు ముగిసే సరికి భారత్ అదనపు వికెట్లు నష్టపోకుండా 248 పరుగులు చేసింది. అయితే 43వ ఓవర్లో పెహ్లుక్‌వాయో వేసిన బంతిని ఆడుతూ రహానే తాహిర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. జట్టులోకి వచ్చిన రహానే 86 బంతుల్లో 76 పరుగు లుచేసి భారత విజయంలో తనవంతు పాత్రను పోషించాడు. రహానే స్థానంలో బ్యాటింగ్ వచ్చిన పాండ్యా, కోహ్లీతో కలిసి భారత్ సాధించాల్సిన మిగతా పరుగులను పూర్తిచేశారు. కాగా 45వ ఓవర్లో పెహ్లుక్‌వాయో వేసిన బంతిని ఆడబోయి కోహ్లీ రబాడాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 45 ఓవర్లు పూర్తయ్యే సరికి భారత్ స్కోరు నాల్గు వికెట్ల నష్టానికి 265 పరుగులు. ఇంకా నాలుగు ఓవర్ల మూడు బంతులు మిగిలివుండగానే భారత్‌కు గెలవడానికి అవసరమైన పరుగులను ధోని, పాండ్యాలు సాధించిపెట్టారు. ఈ గెలుపుతో ఆరు మ్యాచుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది. అద్భుతమైన సెంచరీతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ప్రకటించారు.

దక్షిణాఫ్రికా బ్యాటింగ్: క్వింటొన్ డి కాక్(వికెట్ కీపర్) ఎల్బీడబ్ల్యు (బి) చాహల్ 34, హషీం ఆమ్లా ఎల్బీడబ్ల్యు బుమ్రా 16, డు ప్లెస్సిస్ (సి) పాండ్యా (బి) భువనేశ్వర్ 120,ఏడెన్ మర్క్రమ్ (సి) పాండ్యా (బి) చాహల్ 9, జెపి డుమిని (బి)యాదవ్ 12, మిల్లర్ (సి) కోహ్లీ (బి) యాదవ్ 7, క్రిస్ మోరిస్ (బి)యాదవ్ 37, ఆండిలె పెహ్లుక్‌వాయో నాటౌట్ 27, రబాడా రనౌట్(ధోనీ/భువనేశ్వర్)1,మోర్నె మోర్కెల్ నాటౌట్ 0. ఎక్స్ట్రాలు: 6,(మొత్తం 50 ఓవర్లలో 269/8), **వికెట్ల పతనం:**30-1, 83-2,103-3,122-4, 134-5, 208-6, 264-7, 268-8, **బౌలింగ్:**భువనేశ్వర్ కుమార్ 10-1-71-1, జస్‌ప్రీత్ బుమ్రా 10-0-56-1, హార్దిక్ పాండ్యా 7-0-41-0, యజువేంద్ర చాహల్ 10-0-45-2, కులదీప్ యాదవ్, 10-0-34-3, కేదార్ జాదవ్ 3-0-19-0

భారత్ బ్యాటింగ్: రోహిత్ శర్మ (సి)డికాక్ (బి) మోర్కెల్20, శిఖర్ ధావన్ రనౌట్(మర్క్రమ్)35, విరాట్ కోహ్లీ(కెప్టెన్)112, ఆజింక్యా రహానే79, హార్దిక్ పాండ్యా నాటౌట్ 3, ఎంఎస్ ధోనీ నాటౌట్ 4 ఎక్స్ట్రాలు 17, (మొత్తం 45.3 ఓవర్లలో 270) **బౌలింగ్:** మోర్కెల్ 7-0-35-1, రబాడా9.3-0-48-0, మోరిస్ 7-0-52-0, ఇమ్రాన్ తాహిర్ 10-0-51-0, పెహ్లుక్‌వాయో 8-0-42-0, జెపి డుమిని 2-0-16-0, మర్క్రమ్ 2-0-20-0, **వికెట్ల పతనం:** 33-1,67-2, 256-3, 264-4,

ఇండియా ఓపెన్ బాక్సింగ్ మేరీకోమ్‌కు స్వర్ణం



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో మేరీకోమ్ స్వర్ణాన్ని గెలుపొందగా, భారత పురుష బాక్సర్లు పోటీని నివ్వలేక చతికిల పడ్డారు. బాక్సింగ్‌కు మారుపేరైన క్యూబా, ఉజ్బెకిస్తాన్ బాక్సర్లతో జరిగిన ఫైనల్లో గురువారం మేరీకోమ్ ఫిలిప్పీన్స్‌కు చెందిన జోసే గబుకోపై 4-1 తేడాతో గెలిచి 48కేజీల విభాగంలో తనకు తిరుగులేదనిపించింది. 64 కేజీల విభాగంలో అసోం బాక్సర్ విలావ్ బాసుమాతరీ థాయ్‌లాండ్‌కు చెందిన సుడాపోర్న్ 3-2తేడాతో గెలుపొంది స్వర్ణ పతకంను కైవసం చేసుకుంది. బాసుమాతరీ ఆసియన్ క్రీడల్లో కాంస్యపతకంను గెలుపొందింది. 2015 సెర్బియా జాతీయ కప్‌లో స్వర్ణ పతకంను గెలుచుకుంది. 69 కేజీల విభాగంలో మరొక అసోం బాక్సర్ లవ్‌లీనా బోర్గోహైన్ స్వర్ణ పతకంను గెలువగా, 60 కేజీల విభాగంలో ఎల్ సరిత దేవీ రజత పతకంను గెలుచుకున్నారు. పురుషుల్లో 91 కేజీ విభాగంలో భారత్‌కు చెందిన సంజీత్ ఉజ్బెకిస్తాన్ సంజార్ తురుసునోవ్‌ను మట్టికరిపించి స్వర్ణంను గెలుచుకున్నాడు. కాగా 60 కేజీల విభాగంలో జాతీయ ఛాంపియన్ మనీష్ కౌషిక్ నిన్నటి ఊపును కొనసాగించలేకపోయాడు. మంగోలియన్ బాక్సర్ బాటుమర్ మిష్ల్ట్ తో పోరాడుతూ గాయపడి మధ్యలోనే వైదొలగాడు.

91 కేజీల విభాగంలో ఆసియన్ కాంస్య పతక విజేత సతీష్‌కుమార్ రజతంతో సంతృప్తి పడ్డాడు.69 కేజీల విభాగంలో దినేష్ డాగర్ కూడా రజతం గెలుచుకున్నాడు. సతీష్, దినేష్‌లు ఇద్దరు ఉజ్బెక్ బాక్సర్ల చేతిలో ఓటమి పాలయ్యారు. 81 కేజీల విభాగంలో దేవాంశు జైస్వాల్, క్యూబా బాక్సర్ డేవిడ్ గుటేర్రజ్‌తో గట్టిగా పోరాడినప్పటికి ఫలితం లేకపోయింది. 75 కేజీల విభాగంలో ప్రపంచ రజత పతక విజేత స్వీటీ బూరా కేమరూన్ ఎస్సానే క్లొటిల్డాతో కలసి రెండో స్థానంలో నిలిచింది.

నాజర్ బాధితుల సంఖ్య 265 కంటే ఎక్కువ

● అమెరికా జిమ్నాస్టిక్స్ బోర్డు రాజీనామా



చార్లొట్టీ(యూఎస్): అమెరికాలోని జిమ్నాస్టిక్స్ వైద్యుడు లారీ నాజర్(54ఏళ్లు) చేతిలో లైంగిక వేధింపులకు గురైన వారి సంఖ్య 265 మందికి పెరిగింది. గురువారం ఈ మేరకు మిచిగాన్ న్యాయస్థానం దోషికి శిక్షను ఖరారు చేస్తూ తీర్పును వెలువరించింది. మేము ఇప్పటి వరకు 265 మంది బాధితు లను గుర్తించాము. బాధితుల సంఖ్య అపరిమితంగా ఉండవచ్చు అని జడ్జి జెనైస్ కన్నింగ్‌హాం అన్నారు. ఇంతకు ముందు ప్రకటించిన శిక్షలకు అధనంగా నిందితుడికి 25 నుంచి 40 ఏళ్లు శిక్ష విధిస్తామని జడ్జి ప్రకటించారు. రోజురోజుకు నాజర్ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో అమెరికా జిమ్నాస్టిక్స్ బోర్డులో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి.తీవ్ర ఒత్తిళ్లలో అమెరికా జిమ్నాస్టిక్స్ బోర్డు విభాగం గురువారం విధులనుంచి వైదొలగింది. మిచిగాన్ యూనివర్సిటీ క్లినిక్‌లో వైద్యుడు నాజర్ తన వద్దకు వచ్చిన బాలికలు, యువతులను లైంగికంగా వేధించాడు. గత వారం కోర్టు ఈయనకు 40 నుంచి 175 సంవత్సరాల వరకు జైలు శిక్షను విధించింది. చైల్డ్ ఫోర్నోగ్రఫీకు పాల్పడ్డ అంశంలో విధించిన 60 ఏళ్ల శిక్షకు ఇది అధనం. ఈ మూడు శిక్షకు సంబంధించిన తీర్పులు వెలువడ్డ అనంతరం కొన్ని రోజులుగా కనీసం 65 నాజర్ బాధితులు తాము ఎదుర్కొన్న వేధింపులను బహిర్గత పర్చారు. రెండు దశాబ్దాలుగా నాజర్ తన పేషెంట్లపై వైద్యం పేరిట ఈ అఘాయిత్యాలకు పాల్పడ్డాడు. కాగా విచారణ సందర్భంగా 150మందికి పైగా బాలికలు, యువతులు తమకు జరిగిన అన్యాయంపై గళమెత్తటంతో అమెరికా క్రీడాచరిత్రలో సంచలనాలు చోటుచేసుకున్నాయి. అనేక మంది అధికారులు పదవులకు రాజీనామాలు చేయటం తొలగింపుకు గురికావడం జరిగింది. కోర్టులో చివరి వాదనలు కొనసాగుతున్న సమయంలో తనను నాజర్ లైంగికంగా వేధించాడని అమెరికా ప్రముఖ జిమ్నాస్టిక్ సిమోనీ బైల్స్ ఫిర్యాదు చేసినా అమెరికా ఒలింపిక్ కమిటీ పట్టించుకోలేదని విమర్శించింది. అనంతరం ఆమెతోపాటు పలువురు బాధితులు జిమ్నాసిస్టులు నాజర్‌కు వ్యతిరేకంగా ముందుకు వచ్చారు.



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ లైట్ హెవీ వెయిట్ (81కేజీలు)విభాగంలో బంగారు పతకం సాధించిన డేవిడ్ గుటైర్జ్ ఓస్వేరీ (ఎడమ నుంచి రెండు), వెండిపతకం సాధించిన దేవాన్ష్ జైశ్వల్(ఎడమ), కాంస్య పతకం సాధించిన జొస్ఫ్ కొండిక్ మరియు షబ్బాస్ నెగ్మతుల్లేవ్.



న్యూఢిల్లీ: ఇక్కడ జరిగిన ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో (69 కేజీల) విభాగంలో బంగారు పతకం సాధించిన బోబో ఉస్మాన్ బాటురోవ్, వెండి పతకం సాధించిన దినేష్ దాగర్, కాంస్య పతకం సాధించిన మనోజ్‌కుమార్, దుర్యోధన్ సింగ్ నేగి.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ఆంధ్రప్రభ
లైఫ్
శుక్రవారం 2 ఫిబ్రవరి 2018
lifepage2012@gmail.com
I



సాహో...సాధికార మహిళ





- ★ ఆర్థిక స్వేచ్ఛతో దేశ ముఖచిత్రాన్ని మారుస్తున్న మహిళకు తోడుగా..
- ★ సొంత ఉపాధికి బాటలు వేసుకుంటున్న స్త్రీకి బాసటగా..
- ★ నైపుణ్యాలతో ఉద్యోగినిగా రాణిస్తున్న తరుణికి ఊతంగా..
- ★ వంటింటి పొగకు పొగబెట్టేలా నిరుపేద గృహిణికి ఎల్‌పిజి చేయూతగా..

ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు....అనేది ఇప్పుడు పాతబడిన నినాదం...ఇల్లాలి సంపాదన కుటుంబానికే కాదు...దేశానికీ దన్ను...అనేది నేటి స్లోగన్. మహిళ సంపాదనా పరురాలయితే...ఆమె సంపాదించే ప్రతి రూపాయి కుటుంబానికే ఖర్చవుతుంది. మన రూపాయి విలువని ఇతర దేశాల కరెన్సీతో పోల్చడం విషయాన్ని పక్కనపెడితే...సంపాదించే వ్యక్తిని బట్టి..ఖర్చయ్యే విధానాన్ని బట్టి రూపాయికి ఉన్న విలువ రూపాంతరం చెందుతుంది. అలా చూసినప్పుడు ఆడవాళ్లు సంపాదించే ప్రతిరూపాయి...కుటుంబ జీవన ప్రమాణ స్థాయిని పెంచుతుంది. ప్రపంచపటంలో దేశ ముఖచిత్రాన్ని మారుస్తుంది. అరుణ్ జైట్లీ నూతన బడ్జెట్ ఈ విషయాలను విస్మరించలేదు. అందుకే మహిళను సాధికారత వైపు మరో అడుగు వేయించే ప్రయత్నం చేశారు. బడ్జెట్ లో కుటుంబ ఆరోగ్యాన్ని పట్టించుకున్నట్టే... మహిళలకు పెద్దపీట వేసి...కుటుంబ ఆనందానికి కూడా స్వాగతం పలికారు...ఆ విశేషాలు-

నిర్భయం ఏమైంది?



కేంద్రమంత్రి అరుణ్ జైట్లి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు పైకి బాగానే కనిపిస్తున్నాయని, లోతుగా వెళ్తే మాత్రం దానివల్ల మహిళలకు జరిగే మేలు ఏమీ ఉండదని సామాజిక కార్యకర్త దేవి అభిప్రాయ పడ్డారు. ముద్ర బ్యాంకు నిధులు, సంక్షేమం గురించి మాట్లాడుతున్నారు సరే..ఉమెన్ ఎంప్లాయ్ మెంట్ మాటేంటని ఆమె ప్రశ్నించారు. అంతెందుకు నిర్భయకు నిధులు ఎందుకు కేటాయించలేదన్నారు. దీనిని బట్టే మహిళలపట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందన్నారు. గతంలో పోల్చితే 19.7 శాతం ఉద్యోగావకాశాలు తగ్గాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత కల్పించలేని, కాగితాలకే పరిమితం అయ్యే... కేటాయింపుల వల్ల ఒరిగేది శూన్యమన్నారు. ముద్రా యోజనకు 3లక్షలు కేటాయించారని గొప్పగా చెప్పుకోవడం కాదు ..అక్కడ మహిళలకు ఇచ్చే రుణాలు 17,000 రూపాయలేనని ..ఆ మొత్తం కూరగాయల కొట్టుపెట్టుకోవడానికి కూడా సరిపోదన్నారు. రైతులకు రుణాలు అంటున్నారు. మహిళా రైతుల గురించి ఎందుకు ప్రస్థావించలేదని దేవి ప్రశ్నించారు. చెప్పుకోవడానికి, మభ్యపెట్టడానికి తప్ప, మహిళలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. మహిళా రైతు ఆత్మహత్యల పెరిగిపోతున్నాయన్న విషయం కేంద్రానికి గుర్తుకురాలేదా ?..అని ఆవేదన వ్యక్తం చేశారు.

-దేవి, సామాజిక కార్యకర్త

బడ్జెట్‌లో మహిళల కోసం జరిగిన కేటాయింపులను చూస్తే...అన్ని రంగాల్లో ఉన్న స్త్రీలను దృష్టిలో ఉంచుకున్నారని అనిపిస్తుంది. అటు నిరుపేదల నుండి ఇటు స్వయం సహాయక సంఘాలు, ఉద్యోగినుల వరకు అందరి ప్రస్తావన ఉంది. ఏ రకంగా చూసినా ఈ బడ్జెట్‌లో మహిళల ప్రాధాన్యతపై దృష్టి పెట్టినట్టుగానే భావించాలి.

అతివ ఆరోగ్యం పొగచూరకుండా... గ్యాస్ కనెక్షన్ల పెంపు

భారతదేశంలో ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్ల వినియోగదారుల సంఖ్యని బట్టి చూస్తే...ఇది అభివృద్ధి విషయంలో పరుగులు పెడుతున్న దేశంలాగే అనిపిస్తుంది. కానీ ప్రజా సంక్షేమం అంటే స్మార్ట్ ఫోన్ల లెక్క కాదని...రుజువు చేసేలా...దేశంలో పదికోట్ల కుటుంబాలకు ఎల్‌పిజి గ్యాస్ అందటం లేదు. 24 కోట్లకు పైగా కుటుంబాలు ఉన్న ఈ దేశంలో ఇంకా పదికోట్ల కుటుంబాల్లోని మహిళలు కట్టెలు బొగ్గు లాంటి ఇంధనాలతోనే వంట చేస్తున్నారు. ఎన్ని రంగాల్లో ఎన్ని మార్పులు వస్తున్నా...వారి మసిబారిన జీవితాలు మారుతున్నది లేదు. కట్టెల పొయ్యి వంట కారణంగా దేశంలో మహిళలు పిల్లలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. శుద్ధి చేయని ఇంధనం నుండి వచ్చే పొగని పీల్చడం అనేది..ఒక గంటలో 400 సిగరెట్లను పీల్చడంతో సమానం. ఈ బాధలనుండి మహిళలను తప్పించడానికే 2016 మే ఒకటిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ప్రకారం ఆనాడు.. వచ్చే మూడేళ్లలో...పేదరిక రేఖకు దిగువన ఉన్న ఐదు కోట్ల కుటుంబాలకు 1600 రూ. చొప్పున గ్యాస్ కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మోడీ ఉజ్వల పథకం కింద...ఇప్పటివరకు 3కోట్ల 30 లక్షల కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు అందించామని...గడువులోపల ఐదు కోట్ల కుటుంబాలను ఇస్తామని పేర్కొన్నారు. అయితే ఈ బడ్జెట్లో ఈ సంఖ్యని ఐదుకోట్ల గ్యాస్ కనెక్షన్లనుండి ఎనిమిది కోట్లకు పెంచారు.

చిన్నవ్యాపారాల్లో ఉన్న మహిళలకు పెద్ద అండ...ముద్ర రుణాల పెంపు...

తమకున్న తీరిక సమయాన్ని, నైపుణ్యాలను, సహనం, ఓర్పులను సంపాదనగా మార్చుకోవటంలో మగవారికంటే మహిళలు ముందుంటారు. ఇంట్లోనే ఉండి హోమ్‌మేకర్లు అనిపించుకునే స్త్రీలు సైతం ఏదో ఒక రూపంలో తమ సంపాదనని కుటుంబానికి జత చేస్తున్నారు. పాడి, కుట్టుమిషన్లు, కిరాణా కొట్లు, కూరగాయల వ్యాపారం, టిఫిన్ సెంటర్లు, చిన్నపాటి హోటళ్లు, కర్రీ పాయింట్లు, జిరాక్స్ సెంటర్లు, కోళ్లఫారాలు... ఇలా పలురకాల కుటుంబ చిన్న తరహా పరిశ్రమల ద్వారా ...నేడు మహిళలు ఉపాధి పొందుతు న్నారు. కార్పొరేట్ కాని... ఇలాంటి వ్యాపార యూనిట్లు దేశంలో అత్యధికశాతం మందికి ఉపాధిని అందిస్తున్నాయి. ఇలాంటివారికి రుణసదుపాయాన్ని అందించడానికి ఏర్పాటుచేసిన పథకమే ముద్ర బ్యాంక్ లోన్ యోజన. ఈ పథకం కింద రుణసదుపాయాన్ని పొందుతున్న ఖాతాదారుల్లో దాదాపు 76శాతం మంది మహిళలే. మళ్లీ అందులో యాభైశాతం మంది మహిళలు.. ఎస్‌సి ఎస్‌టి ఓబిసి వర్గాలకు చెందినవారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ బడ్జెట్‌లో ముద్ర రుణాలకోసం మూడు లక్షల కోట్ల రూపాయలను కేటాయించారు. వ్యాపారంలో ఉత్సాహంగా ముందుకు వెళుతున్న మహిళలకు ఇది శుభవార్తే మరి.

గ్రామీణ భారతాన్ని మారుస్తున్న... మహిళల స్వయం సహాయక సంఘాలకు తోడుగా...

భారతదేశ ముఖచిత్రాన్ని మారుస్తున్న అంశాల్లో స్వయం సహాయక సంఘాల పాత్ర చాలా ఉంది. ఒక కట్టెని ఎవరైనా తేలిగ్గా విరిచేయగలరు...నాలుగు కట్టెలు కట్టగా ఉంటే...వాటి బలం పెరుగుతుందనే పాత సామెత స్వయం సహాయ సంఘాలకు చాలా బాగా వర్తిస్తుంది. గ్రామాల్లోని, చదువు తక్కువగా ఉన్న ఉపాధిలేని మహిళలు...స్వయం సహాయ సంఘాలుగా ఏర్పడి అద్భుతాలు సృష్టించడం ఇప్పుడు దేశమంతా కనబడుతోంది. మహిళలు బృందాలుగా ఏర్పడి...తాము పొదుపు చేస్తూ....బ్యాంకుల నుండి రుణాలను పొందుతూ...తమ ఇంటికి ఆర్థిక ఆధారంగా నిలుస్తున్నారు. తమలోని ధైర్యాన్ని నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. రెండు కొప్పులు చేరితే గొడవలే...అనే పాత నానుడిని తిరగరాసి ఐకమత్యంతో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ముందుకు సాగుతున్నారు. మనదేశంలో స్వయం సహాయక సంఘాలు నాబార్డు బ్యాంకుతో అనుసంధానమై ఉన్నాయి. ఇప్పటివరకు పాతిక సంవత్సరాల కాలంలో 85 లక్షల స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల ద్వారా 61వేల కోట్ల రూపాయలను రుణాలుగా పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు సొంతంగా ఉపాధిని సృష్టించుకుంటున్నాయని, ఇందులో మహిళలే ఎక్కువగా ఉన్నారని, మహిళలు ఈ సంఘాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారని అరుణ్ జైట్లీ గత ఏడాది ఒక సందర్భంలో అన్నారు. స్వయం సహకార సంఘాలకు బ్యాంకుల అనుసంధానం పెంచాలని ఆయన అప్పుడు నాబార్డుని కోరారు. తన మనసులోని ఆలోచనలకు అద్దం పట్టేలాగే ఇప్పుడు బడ్జెట్‌లో స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలను 37శాతం పెంచారు.

ఉద్యోగినికి ఊతంగా నిలిచే ప్రావిడెండ్ ఫండ్...నూతన విధానం

ఇంటికి ఆసరాగా నిలవాలని ఉద్యోగాలు చేసే మహిళలకు ఒక్క రూపాయి కలిసివచ్చినా ఆనందంగానే ఉంటుంది. స్వయం సహాయక సంఘాలు, కుటుంబ చిన్నతరహా పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళలకోసం కేటాయింపులు చేసిన జైట్లీ..ఫార్మల్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఉద్యోగినులను గురించి కూడా ఆలోచించారు. వీరు తమ ఇంటికి తీసుకువెళ్లగల జీతం పెరిగేలా ఇపిఎఫ్ విధానంలో మార్పులు చేశారు. దీని ప్రకారం ప్రావిడెంటు ఫండుకోసం యాజమాన్య చెల్లింపుతో సమానంగా... మహిళా ఉద్యోగులు చెల్లించాల్సిన అవసరం లేదు. వేతనంలో 12శాతాన్ని యాజమాన్యం ప్రావిడెంటు ఫండుగా చెల్లించినప్పుడు...అంతే మొత్తాన్ని ఉద్యోగుల వేతనం నుండి కూడా కట్ చేస్తారు. అయితే బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని బట్టి.... యాజమాన్య చెల్లింపు 12శాతం అలాగే ఉంటుంది కానీ మహిళల వేతనం నుండి మాత్రం 8శాతం మాత్రమే కట్ చేస్తారు. అయితే ఈ విధానం మహిళా ఉద్యోగులకు మొదటి మూడేళ్లు మాత్రమే వర్తిస్తుంది. ఏదిఏమైనా ఉద్యోగం తొలినాళ్లలో వేతనం తక్కువగా ఉన్న రోజుల్లో అందివచ్చే సహాయంగా ఈ మార్పుని భావించవచ్చు.

స్త్రీకి సామాజిక భద్రత...ఆరోగ్య రక్షణ...స్వాభిమాన పరిరక్షణ

బడ్జెట్‌లో సామాజిక భద్రతకు సైతం ఎక్కువ ప్రాధాన్యతనే ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మొదలైనవారిని దృష్టిలో ఉంచుకుని సామాజిక రక్షణ పథకాలకు 9,975కోట్ల రూపాయలను కేటాయించారు. ఈ పథకానికి గత ఏడాది చేసిన కేటాయింపులు 9,500 కోట్లు. ఈ పథకంలో వృద్ధులు, దివ్యాంగులు ఉన్నా...ఈ ఆర్థిక ప్రయోజనంతో ఈ కేటగిరీల్లోని మహిళలు, వితంతువులు మరింతగా సామాజిక భద్రతని పొందే వీలుంది. ఈ బడ్జెట్‌లో ఒకసంచలన సంక్షేమ పథకంగా పదికోట్ల పేద కుటుంబాలకు ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని... ప్రవేశపెట్టటం జరిగింది. ఈ పథకం కుటుంబం మొత్తం ఆరోగ్యాన్ని సంరక్షించేదే అయినా...దీనివలన మహిళలు మరింత ప్రయోజనాన్ని పొందే వీలుంది. ఆరోగ్యపరంగా కుటుంబంలో నిర్లక్ష్యానికి గురయ్యేది మహిళలే. సమాజంలో, ఇంట్లో సెకండ్ జండర్‌గా పరిగణించబడుతున్న మహిళల ఆరోగ్యం...చాలా సందర్భాల్లో నిర్లక్ష్యానికి గురవుతుంది. గ్రామాల్లో రక్తలేమి, ప్రసవ మరణాలు, అబార్షన్లు, రుతుక్రమం సమయంలో శుభ్రత లోపం వలన వచ్చే అనారోగ్యాలు... లాంటి సమస్యలతో మహిళలు అనారోగ్యాలకు గురవుతుంటారు. పేదరికం దిగువన ఉన్న కుటుంబాలకు ఆరోగ్య రక్షణని కల్పించడమంటే...ఒక కుటుంబాన్ని నిలబెట్టడమే అవుతుంది. అలాగే 2018-19 సంవత్సరంలో రెండు కోట్ల టాయ్‌టెట్లు కట్టించాలనే లక్ష్యంతో ఉన్నారు. టాయ్‌లెట్ల నిర్మాణంతో మహిళల ఆరోగ్యస్థితి, సాధికారత పెరుగుతాయని వారి అభిమానాన్ని కాపాడినట్టుగా భావిస్తున్నామని ఆర్థిక మంత్రి చెప్పు కొచ్చారు. టాయ్‌లేట్లు లేకపోవటం వలన స్కూలు మానేసే ఆడపిల్లలున్న దేశం మనది...కాబట్టి...మహిళలకు నేరుగా ప్రయోజనాన్ని ఇచ్చే అంశంగా దీన్ని చెప్పాలి. అయితే బడ్జెట్‌లో నిర్భయ ఊసు లేనేలేదని, ముద్ర రుణాల పేరుతో అత్యంత తక్కువ మొత్తాన్ని రుణంగా అందిస్తున్నారని...ఇది మహిళలకు చెప్పుకున్నత చేయూతేమీ కాదనే విమర్శలు సైతం వినబడుతున్నాయి. ఏదిఏమైనా బడ్జెట్...ఆర్థిక కష్టాలు అనుభవిస్తున్న సీతలపై శీతకన్ను వేయకపోవటం మాత్రం ఆహ్వానించదగిన విషయమే.

✍ వడ్లమూడి దుర్గాంబ
చొల్లేటి వేంకటేశ్వరా చారి

ఆచరణలో చూపాలి



బడ్జెట్‌లో కేటాయింపులు కాదని, వాటిని ఖర్చుచేసి చూపాలని సామాజిక కార్యకర్త లుబ్నా సర్వత్ అన్నారు. గతం బడ్జెట్‌లోను ఇలాగే కేటాయింపులు చూపారని, అవి ఎంతమేరకు ఖర్చుచేశారో చెప్పాలన్నారు.. మహిళలకు కావాల్సింది కాగితాల మీద సంక్షేమం, ప్రగతి,భద్రతలు కాదన్నారు.ఈసారి బడ్జెట్ కేటాయింపులు .. చెప్పుకోవడానికి తప్ప మహిళలకు ఇసుమంత మేలు చేయవన్నారు. ప్రతిసారి బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట అని చెప్పుకోవడం తప్ప, ఒరిగిందేమిటన్నారు. గతంలో నిర్భయకు నిధులు కేటాయించారు. మరి దేశంలో మహిళలపై అత్యాచారాలు ఎందుకు కంట్రోల్ కావడంలేదని ప్రశ్నించారు. ఎన్ని కోట్లు కేటాయించారని కాదు, మహిళలకు జరిగిన ప్రయోజనం ఏంటో పాలకులు చెప్పాలని డిమాండ్ చేశారు. భద్రత కరువైన సమాజంలో మహిళలకు బడ్జెట్‌లో కేటాయింపులు అనేది కంటితుడుపు చర్యలే తప్ప ఇంకేమి కాదని లుబ్నా అభిప్రాయ పడ్డారు.

-లుబ్నా సర్వత్, సామాజిక కార్యకర్త

నిధులు ఖర్చుచేస్తేనే మహిళలకు మేలు



ఈసారి బడ్జెట్‌లో మహిళా సంక్షేమం, అభ్యున్నతికి నిధుల కేటాయింపులు బాగానే ఉన్నాయిని సీనియర్ జర్నలిస్టు జ్యోతిర్మయి అభిప్రాయ పడ్డారు. అయితే మహిళల భద్రత విషయంలోనే కాస్త నిరాశ ఎదురైందన్నారు. ముద్రా యోజనకు నిధులు పెంచడం సంతోషదాయకమన్నారు. మహిళల స్వయం ఉపాధికి ఇది దోహద పడుతుందన్నారు. ఈసారి మహిళల ఆరోగ్యం, సంక్షేమానికి కూడా బెడ్జెట్లో ప్రాధాన్యత లభించిందన్నారు. అయితే నిధులు.,.. కేటాయింపులకే పరిమితం కానీయకుండా.. వినియోగం అయ్యేలా చూడాలని, లేదంటే ప్రతిపక్షాలకు మరో ఆయుధం చేతికిచ్చినట్లే అవుతుందని ఆమె అభిప్రాయ పడ్డారు.

-జ్యోతిర్మయి,సీనియర్ జర్నలిస్టు



వైద్యానికి అగ్రపీఠం!

ఆరోగ్యమస్తు!

బెటర్ లేట్ దెన్ నెవర్...అనే సామెత ఉంది. అసలు పూర్తిగా మానేయటం కంటే...లేట్ గా అయినా ఒక పని చేయటం మంచిదని. ఈ ఏటి బడ్జెట్ లో ప్రజారోగ్య రక్షణ విషయంలో తీసుకున్న శ్రద్ధ, చేసిన కేటాయింపులు ఈ విషయాన్నే రుజువు చేస్తున్నాయి. ఆరోగ్యాన్ని అగ్రభాగాన నిలిపిన బడ్జెట్ ఇది. ఈ మధ్యకాలంలో స్వచ్ఛభారత్, డిజిటల్ భారత్, మేకింగ్ భారత్...లాంటి మాటలు వినిపించినా...ఈ బడ్జెట్ మాత్రం ఆరోగ్య భారత్‌మీద దృష్టి పెట్టింది. జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకంలో భాగంగా ఆయుష్మాన్ భారత్‌ని ఆవిష్కరించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. అత్యంత ఆవశ్యకమైన అవసరమైన నిర్ణయం ఇది. ప్రభుత్వ రంగంలో ఆసుపత్రులు...ఆరోగ్యానికి అనారోగ్యం చేసినట్టుగా తయారయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ...పలురకాల అనారోగ్యాలు ప్రజా జీవితాలను అల్లకల్లోలం చేస్తున్న సందర్భంలో...ఇది సముచిత నిర్ణయం.

భారత ఆరోగ్యరంగం అనేక సమస్యల మయం అనే నిజాలను వెల్లడిస్తూ మన ముందుకు ఎప్పటికప్పుడు అనేకానేక నివేదికలు వస్తూనే ఉన్నాయి. వైద్యం...అనేది పేదవారికి అందరి ద్రాక్షపండుగా మారి...కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన విలాసంగా మారిపోయిందనే విమర్శలు సర్వత్రా వినబడుతున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పలు ఆరోగ్య పథకాలతో పేదలకు ఆరోగ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నా...మొత్తం ప్రజారోగ్య వ్యవస్థని చక్కదిద్దేలా అవి ఉండటం లేదు.

వైద్యో నారాయణ...లేరు!

నేషనల్ హెల్త్ ప్రొఫైల్ 2013 నివేదిక ప్రకారం గ్రామాల్లో అవసరం ఉన్న వైద్యుల సంఖ్యలో 33శాతం వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దేశంలోని 70శాతం జనాభా నివసిస్తున్న గ్రామాల పరిస్థితి ఇది. ఈ విషయాన్ని అంకెల్లో చెప్పుకుంటే...1,06,613 మంది ప్రభుత్వ వైద్యుల్లో 29,562 మంది మాత్రమే గ్రామాల్లో పనిచేస్తున్నారు. దాదాపు 121 కోట్ల జనాభా ఉన్న దేశానికి ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో ఉన్న వైద్యుల సంఖ్య 9,18,303. ప్రతి 10,189 మంది ప్రజలకు ఒక ప్రభుత్వ డాక్టరు ఉన్నాడు. ప్రతి 2,046 మంది ప్రజలకు ఒక హాస్పటల్ బెడ్ ఉంది. ప్రతి 90,343 మందికి ఒక ప్రభుత్వ ఆసుపత్రి ఉంది.

మనకున్న వైద్యుల్లో తఎక్కువశాతం మంది నగరాలు పట్టణాల్లో పనిచేయడానికే ఆసక్తి చూపుతున్నారు. ఒకవైపు గ్రామాల్లో ఆరోగ్యపరిస్థితి నానాటికీ దిగజారుతుంటే మరొకవైపు వైద్యుల కొరత, వైద్యం ఖరీదు...సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు కానీ...ప్రజల అనారోగ్యమే... వైద్యుల మహాభాగ్యం అనేలా డాక్టర్లు సంపాదన కోసం పరుగులు తీస్తున్న పరిస్థితి. ఇలాంటి స్థితిలో బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు అత్యంత ఆవశ్యకాలుగానే చెప్పాలి. పదికోట్ల కుటుంబాలు ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం కిందకు రావటం హర్షించదగిన అంశమే. 24 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఆసుపత్రులను ఏర్పాటు చేయాలనే నిర్ణయమూ ఆహ్వానించదగినదే.

అనారోగ్యాలను తెస్తున్న అంశాలెన్నో

అటు అంటువ్యాధులు, ఇటు తీవ్రమైన దీర్ఘకాలిక వ్యాధులు భారత్‌లో పెరుగుతున్నాయి. మరో వైపు విద్యలేకపోవటం, ఆరోగ్య జీనవ విధానంపై అవగాహన లేకపోవటం, శుభ్రతని పాటించకపోవటం లాంటి సమస్యలతో రోగాలు పెరుగుతున్నాయి. సురక్షితమైన మంచినీరు లేకపోవటం, వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, జనాభా పెరుగుదల, స్త్రీపురుష అసమానతలు లాంటి సమస్యలతో ప్రజారోగ్యానికి రక్షణ అనేది లేకుండా పోయింది. స్వాతంత్ర్యం తరువాత ఆరోగ్య రక్షణకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినా... సమస్యలు అలాగే ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 191 దేశాల్లో ప్రజారోగ్యం విషయంలో మనదేశం 112వ స్థానంలో ఉందంటే మనమెంత వెనుకబడి ఉన్నామో అర్థమవు తుంది. బంగ్లాదేశ్ కూడా భారత్ కంటే ముందే ఉంది. ఒకవైపు మనకు ప్రతిభ ఉన్న వైద్యులు ఉన్నా మరొక వైపు వైద్యుల కొరత, గ్రామాల్లో అందు బాటులో లేకపోవటం, ప్రభుత్వాలు ప్రజారోగ్యం కోసం చేస్తున్న ఖర్చు చాలా తక్కువగా ఉండటం లాంటి సమస్యలు వెంటాడు తున్నాయి. ఇలాంటి స్థితిలో ప్రతి మూడు పార్లమెంటరీ నియోజక వర్గాల పరిధి లో ఒక వైద్య కళాశాల ను ఏర్పాటు చేయాలనే నిర్ణయం మంచి విషయమే. అలాగే ప్రత్యేకం గా పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకు ఆరోగ్య వెల్ నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. భారతదేశ జనాభాలో నలభై శాతం మంది లబ్ధిని పొందేలా జాతీయ ఆరోగ్య భీమా పథకాన్ని తీసుకువస్తున్నట్లుగా తెలుస్తోంది.



అభివృద్ధిలోనే కాదు...అనారోగ్యంలోనూ పరుగులు...

మనదేశం అభివృద్ధి పరంగా వేగంగా పరుగులు తీస్తున్నట్టుగా చెప్పుకుంటున్నాం. వృద్ధి రేటు అంటూ లెక్కలు చూపిస్తున్నాం. అయినా దేశంలో ఆరోగ్య రక్షణ వ్యవస్థ నేపాల్ ఘనా లైబీరియా లాంటి దేశాలకంటే కూడా వెనుకబడి ఉంది. వైద్య రక్షణ విషయంలో మనదేశం 195దేశాల్లో 154వ స్థానంలో ఉంది. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే ఇందుకు కారణం. మన స్థూల జాతీయ ఉత్పత్తిలో పెరుగుదల కనబడుతున్నా.. .ఆరోగ్యరంగంలో ప్రభుత్వం చేస్తున్న ఖర్చు మాత్రం పెరగటం లేదు. ఇప్పటికీ ఆరోగ్యం అంద కపోవటం వలన మరణిస్తున్నవారి సంఖ్య....ఎక్కువగానే ఉంది. అంబులెన్స్ సదుపాయం లేకపోవటం వలన మరణించిన భార్య మృతదేహంతో భర్త మైళ్లకొద్దీ నడిచాడనే హృదయ విదారకమైన వార్తలను మనం చూస్తున్నాం. ప్రతి నిముషం ఐదేళ్లలోపు పిల్లలు ఇద్దరు మరణిస్తున్నారు. అంతకంటే ఎక్కువగా వైద్యరంగంలో దేశం ఎదుర్కొంటున్న దుస్థితిని కళ్లకు కట్టే సంఘటనలు ఈ మధ్యకాలంలో మరింత ఎక్కువగా జరగటం చూస్తున్నాం. ఉత్తర ప్రదేశ్ లోని గోరఖ్‌పూర్‌లోని ఒక ఆసుపత్రిలో 400మంది పిల్లలు మరణించిన ఘటన దేశం ఉలిక్కిపడేలా చేసి...మన వైద్యరంగంలోని డొల్లతనాన్ని కళ్లకు కట్టేలా చేసింది. దేశంలోనే అత్యంత ఎక్కువ జనాభా ఉన్న ఉత్తర ప్రదేశ్ దేశంలో ఆరోగ్యం విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే 36వ స్థానంలో ఉంది. ఆసుపత్రుల్లో ఆరోగ్యం అందకే కాదు... వసతులు, మౌలిక సదుపాయాల లోపాలతోనూ ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అప్పుడే పుట్టిన పసివాడిని ఎలుకలు కొరికిన ఘటనని ఆ మధ్య చూశాం. అలాగే బిల్లులు కట్టకపోవటం వలన ఆక్సిజన్ సప్లయి దారుడు దానిని నిలిపి వేయటం వలన గోరఖ్‌పూర్ పిల్లల మరణాలు సంభవించినట్టుగా తెలిసింది. అదే రాష్ట్రంలో మరొక ఆసుపత్రిలో 49మంది పిల్లలు ఆక్సిజన్ మందులు లేకపోవటం వలన మరణించారు. జార్ఖండ్‌లో ఒక్క సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం నడుపుతున్న రెండు ఆసుపత్రుల్లో 800మంది పిల్లలు మరణించారు.

ఇది సరిపోతుందా...

వైద్యపరంగా భారత్ ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే..ఇప్పుడు చేసిన కేటాయింపులు ఏ మాత్రం చాలవని అర్థమవుతుంది. పేదరికం దిగువన ఉన్న ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచేలా, వారి జీవనగతిని మార్చేలా కనీస వసతులు వారికి అందాల్సి ఉంది. అలా లేకపోవటం వలన వారి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతోందని...ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్యసేన్‌తో కలిసి పుస్తకాలు రచించిన ఆర్థిక నిపుణుడు జీన్‌డ్రేజ్ అన్నారు. దేశంలో ఉన్న ఆర్థిక అసమానతల వలన కూడా ఆరోగ్యవ్యవస్థ దిగజారుతున్నదని, వైద్యులు సైతం పేదలవైద్యులుగా ఉన్నవారి వైద్యులుగా విడిపోతున్నారని...ఆయన అన్నారు.

ఇలాంటి పరిస్థితులు అడుగడుగునా కనబడుతున్న దేశంలో... ఆరోగ్యరక్షణ పరంగా అడుగులు చాలా వేగంగా పడాలి. ఈ శ్రద్ధ మున్ముందు కూడా...కొనసాగితే కానీ...దీన్ని ఒక అత్యవసర స్థితిగా తీసుకుంటే కానీ పరిస్థితుల్లో మార్పులు రావు.

కేంద్రంపై వేతన జీవులు గరం... గరం..!

కల చెదిరింది..కథ మారింది..!



వేతన జీవుల ఆశలు ఆవిరయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న వేళ ప్రవేశ పెడుతున్న బడ్జెట్ కావడంతో ఆదాయపన్ను మినహాయింపు పరిమితి పెంపు ఉంటుందని ఎన్నో కలల కన్న వేతన జీవుల కలలు కల్లలయ్యాయి. ఎందుకో కేంద్ర ఆర్థిక మంత్రి అటువైపు చూసేందుకు కూడా పెద్దగా ఇష్టపడ్డ దాఖలాలు కనిపించవు. అందుకే ఆదాయ పన్నుస్లాబులలో, పన్ను రాయితీ పరిమితిలో ఎలాంటి మార్పులు లేవంటూ ఒక్కమాటతో ..మమ.. అనిపించారు. అంతవరకు టీవీల ముందు జైట్లీ బడ్జెట్ ప్రసంగాన్ని చెవులు రిక్కించి విన్న వేతన జీవులు. ఎలాంటి మార్పులేదన్న మాటతో అవాక్కయ్యారు. అయితే 40 వేల రూపాయలు స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రకటించడం వేతన జీవులకు కాస్త ఊరట కలిగించే విషయం. ఇక ప్రయాణ, వైద్య ఖర్చుల మాత్రం 40వేల వరకు ఆదాయ పన్ను రాయితీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ల బ్యాంకు డిపాజిట్ల వడ్డీపై 50వేల రూపాయల వరకు పన్ను ఉండదు. సీనియర్ సిటిజన్ల వైద్యఖర్చులకు పన్ను రాయితీని 60వేల నుంచి లక్షరూపాయలకు పెంచారు. సీనియర్ సిటిజన్ల సంగతి ఎలా ఉన్నా.. వేతన జీవులు కేంద్ర నిర్ణయంపై నిప్పులు చెరుగుతున్నారు. కొందరైతే ఏకంగా కేంద్రానికి శాపనార్థాలు పెడుతున్నారు.

చాలా అన్యాయం

- డాక్టర్ లక్ష్మణ్, అగ్రి ప్రొఫెసర్



దేశ బడ్జెట్ ..కుటుంబ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని అగ్రికల్చర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.లక్ష్మణ్ అభిప్రాయ పడ్డారు. వివిధ మార్గాల ద్వారా ఆదాయం లభించే ఇతర వర్గాల కన్నా వేతన జీవులపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా విద్యా రంగంలో పనిచేసే వారికి ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచక పోవడం వల్ల చాలా అన్యాయం జరుగుతుందన్నారు. ఆదాయ పరిమితి కనీసం 3లక్షల వరకు పెంచుతారని ఆశగా ఎదురు చూసిన ఉద్యోగులకు కేంద్ర మంత్రి ప్రకటన తీవ్ర నిరాశకు గురి చేసిం దన్నారు. పైగా ఎడ్యుకేషన్ సెస్‌ను పెంచడంతో పిల్లల చదువుల భారం పెరుగుతుందన్నారు. వేతన జీవులు తమ జీతాలను పన్నులు చెల్లించడానికే సరిపోతుందేమో అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేంద్రం బడ్జెట్‌లో రక్షణకు,విదేశీ వ్యవహారాలకు నిధులు కేటాయించినట్లే..... కుటుంబ బడ్జెట్‌లోను కేటాయింపులు ఉంటాయని,వాటిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరట కల్పించాల్సింది పోయి, క్రమం తప్పకుండా ఆదాయ పన్ను చెల్లించే మాపైనే శీతకన్ను వేయడం దారుణమని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

నిరాశ మిగిల్చింది

-మధుసూధన్ రెడ్డి, టీఎస్ పీఆర్టీయూ లీడర్



కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చిందని తెలంగాణ పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మధుసూధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జీతం తప్ప వేరే ఆదాయం ఉండని టీచర్లకు ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచక పోవడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. గత బడ్జెట్ అప్పుడే స్లాబుల విషయంలో తిమ్మిని బమ్మిని చేసి ఉద్యోగులకు ఏదో మేలు చేసినట్లు చూపించారన్నారు. ఈసారైనా ఆదాయపన్ను మినహాయింపు పరిమితి 3 లక్షలకు పెంచుతారని ఎన్నో కలల కన్నామన్నారు. స్టాండర్డ్ డిడక్షన్ తిరిగి ప్రవేశ పెట్టడం మంచిదే అయినా ఆశించిన మేలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను మినహాయింపు పరిమితిని పెంచకుండా ఏది చేసినా వేతన జీవులకు పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా తిమ్మిని బమ్మిని చేసి, గతంలో మాకేదో మేలుచేశానని కేంద్రమంత్రి చెప్పడం బాధకల్గించిందని మధుసూధన్ రెడ్డి అన్నారు.

3లక్షల రూపాయలకు పెంచితే బాగుండేది

- మామిడోజు వీరాచారి, టీచర్



ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని 3లక్షల రూపాయలకు పెంచితే బాగుండేదని ప్రభుత్వ టీచర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మామిడోజు వీరాచారి అభిప్రాయ పడ్డారు. పన్నులోఇతర రాయితీల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. పరిమితి పెంపుపై గంపెడు ఆశలు పెట్టుకున్న తమకు బడ్జెట్ తీవ్ర ఆవేదన మిగిలించిందని చెప్పారు. కాకపోతే నిరుద్యోగులకు70 లక్షల ఉద్యోగాలు,స్కిల్ డెవలప్ మెంట్ లాంటివి మా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా కాస్త ఊరట కల్గించిందని అభిప్రాయ పడ్డారు. ఎన్నికల వేళ పన్ను మినహాయింపు పరిమితి పెంపు తప్పకుండా ఉంటుందన్న ఆశలపై మాత్రం కేంద్రమంత్రి జైట్లి నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశలపై నీళ్లు చల్లారు

-కొండపల్లి వేణుగోపాలరావు,రిటైర్డ్ ఇంజనీర్



కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని రిటైర్డ్ ఇంజనీర్ వేణుగోపాలరావు అభిప్రాయపడ్డారు. స్టాండర్డ్ డిడక్షన్ మినహాయిస్తే ఉద్యోగులకు బడ్జెట్‌తో ఒరిగిందేమి లేదన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు కాస్త మేలు జరిగిందని చెప్పారు. వారికి మేలు చేశారు సరే.. జీతం మీదే ఆధారపడి బతికే ఉద్యోగులకు మాత్రం ఆదాయపన్ను మినహాయింపు పరిమితి పెంచకపోవడం దారుణమన్నారు. రోజు రోజుకు ఖర్చులు పెరిగిపోతున్నాయి. అంతెందుకు పెట్రోల్ ధరే ఏరోజు ఆరోజే చుక్కలు చూపిస్తుందన్నారు. అలాంటప్పుడు ఉద్యోగులు సంపాదించే దాంట్లో ఐటీనే చెల్లించాలా..పిల్లలను చదివించుకోవాలా ప్రభుత్వ పెద్దలే సమాధానం చెప్పాలన్నారు. కార్పోరేట్ రంగానికి మేలు చేసే ప్రభుత్వాలు,వేతన జీవుల పరిస్థితిని అర్థం చేసుకోక పోవడం బాధాకరమన్నారు.

ఒక విధంగా సంతోషం

- సీతారత్నం, ఏజీఎం(ఫైనాన్స్, మహేంద్రా టెక్)



ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచకపోవడం చాలా బాధాకరమని, కేంద్ర ప్రభుత్వాలు,సిన్సియర్‌గా పన్ను చెల్లించే వేతన జీవులపట్ల ఎందుకు చులకన భావం కలిగి ఉంటాయో అర్థం కాదని మహేంద్రా టెక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) సీతారత్నం ఆవేదన వ్యక్తం చేశారు. స్లాబుల్లో మార్పులు చేసి ఎక్కువ మంది ఆదాయపన్ను పరిధిలోకి వచ్చేలా చేయక పోవడం సంతోషించాల్సిన విషయం అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే అలా చేయలేదని అభిప్రాయ పడ్డారు. వేతనం మీదే ఆధారపడే ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చిందన్నారు. ఇది ఎన్నికల బడ్జెట్ కాబట్టి తప్పకుండా తమకు తాయిలాలు ఉంటాయన్న గంపెడాశతో ఉన్న ఉద్యోస్తులకు అన్యాయం జరిగిందన్నారు.

మేం హ్యాపీ

కేంద్ర బడ్జెట్‌లో సీనియర్ సిటిజెన్స్‌పై దృష్టిసారించింది. ఆరోగ్య వ్యయం, బీమా , డిపాజిట్లపై టీడీఎస్ సంబంధించి ప్రధాన ప్రకటనలు చేశారు. సీనియర్ సిటిజన్లకు పన్నుల్లో మార్పులు తీసుకొచ్చారు. 60 ఏళ్లు దాటినవారికి ఇది ఊరట. ఆరోగ్య బీమా ప్రీమియంకు సంబంధించి సంవత్సరానికి రూ 50వేల రూపాయలు పన్ను మినహాయింపు ఇచ్చారు. జైట్లీ ఇచ్చిన రాయితీలపై పలువురు వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. వారేమన్నారో.. వారి మాటల్లోనే..

హర్షణీయం




2018 బడ్జెట్ వృద్ధులకు అనేక పన్ను మినహాయింపులను ప్రకటించింది. సెక్షన్ 80 డి, 80డిడిబి క్రింద పన్ను మినహాయింపు ఇవ్వడం పెద్ద ఊరట కలిగించింది. అనారోగ్యానికి గురైన వృద్ధులకు ప్రోత్సాహకరంగా ఈ బడ్జెట్ ఉంది. ప్రధానమంత్రి వందన యోజన క్రింద రూ 15 లక్షల రూపాయలకు పెరగడం హర్షణీయం. ఆరోగ్య బీమా ప్రీమియం కోసం ఈ తగ్గింపు పరిమితి సెక్షన్ 80 డి క్రింద 2017-18 ఆర్థికసంవత్సరానికి 30,000 రూపాయలకు తగ్గించడం బాగుంది. బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా రూ 40,000 ప్రామాణిక మినహాయింపు పెన్షనర్లకు లాభం చేకూరుతుందని భావించవచ్చు.

సీనియర్ సిటిజన్లకూ రూ 50వేల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్ట్ ఆఫీస్ డిపాజిట్లపై టీడీఎస్ ఉండదని చేసిన ప్రకటనతో ఎంతో ఆనందం కలిగింది. ఈ పరిమితి ఇంతకు మునుపు రూ 10వేలు ఉండేది.

టీడీఎస్ సెక్షన్ 194 ఎ క్రింద తీసివేయవలసిన అవసరంలేదని, అన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు, పునరావృతం అయ్యే డిపాజిట్ పథకాలకు వడ్డీ ప్రయోజనం లభిస్తుందని చెప్పడం మాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరం.

- ఎ. దామోదర్‌రావు
రిటైర్డ్ రీజనల్ డైరెక్టర్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్

పన్ను మినహాయింపు బాగుంది



అనారోగ్యం, వైద్య ఖర్చులకు తగ్గింపు పరిమితిలో సెక్షన్ 80 డిడిబి క్రింద ఒక లక్ష రూపాయల వరకు పెరిగింది. గతంలో సీనియర్ పౌరులకు రూ 60,000 సూపర్ సీనియర్ పౌరులకు 80,000 రూపాయలు మాత్రమే ఉండేది.

మునుపెన్నడూ లేని విధంగా వృద్ధులకు చేయూత నిచ్చే విధంగా బడ్జెట్ ఉంది. 80 ఏళ్లు దాటిన వృద్ధులకు మాత్రమే పన్ను మినహాయింపు ఉండేది. ఈ బడ్జెట్‌లో 60 దాటిన వారికి కూడా ఈ మినహాయింపు ప్రకటిం చింది. ప్రాణాంతక వ్యాధులైన ఎయిడ్స్, క్యాన్సర్ వంటి వ్యాధులకు చికిత్స చేయడానికి చాలా ఖర్చ వుతుంది. ఈ చికిత్స నందించడానికి పన్ను మినహాయింపులు ఇవ్వడం వల్ల అనారోగ్యాన్ని జయించడానికి అవకాశం దక్కింది.

- సుదర్శన్
రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి

ప్రజాకర్షంగా ఉంది



ప్రధాన్‌మంత్రి వయో వందన యోజన మార్చి 2020 వరకూ వర్తిస్తుందని, ప్రస్తుత పరిమితి రూ 7.5 లక్షల నుండి రూ 15 లక్షల రూపాయలకు పెంచడం అభినందనీయం.

అరుణ్‌జైట్లీ సీనియర్ సిటిజన్లకు సామాజిక భద్రతా ప్రకటన చేశారు.

మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న నాలుగు బడ్జెట్‌లలో సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత దక్కలేదు. కానీ సోషల్ స్కీమ్‌లను మాత్రం దూకుడు గానే ప్రకటించారు. ఈసారి కూడా అదే విధానాన్ని అవలంబిస్తూనే ప్రజాకర్షంగా ఉండేలా మేకప్ వేసిన వైనం కనిపిస్తుంది.

- సిరికొండ నర్సింహ
ప్రయివేటు ఉద్యోగి

విమానం ఎంతెంత దూరం



ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తమ బడ్జెట్ ప్రసంగంలో పౌర విమానయాన రంగానికి ఒక పెద్ద లక్ష్యాన్నే నిర్దేశించారు. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో ప్రస్తుతం ఉన్న 124 విమానాశ్రయాల సంఖ్యను ఐదు రెట్లు పెంచి విమనాల రాక పోకల సంఖ్యను ఏడాదికి వందకోట్లకు పెంచాలని ప్రభుత్వం సంకల్పించినట్లు చెప్పారు. 'హవాయి చెప్పల్ పెహనె వాలె నాగరిక్ భీ అబ్ హవాయ్ జహాజ్ మే ఉడేంగే' (హవాయి చెప్పులు ధరించేవారు సైతం ఇకపై విమానాల్లో ప్రయాణిస్తారు అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు కూడా. ఆయన చేసిన ఈ ప్రకటనను బట్టి విమాన ప్రయాణికుల సంఖ్య పెంచడంతో బాటు, ఆ ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలన్న ఆకాంక్ష కనబడింది. దేశంలో రవాణాకు సంబంధించినంతవరకూ ఇప్పటికీ దేశ ప్రజల్లో ఎక్కువ మంది ఆశ్రయిస్తున్నది రోడ్డు, రైలు రవాణాను మాత్రమే. విమాన సంస్థల మధ్య పోటీ, పలు సంస్థలు ఈ రంగంలోకి ప్రవేశించడం, ప్రజల ఆదాయాలు పెరగడంతో విమాన ప్రయాణం మరికొంతమందికి అందుబాటులోకి వచ్చినా అది తక్కువే. ఆ రంగం అంతగా సామాన్యునికి అందుబాటులోకి రాలేదు. ప్రాంతీయ విమానయాన సర్వీసులను అందిస్తున్న సంస్థలలో ప్రభుత్వ రంగంలో ని ఎయి ర్ ఇండియా, పవన్ హంస్ కాగా, లిస్టెడ్ సంస్థల్లోని స్పైస్ జెట్, ఇండిగో ఎయిర్‌లైన్స్, జెట్ లైట్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, జెట్ ఎయిర్‌వేస్ తదితరాలున్నాయి. ప్రైవేటు సంస్థల్లో ప్రముఖమైనవి గో ఎయిర్, ఎయిర్ ఆసియా, విస్తారా .

వాస్తవానికి పరిశ్రమ పరంగా చూస్తే గత మూడేళ్ళ కాలంలో పౌర విమానయాన రంగం దేశంలో అతి వేగంగా పెరుగుతున్న పరిశ్రమల్లో ఒకటి. ఇది ప్రపంచంలోనే అతి వేగంగా విస్తరిస్తున్న మూడవ అతి పెద్ద దేశీయ మార్కెట్. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం (ఐఏటిఏ) అంచనాల ప్రకారం భారత్ 2026 నాటికి ఈ రంగంలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న బ్రిటన్‌ను అధిగమించగలదని భావిస్తున్నారు. మన దేశంలో విమానయాన రంగం కొత్త విమానాల కొనుగోలు, అధునాతన విమానాశ్రయాల నిర్మాణం, ఉన్న వాటి విస్తరణ, దేశీయ విమానయాన రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడం, అధునాతన సమాచార సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటి ద్వారా త్వరిత గతిన అభివృద్ధి చెందుతోంది.

> వాస్తవానికి పరిశ్రమ పరంగా చూస్తే గత మూడేళ్ళ కాలంలో పౌర విమానయాన రంగం దేశంలో అతి వేగంగా పెరుగుతున్న పరిశ్రమల్లో ఒకటి. ఇది ప్రపంచంలోనే అతి వేగంగా విస్తరిస్తున్న మూడవ అతి పెద్దదేశీయ మార్కెట్. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం (ఐఏటిఏ) అంచనాల ప్రకారం భారత్ 2026 నాటికి ఈ రంగంలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న బ్రిటన్‌ను అధిగమించగలదని భావిస్తున్నారు.

దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య గత ఏడాది ఆగస్టు నాటికి అంతకు ముందు కన్న 16 శాతానికి పెరిగింది. పౌర విమానయాన డైరెక్టరేట్ అంచనా ప్రకారం గత ఏడాది ఆగస్టులో విమాన ప్రయాణం చేసిన వారి సంఖ్య 9.69 మిలియన్లు. ఇది అంతకు ముందు ఏడాది ఉన్న 8.38 మిలియన్లు కన్న ఎక్కువ. 2017 జనవరి, ఆగస్టు మధ్య కాలంలో 75.411 మిలియన్లు కాగా, అంతకు ముందు సంవత్సరం అదే కాలంలో ప్రయాణించిన ప్రయాణికుల సంఖ్య 64,468 మిలియన్లు. ఇది 16. 97 శాతం పెరుగుదల. ఒకప్పుడు 396గా ఉన్న విమానాల సంఖ్య ఇప్పుడు 496కు పెరిగింది. దీనికి తోడు మరో 654 విమానాల కొనుగోలు ప్రక్రియ సాగుతోంది. ఇవన్నీ విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుదలను సూచించే విషయాలే. విమానాల కొనుగోలు పెరుగుతోందంటే వాటి అవసరం ఉందనే భావించాలి. అయితే విమానాల రాక పోకల సంఖ్యను వందకోట్లకు పెంచే విషయంలో మనం చాలా దూరంలో ఉన్నామన్న విషయం గమనించదగ్గది. రాత్రికి రాత్రి అన్నీ జరగవు. విమానయాన రంగం విస్తృతికి జరిగే ప్రయత్నాలు సాగుతాయనడానికి ఇది ఒక సూచనగా మాత్రమే స్వీకరించాలి. ఇటువంటి అభివృద్ధి, హవాయి చెప్పులు ధరించే సామాన్యుడు సైతం విమానాలెక్కాలంటే దాట వలసిన అవరోధాలెన్నో ఉంటాయి. గతంలో విమానయా శాఖ ఒకే ప్రాంతంలోని వివిధ ప్రదేశాలను కలిపేందుకు ఉడాన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే పూర్వాపరాలు పూర్తిగా బేరీజు వేసుకోకుండా పథకం చేపట్టటం వల్ల అది విజయవంతం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాంతీయ సర్వీసులు ప్రధాన మార్గాలతో అనుసంధానితమై ఉంటాయి. దానిలో స్లాట్ల సమస్య కూడా ఉంటుంది.

ప్రాంతీయ సర్వీసులు నిర్వహించే విమానాలు బరువు తక్కువగా ఉంటాయి. ప్రధాన మార్గాల్లో వెళ్లేవి బరువు ఎక్కువగా ఉంటాయి. ఇందువల్ల రెండు రకాల స్లాట్లు తీసుకోవడం కూడా ఉడా న్ పథకానికి ఒక సమస్య అయింది అందువల్ల కొన్ని విమానయాన సంస్థలు ఉడాన్ పథకం పట్ల విముఖత కనబరచడానికి మరో సమస్య అయింది. ఏ కొత్త పథకం ప్రవేశపెట్టినా దాని మీద తర్జన భర్జనలు చేసినాకే ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇందుకు కొంత సమయం పట్టవచ్చు. తొందరపాటు తగదని గతంలో ఉడాన్ విషయంలో ఎదురైన అనుభవం చెబుతోంది.

దేశీయ విమానయాన రంగం విస్తరణకు తోడ్పడిన రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఒక అంశమని తెలుసుకున్నాం. విమానయాన రంగంలోకి వచ్చి విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు 2000 ఏప్రిల్ - 2017 మార్చి మధ్య 1.01 బిలియన్ డాలర్లుగా ఉంది. వచ్చే దశాబ్దంలో ఈ పెట్టుబడులు 25 బిలయన్ డాలర్ల స్థాయికి చేరుకుంటాయని, కొత్తగా మరో 935 విమానాలు అవసరమవుతాయని, ట్రాఫిక్ 13 శాతం మేరకు పెరగగలదని ఒక అంచనా. ఇవన్నీ మరింత ఎక్కువ మంది విమానయానం పట్ల ఆసక్తి చూపడానికి కారణమవుతుంది.

-జి.పార్వతీశం

ఇది రాజకీయ బడ్జెట్ !

ఆర్థికమంత్రి జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాగుందనే వారు కొందరైతే.. పెదవి విరిచేవారు మరికొందరు. ఇది రాజకీయ బడ్జెట్ అనేవారు మరికొందరు. మొత్తానికి మిశ్రమ స్పందన లభించింది.

ఓవరాల్ గా ఓకే కానీ..!

-డాక్టర్ పి. వేణుగోపాల్ రెడ్డి, రాజకీయ విశ్లేషకులు



కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లి ప్రవేశ పెట్టిన బడ్జెట్ జాతీయ స్థాయిలో చూస్తే ఓవరాల్‌గా ఓకే అనిపిస్తుంది కానీ...రాజకీయంగా, రాష్ట్రాల వారిగా చూసినప్పుడు నిరాశ పరిచిందన్నారు రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పి.వేణుగోపాల్ రెడ్డి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో చూసినప్పుడు ఆరోగ్యం, మహిళలు, గ్రామీణ భారతానికి కేటాయింపులు భాగానే ఉన్నాయన్నారు. కాని ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కర్నాటకకు , శివసేన దూరం కావడంతో రాజకీయ లబ్ధికోసం మహారాష్ట్రకు కేటాయింపులు వేలకోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. అంతేకాదు బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు సైతం కంటితుడుపు కేటాయింపులే జరిగాయన్నారు. కేవలం దేశంలో తమ ఆదిపత్యం పెంచుకునే దిశలో బటకు కనిపించకుండా బీజేపీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిన వైనం గమనించాలన్నారు. చివరకు తమ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రా లకు సరైన న్యాయంజరగలేదన్నారు. ఇక తెలుగు రాష్ట్రా ల విషయానికి వస్తే.. పోలవరం, అమరావతి మాటేంటని ప్రశ్నించారు. టీడీపీ బీజేపీకి మిత్రపక్షంగానే ఉంది. అయినా కేటాయింపుల్లో శీతకన్ను వేశారన్నారు.తెలంగాణలో రేల్వే ప్రాజెక్టులకు అరకొర కేటాయింపులే జరిగాయన్నాయన్నారు. మిషన్ కాకతీయ, మిషన్‌భగీరథ లాంటి పథకాలు కేంద్రం ప్రోత్సహిస్తూనే ఎందుకు వాటిని విస్మరించారో అర్థంచేసుకుంటే..... ఇది రాజకీయ బడ్జెట్ అని చెప్పక తప్పదన్నారు.

నిరాశ పరిచింది

-సోల్కా రెడ్డి, ఐటీ నిపుణులు

డిజిటల్ భారతం అంటూ కేంద్రం ఊదరగొడుతున్నా ఐటీ రంగాన్ని కూడా కేంద్ర బడ్జెట్ నిరాశ పరిచిందని ఐటీ నిపుణులు సోల్కారెడ్డి అభిప్రా యపడ్డారు. అంతేకాదు ఓవరాల్‌గా చూసినా బడ్జెట్ నిరాశ పరిచిందని చెప్పారు. ఆరోగ్యం, మహిళలు,గ్రామాలకు మేలు జరిగేవిదంగా కేటాయిం పులు ఉన్నా...అది ఆచరణలోకి వస్తుందో చూడాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లకు బడ్జెట్‌లో జైట్లీ మొండిచేయి చూపారన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రా లకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండాల్సిన కేంద్రం, తన బాధ్యతల నుంచి పక్కకు తప్పుకుందన్న విషయం బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు బడ్జెట్ కాబట్టి ..దీనిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కాని వారి ఆశలు అడియాసలయ్యాయన్నారు.

ఇది ప్రజల బడ్జెట్

-భూపతి రెడ్డి, టీచర్

కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని, అన్ని రంగాల ప్రజలను తృప్తి పరిచేబడ్జెట్ అని ప్రభుత్వ ఉపాధ్యాయులు భూపతి రెడ్డి అభిప్రాయ పడ్డారు. రాజకీయంగా ఆలోచిస్తే తప్ప ఇది ..నిష్పాక్షికంగా విశ్లేషిస్తే ఇది ప్రజల బడ్జెట్ అన్నారు. రైతులను బలోపేతం చేసే దిశలో క్లస్టర్ విధానం ప్రకటించారని, మహిళల సాధికారత కోసం ముద్రాయోజనకు 3లక్షల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. దేశంలో పేదలు ఆరోగ్యం విషయంలో పడుతున్న కష్టాలను దూరం చేసేందుకే జాతీయ ఆరోగ్య పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయ మార్కెట్లు, గ్రామీణ రోడ్లు,జాతీయ జీవనోపాధి..ఇలా అన్ని రంగాలకు సముచితమైన కేటాయింపులు జరిగాయని చెప్పారు.

బడ్జెట్ మాటున రాజకీయ ప్రయోజనం!

-రత్న అవుతు, రియల్టర్

కేంద్ర బడ్జెట్ అన్ని రంగాల ప్రజలను నిరాశ పరిచిందని రియల్టర్ రత్న అవుతు అన్నారు. బడ్జెట్ వెనుక దాగిన రాజకీయ కోణం బయటపడకుండానే ఆరోగ్యం, మహిళలకు ఆకర్షణీ యంగా కేటాయింపులు చేశారన్నారు. ఉద్యోగులను పూర్తిగా విస్మరించారని, గతంలో చేశాం అనే మాటతో ఆర్థిక మంత్రి జైట్లి, వారికి తీరని అన్యాయం చేశారన్నారు. అసలు గతంలో ఏం చేశారో చెప్పలేదన్నారు. బడ్జెట్లో పారదర్శకత కూడా లోపించిం దన్నారు. ఇంత పేలవమైన బడ్జెట్‌ను తానెప్పుడూ చూడలేదన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు మొక్కుబడి కేటాయింపులు జరిగాయన్నారు. జాతీయ హోదా ఉన్న పోలవరం ప్రాజెక్టును విస్మరించడం అన్యాయ మన్నారు. ఇక మహిళలకు కేటాయింపులు బాగానే ఉన్నా...బడ్జెట్ తీరుచూస్తుంటే ఖర్చుచేస్తారా?... అనే సందేహం కల్గుతుందన్నారు. ఇందులో చెప్పుకోవాల్సింది ఒక్క జాతీయ ఆరోగ్య పథకమేనని చెప్పారు.





నయా భారత్‌కు 'జై'ట్లీ

మేక్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్న విషయాలకి ప్రాతినిధ్యం ఇచ్చి ఇప్పటివరకు ఎన్డీయే కూటమి బడ్జెట్‌లు సమర్పించింది. 2018 బడ్జెట్ 'న్యూ ఇండియాని' సాధించే దిశగా తయారుచేశారు.

సమతుల అభివృద్ధిపై దృష్టిపెట్టారు. రైతులు, బడుగువర్గాలు, వెనకబడిన తరగతుల వారి కష్టాలు తొలగేలా రూపొందించారు. రైతులకు పెట్టుబడి పై మూడు రెట్లు లాభం వచ్చేలా వ్యవసాయ మార్కెట్లో భారీగా పెట్టుబడులు ప్రకటించారు. నీటిపారుదల ప్రాజెక్టులు, పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు మరింత లబ్దిని అందించనుంది. నూతన జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం, 50 కోట్ల మందికి సాలీనా 5 లక్షల వరకు ఆరోగ్య రక్షణ భీమా కల్పిస్తుంది.

బడ్జెట్ 2018 కోసం ప్రతి వర్గం, ప్రతి సెక్టర్, ప్రతి అస్సెస్సీ ఎన్నో కోరికలు, ఆశలు పెట్టుకున్నారు. ఇది ఎన్డీయే కూటమి ప్రవేశపెట్టే ఆఖరి బడ్జెట్. లోక్‌సభ ఎన్నికలు మరియు అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముందుండడం వలన ఆర్థిక మంత్రి అన్ని వర్గాల వారికి నోరు తీపి చేశారు. మనదేశం పురోగమించాలంటే, అభివృద్ధి చెందాలంటే దేశంలో ఉన్న అధిక సంఖ్యాకులైనటువంటి రైతాంగం, బలహీన వర్గాలను మరియు గ్రామీణులను ఆర్థికపరంగా, సామాజికంగా అభివృద్ధి పరచాలి. అప్పుడే దేశం ఆర్థిక సమతుల్యత సాధించి మిగిలిన రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. మోడీ ప్రభుత్వం యొక్క సబకా సాత్ సబ్‌కా వికాస్ అన్న నినాదం 2014లో శ్రీకారం చుట్టుకొన్నా ఈ బడ్జెట్ ద్వారా కార్యరూపం దాల్చింది. అసలు 2018 బడ్జెట్ 2014లోనో 2015లోనో ప్రవేశపెట్టి ఉంటే పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ అమలు కన్నా ముందు వచ్చి ఉంటే పరిస్థితి వేరేగా ఉండేది. రైతుల ఆత్మహత్యలుండేవి కావు. వ్యవసాయోత్పాదన పెరిగి స్థూల దేశీయ ఉత్పత్తిలో వ్యవసాయం, మత్స్య, పాడి పరిశ్రమ వాటా పెరిగేది. అధిక దిగుబడి పొంది, పెట్టిన పెట్టుబడుల కన్నా ఎక్కువ లాభం రావాలంటే, అన్నదాతల ప్రాథమిక అవసరాలు తీరాలి. రుణాలు కౌలుదారులకు కూడా దొరకాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సహజ మరియు సాంకేతిక వనరులు వంటివి కల్పించాలి. 1950లో నాడు దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం 50శాతం తోడ్పడడం వలన వ్యవసాయ రంగంలో ఉపాధి 80శాతం కనిపించేది. ఈరోజు జిడిపిలో వ్యవసాయం 15 వాటా శాతం మాత్రమే. ఉపాధి 55శాతంకి గణనీయంగా తగ్గింది. వ్యవసాయ రంగ వేతనాలు అత్యల్ప స్థాయికి పడిపోయాయి. దేశంలో 50 నుండి 60శాతం వ్యవసాయ గృహాల ఆదాయం దారిద్ర్య రేఖ కన్నా దిగువున ఉన్నది. 50శాతం వ్యవసాయ రుణాల సగటు 50000 తెలుగు రాష్ట్రాల్లో 90శాతం రైతన్నలు సగటున 1.20 లక్షల రుణంతో సతమవుతున్నారు.

ఇది ఒకరకంగా నిర్మాణాత్మకమయిన బడ్జెట్, రైతాంగం మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం మరియు విద్యపై కేంద్రీకృతమై అమలుపరిచిన బడ్జెట్. ఇది ప్రజా బడ్జెట్ కాదు. ఎన్నికల బడ్జెట్ అంతకన్నా కాదు. దేశానికి ఓ కొత్త దిశకు మార్గదర్శకత్వంతో మరియు కొత్త దశకు పునాదిలాంటిది ఈ బడ్జెట్.

ఈసారి బడ్జెట్‌లో ఆదాయం పన్ను రేట్లు, స్లాబుల్లో మార్పు ఉంటుందనే అంచనాలు తలక్రిందులయ్యాయి. మధ్యతరగతి, వేతన వర్గాల వారికి నిరాశ మిగిలింది. ఒక చేత్తో స్టాండర్డ్‌డిడక్షన్ 40వేలు ఇచ్చినట్టే ఇచ్చి మరో చేత్తే ప్రస్తుతం ఉన్న కన్వేయన్స్, అలవన్స్ 19200 మరియు మెడికల్ అలవన్స్ 15000 లాగేసుకొన్నారు. చివరికి ఈ బడ్జెట్ ద్వారా వేతన వర్గాల వారికి మిగిలింది 5800పై పన్ను మినహాయింపు. బడ్జెట్లో వ్యవసాయం, ఆరోగ్యం ఇత్యాది వాటికి పెద్ద పీట వేసినా మిగిలిన కీలక రంగాలు పర్యావరణం, కాలుష్యం, నదుల శుభ్రత, కోట్లాది అదనపు మరుగుదొడ్లు, కొత్త రైళ్లు, లైన్లు, ఆధునిక భోగీలు, రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, వెనకబడిన వర్గాలకు ఇళ్లు నిర్మాణం మరియు నూతన ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయడం, ఉన్నత విద్యలకు కోసం ఆర్థిక సహాయం అందించడం వంటివి కూడా ఉన్నాయి.

భారతదేశంలో 70 శాతం ప్రజల ఆదాయం రోజుకి 60రూ.కన్నా తక్కువ. కానీ ఆరోగ్యంపై ఖర్చు చేయాలంటే కోటీశ్వర్లకి, కూటికి లేనివారికి ఒకటే ఖర్చు. దేశంలో ప్రతి మనిషి తన ఆదాయంలో సగటున 10శాతం వైద్యం (మందులు మరియు ఆసుపత్రులు, లాబ్ పరీక్షలు)పై ఖర్చు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం 50 కోట్ల మంది లబ్ధిదారులకు 5 లక్షల వరకు ఆరోగ్య బీమా రక్షణను అందజేయడం అభినందనీయం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ నిధుల చేత ఆరంభించిన ఆరోగ్య సంరక్షణా పథకం అవుతుంది. కాకపోతే ఆరంభ శూరత్వం లేకుండా నిధులు సమకూర్చి అత్యంత వేగంతో విజయవంతంగా అమలుపరిచినప్పుడే ఈ పథకం నుంచి లబ్ది పొందగలరు. వైద్యో నారాయణో హరి అంటూ దేశవ్యాప్తంగా 24 కొత్త మెడికల్ కాలేజీలను స్థాపించటం మెడిసిన్ చదవాలనుకొంటున్న విద్యార్థుల ఆశలకు ఊపిరి పోసినట్లుంది. అసలే డాక్టర్ల కొరత మరియు తక్కువ మెడికల్ కాలేజీలు ఉన్న మనదేశంలో సకాలంలో ఈనిర్ణయం వైద్యరంగానికి ఎంతో మేలు.

బ్లాక్ బోర్డ్‌ల నుంచి డిజిటల్ బోర్డులు, విద్యావిధానంలో సాంకేతిక అభివృద్ధి సాధించడం కోసం నిధులు కేటాయించడం మంచిదే. కానీ ప్రాథమిక విద్యలో డ్రాప్‌ఔట్స్ శాతం ఎక్కువయినందున, అందులోనూ బాలికల శాతం హెచ్చు ఉన్న దరిమిలా ప్రాథమిక విద్య నాణ్యతను, అవకాశాలు మెరుగుపరిచేందుకు బడ్జెట్లో చోటు కల్పించకపోవడం విచారకరం.

మొబైల్ ఫోన్ల దిగుమతి నిరుత్సాహ పరచడానికి మేక్ ఇండియా పథకాలను ఉత్తేజపరచి ఉద్యోగావకాశాలు పెంపొందించడమే ధ్యేయంగా ఈ బడ్జెట్లో మొబైల్ ఫోన్లు మరియు వాటి విడి భాగాలపై మరో 5శాతం దిగుమతి సుంకం వడ్డించారు. 2017లో 10శాతం విధించి మళ్లీ మొన్న డిసెంబర్లో 15శాతంకి పెంచారు. ఈ బడ్జెట్లో అది కాస్తా 20 శాతానికి పెరిగింది. ఒక పక్క మేక్ ఇన్ ఇండియాకి ప్రాధాన్యత ఇస్తూ మరో పక్క డిజిటల్ ఇండియా కల సాకారం కోసం భారత నెట్ పథకం ద్వారా లక్షన్నర గ్రామాలను అనుసంధానం చేయడానికి యోచన లక్ష్యపూరితమైనది.

2006లో కనుమరుగైన దీర్ఘకాలిక పెట్టుబడుల లాభార్జన పై పన్నుకు ఈ బడ్జెట్ మళ్లీ చోటు కల్పించింది. కాకపోతే దీర్ఘకాలికం రెండు లేదా మూడు సంవత్సరాలకు బదులుగా ఒక సంవత్సరంగా పరిగణిస్తారు. స్టాక్ ఎక్స్చేంజీల నుంచి కొనుగోలు చేసిన షేర్లపై లాభం ఒక లక్షపై ఎక్కువుంటే 20శాతం పన్ను కట్టాలి. మరో పక్క లాభంతో అమ్మినా లేకపోయినా కొన్నప్పుడు, అమ్మినప్పుడు సెక్యూరిటీ ట్రాన్సక్షన్ టాక్స్ కూడా కట్టాలి. ఇది తొలగించి ఉంటే చిన్న మదుపర్లకు ప్రోత్సాహకంగా ఉండేది. లాంగ్ టర్మ్ కేపిటల్ గైన్ పై టాక్స్ విధించడం వలన తాత్కాలికంగా విదేశీ మదుపర్లపై ప్రభావం ఉండినా దీర్ఘకాలంలో స్టాక్ మార్కెట్‌కి పెద్ద తేడా ఉండదు. కాకపోతే మారిషన్ వంటి దేశాల్లో స్థాపించబడ్డ షెల్ కంపెనీలపై ఈ నిర్ణయం ప్రభావం చూపిస్తుంది. విదేశీ మదుపర్లను కొన్ని రోజులు మార్కెట్‌కి దూరం చెయ్యొచ్చు. లాభంపై పరిమితి లేకుండా ఇప్పుడు షార్ట్ టర్మ్ కాపిటల్ గైన్ కూడా 15శాతం ఉన్నది. ద్రవ్య లోటు అంచనాలు 3.2 నుంచి 3.5కి పెంచడం బాండ్ మార్కెట్‌ను చిన్నగా నిరుత్సాహ పరుస్తుంది. 250 కోట్ల అమ్మకాలు కలిగిన కంపెనీలుకు ఐదు శాతం కార్పొరేట్ టాక్స్ తగ్గించడం చిన్న కంపెనీలకు ప్రాణవాయువు లాంటిది. ఇది వాస్తవికత, ఉత్పాదకత మరియు లాభదాయకతను పెంచుతుంది.

దాదాపు 12 రాష్ట్రాలు అసెంబ్లీ ఎన్నికల తరుణంలో రాష్ట్రాలకు కొత్తగా ప్రత్యేక ప్యాకేజీలు కల్పించనందున ఇది ముమ్మాటికి ఎన్నికల బడ్జెట్ కాదు. ప్రగతిపథంకి వేసిన బీజం ఈ బడ్జెట్.

వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగవృద్ధి మరియు ఉద్యోగాల సృష్టి, గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనాభివృద్ధి వంటి అంశాలపై 2018 బడ్జెట్ కేంద్రీకృతమైంది.

-సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్





అందరిలోని తిక్కను

సంతృప్తిపరిచే అ!



ఇదొక తిక్క సినిమా. మన అందరిలో కాస్త తిక్క ఉంటుంది. ఆ తిక్కను సంతృప్తిపరిచేవిధంగా ఈ సినిమా ఉంటుంది అని నాని అన్నారు. హీరో నాని చిత్ర నిర్మాణరంగంలోకి ప్రవేశించి తన సమర్పణలో తీస్తున్న చిత్రం అ. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో ప్రశాంతి త్రిపిరినేని నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా వేదికపై నాని స్పందిస్తూ...నాని సినిమా చేస్తున్నాడు కదా! ఇప్పుడు సినిమాలెందుకు అన్నవారున్నారు. నిర్మాణం చేయడం ఏదేని లాభసాటిగా ఉంటుందని కూడా కొందరు అనుకున్నారేమో కానీ ఈ సినిమా నిర్మించడం వల్ల నాకు నిర్మాతలపై గౌరవం పెరిగింది. దర్శకుడు ప్రశాంత్ కథ చెప్పగానే నాకు కొత్తగా అనిపించింది. తన దగ్గర నిర్మాతలు లేరనిపించింది. ఈ కథను సరిగ్గా హ్యాండిల్ చేసే నిర్మాత కావాలనిపించింది. ఒక మంచి నిర్మాతనిస్తాను. నువ్వు తొందరపడొద్దు అని తనకి చెప్పాను. ఇద్దరు, ముగ్గురు పేర్లు అనుకున్నాం. వారికి చెప్పే ధైర్యం నేనే చేయలేకపోయాను. కథ బాగా నచ్చింది కాబట్టి ప్రశాంత్ దగ్గరకు వెళ్లి నేనే నిర్మిస్తానని చెప్పాను. ఈరోజు వరకు నేను సినిమాలోనే సంపాదించాను. ఈ మొత్తాన్ని సినిమాపై పెట్టడానికి నేను రెడీ. ఇలాంటి ఐడియాను నేను సపోర్ట్ చేయకపోతే మంచి కథలు తెలుగులో రావనిపించి నేనే సినిమాకు నిర్మాతగా మారాను. ఇక ఈ సినిమాలో నటించిన టీమ్ గురించి చెప్పాలంటే...నిత్యా నటించడం ఆనందంగా ఉంది. తన పాత్ర చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. అలాంటి పాత్రను ఎవరూ రివీల్ చేయరు. నేను అనుకున్నట్లుగానే ప్రియదర్శి తన పాత్రలో అద్భుతంగా సూట్ అయ్యాడు. రెజీనా గురించి చెప్పాలంటే...పాత్ర కోసం హెయిర్ స్టైల్‌నే మార్చేసింది. ఈషా అందమైన పాత్రలో మెప్పించింది. ఇక రవి అన్న (రవితేజ) కథ విని, వాయిస్ ఓవర్ ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇక ప్రశాంత్ కథ అనుకున్నప్పుడే కాజల్‌ను ఈ సినిమా కోసం అనుకున్నాడు. అవసరాల శ్రీనివాస్ నేను అనుకున్న పాత్రకు అన్నివిధాల సూటయ్యాడు. దర్శకుడు ప్రశాంత్ సినిమా చేసిన విధానం చూస్తే..ఇది తన తొలి సినిమా అంటే ఎవరూ నమ్మరు. ఇలాంటి డైరెక్టర్‌ని నేను పరిచయం చేస్తున్నానని గర్వంగా ఉంది. సినిమా మొన్ననే చూశాను. కార్తీక్ ప్రతీఫ్రేమ్‌లో అందరినీ డామినేట్ చేస్తాడు అని అన్నారు.

అతిథి ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ, ట్రైలర్ చూసిన వెంటనే ఈ సినిమా చూడాలనే ఆసక్తి ఏర్పడింది. నాని వరుస హిట్స్ కొట్టేస్తున్నాడు. నాని సినిమా అంటే తప్పనిసరిగా హిట్ అనే భావన అందరిలో కలిగింది. దీన్ని దాటి అతను మరో మెట్టు పైకి వెళ్లాలని కోరుకున్నాను. ఈ సినిమాలో నటించిన అందరిని చూస్తుంటే చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. తప్పకుండా ఈ చిత్రం ట్రెండ్ సెట్టర్ అవుతుందన్న నమ్మకం కలిగింది అని అన్నారు. దర్శకుడు ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ, ఈ సినిమాను ఏదో చిన్నగా చేద్దామని అనుకున్నాను. కానీ నానిగారు నిర్మాత కావడంతో సినిమా చాలా పెద్దదైంది. నానిగారు ఎక్కువగా ఇన్‌వాల్వ్ అయిపోతారని చాలా భయపెట్టారు. కానీ ఆయన నా వర్క్‌లో ఇన్‌వాల్వ్ కాలేదు. బెటర్‌మెంట్ కోసం కొన్ని సలహాలిచ్చారంతే. ఇదొక నిజాయితీతో కూడిన ప్రయత్నం. సినిమా ఫిబ్రవరి 16న విడుదలవుతుంది. ఈ కార్యక్రమంలో అనుష్క, కాజల్, నిత్యామీనన్, రెజీనా, ఈషా, ఎం.ఎం.కీరవాణి, శ్రీనివాస్ అవసరాల, ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.



హార్వర్డ్‌లో కమల్ ప్రసంగం

ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కమల్ ప్రసంగించబోతున్నారు. కమల్ హార్వర్డ్ అతిథిగా వెళ్లడం ఇది రెండోసారి. రెండేళ్ల కిందట హార్వర్డ్ లో మాట్లాడారు కమల్. అప్పుడు విశ్వరూపం విడుదల అడ్డంకుల నేపథ్యంలో వాక్ స్వాతంత్ర్యం గురించి ఈ దిగ్గజ నటుడు మాట్లాడగా...ఈ సారి ఆయన ప్రసంగంలో రాజకీయాల చర్చ ఉంటుందని తెలుస్తోంది. రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఇటీవల ప్రకటించిన కమల్...పార్టీ సంస్థాగత ఏర్పాట్లలో తల మునకలయ్యారు. ఈలోగా హార్వర్డ్‌కు అతిథిగా రావలంటూ పిలుపొచ్చింది. ఈ నెల 10న ఆయన విశ్వవిద్యాలయంలో మాట్లాడబోతున్నారు. ఈ విషయంపై కమల్ స్పందిస్తూ.....రాజకీయాలపైనే నా ప్రసంగం ఉంటుంది. ముఖ్యంగా తమిళనాట పరిస్థితులను హార్వర్డ్ వేదికగా అందరికీ తెలియజేస్తాను. అట్టడుగున చేరిన నా రాష్ట్రం బాగుండాలని కోరుకోవడం అక్కడి వ్యక్తిగా నా బాధ్యత. రాష్ట్రం బాగుంటే..దేశ అభివృద్ధికి కారణవుతుంది. ఇది పరోక్షంగా జాతీయభావనే. హార్వర్డ్ లాంటి వేదికను మరోసారి పంచుకోవడం సంతోషంగా ఉంది. భావజాలం కలిసిన వాళ్లతో ఐక్యంగా పనిచేస్తాను. అని చెప్పారు. తన రాజకీయ లక్ష్యాలు, విధానాలు ప్రజలకు తెలిపేందుకు కమల్ హాసన్ త్వరలో తమిళనాడు అంతటా పర్యటించనున్నారు. గతంలో ఆర్ మాధవన్, పవన్ కళ్యాణ్ హార్వర్డ్‌లో ప్రసంగించే గౌరవం పొందారు.



'తొలిప్రేమ'లో వరుణ్‌తేజ్, రాశీఖన్నా



పూజాహెగ్డే

కాలేజీ రోజులు గుర్తుకు తెచ్చే కిర్రాక్ పార్టీ



నిఖిల్, సిమ్రన్ పరీన్జా, సంయుక్తా హెగ్డే నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం కిర్రాక్ పార్టీ. ఏటీవీ సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై షరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం టీజింగ్ ట్రైలర్ హైదరాబాద్‌లో విడుదలైంది. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన దర్శకుడు తేజ ట్రైలర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ, టీజర్ చాలాబావుంది. ఇంకోసారి చూడాలనిపించింది. గడ్డంతోనూ, మామూలుగానూ నిఖిల్ బావున్నాడు. నిఖిల్ ఫ్రెండ్స్ అంతా సహజంగా కనిపించారు అని అన్నారు. మరో అతిథి సుధీర్‌వర్మ మాట్లాడుతూ, ఈ సినిమా దర్శకుడు నా దగ్గర, చందు మొండేటి దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. కష్టపడే వ్యక్తి. సినిమాను చాలాబాగా తెరకెక్కించాడు అని చెప్పారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ, నువ్వు నేను, జయం సినిమాలను క్లాస్‌లకు బంక్ కొట్టి మరీ నేను చూశాను. కాలేజీ నేపథ్యంలో హ్యాపీడేస్ చేశాను. ఆ తర్వాత చేస్తున్న సినిమా ఇదే. ఇందులో నేను హీరో కాదు. కాలేజీలో ఒక కుర్రాడిగా కనిపిస్తాను. నాతో పాటు తొమ్మిది మంది ఉంటారు. ప్రతీఒక్కరికీ తమ కాలేజీ రోజులను గుర్తు చేసే చిత్రమిది. మా సినిమా షూటింగ్ పూర్తయిన చివరిరోజు ఏడ్చాం. సినిమాను అతి త్వరలో విడుదలచేస్తాం అని చెప్పారు.

దర్శకుడు మాట్లాడుతూ, కన్నడంలో పెద్ద విజయం సాధించిన చిత్రమిది. మనకు తగ్గట్టు కథను మలిచాం. బాగా ఆడుతుందనే నమ్మకం ఉంది అని అన్నారు. సిమ్రన్ మాట్లాడుతూ, కాలేజీ నేపథ్యం అనగానే చాలాబాగా కనెక్ట్ అయ్యాను అని అన్నారు. సంయుక్త మాట్లాడుతూ, కన్నడంలో ఈ సినిమా చేశాను. తెలుగులోనూ చేయడం ఆనందంగా ఉంది. అందరూ బాగా సపోర్ట్ చేశారు. డబ్బింగ్ కూడా చెప్పాను అని అన్నారు. నటుడు, గీత రచయిత రాకేందుమౌళి మాట్లాడుతూ, ఇందులో నాలుగు పాటలు రాశాను. నిఖిల్ కృష్ణగా కనిపిస్తే...నేను అర్జునుడిగా కనిపించాను అని అన్నారు.

ఈ చిత్రానికి మాటలు: చందు మొండేటి, స్క్రీన్‌ప్లే: సుధీర్‌వర్మ, కెమెరా: అద్వైత గురుమూర్తి, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిరణ్ గరికిపాటి, సహ నిర్మాతలు: అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్.

ప్రిన్స్ సరసన ఛాన్స్

ఇప్పుడిప్పుడే పూజాహెగ్డేకు అవకాశాలు వరుస కడుతున్నాయి. లోగడ ఒక లైలాకోసం, ముకుంద సినిమాలపై ఆమె పెట్టుకున్న ఆశలు ఫలించకపోయినా దువ్వాడ జగన్నాథమ్ చిత్రం నూతనోత్సాహాన్నిచ్చింది. దానికిముందు బాలీవుడ్‌లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. మొహెంజోదరో చిత్రం తర్వాత సల్మాన్‌ఖాన్ నటిస్తున్న రేస్-3 చిత్రంలో ఆమెను అవకాశం వరించింది. ఓ వైపు బాలీవుడ్ చిత్రాలు చేస్తూనే తెలుగు చిత్రాలపై కూడా దృష్టి నిలిపింది. డి.జె. తర్వాత తెలుగులో ఆమె నటిస్తున్న సాక్ష్యం చిత్రం నిర్మాణం తుది దశకు చేరుకుంది. రామ్‌చరణ్, సుకుమార్‌ల కలయికలో తెరకెక్కుతున్న రంగస్థలంలో ఓ ప్రత్యేక పాటలో నర్తించింది. ఇలా ఇలా ముందుకు సాగుతున్న ఆమెకు ఇప్పుడు ఓ లక్కీఛాన్స్ తగిలింది. మహేష్‌బాబు కథానాయకుడిగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో కథానాయికగా నటించే అవకాశం ఆమెకు లభించింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం ఏప్రిల్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో పూజ తన ఆనందాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ...అందరం కలిసి ఓ మంచి సినిమాను అందించేందుకు సిద్ధమవుతున్నాం అంటూ పేర్కొన్నారు. దీనికి వంశీ పైడిపల్లి కూడా ప్రతిస్పందిస్తూ...పూజతో ఈ సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు.



పసందైన ప్రేమకథతో

హౌరాబ్రిడ్జి

రాహుల్ రవీంద్రన్, చాందినిచౌదరి, మనాలీరాథోడ్ హీరోహీరోయిన్లుగా రేవన్ యాదు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం హౌరాబ్రిడ్జ్. ఈఎంవీఈ స్టూడియోస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదలచేశారు. అతిథులుగా విచ్చేసిన నారా రోహిత్ ఆడియో సీడీలను విడుదలచేసి, తొలి సీడీని ఆంధ్రప్రదేశ్ మంత్రి పత్తిపాటి పుల్లారావుకు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, మంచికథతో రూపుదిద్దుకున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. నారా రోహిత్ మాట్లాడుతూ, శేఖర్‌చంద్ర సంగీతం వీనులవిందుగా ఉంది. చరణ్‌గారికి నిర్మాతగా ఇది తొలి చిత్రం. సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నా అని అన్నారు. నవీన్‌చంద్ర మాట్లాడుతూ, రాహుల్ నా హృదయానికి దగ్గరైన వ్యక్తి. నిర్మాతలు సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నారు. పాటలు చాలా బావున్నాయి అని అన్నారు. నిఖిల్ మాట్లాడుతూ, కథను నమ్మి, నిర్మాతలు సినిమాను ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. రాహుల్ నటుడు, దర్శకుడిగా కూడా పేరు తెచ్చుకోవాలి అని అన్నారు. చిత్ర హీరో రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ, సినిమా చాలాబాగా వచ్చింది. దర్శకుడు మంచి హుందాతనం ఉన్న పాత్రను నాకు ఇచ్చారు. హీరోయిన్లు ఇద్దరూ తమ పాత్రల్లో చాలాబాగా నటించారు. విజయ్‌మిశ్రా కెమెరా పనితనం, శేఖర్‌చంద్ర సంగీతం హైలైట్‌గా నిలుస్తాయి అని అన్నారు.

దర్శకుడు రేవన్ యాదు మాట్లాడుతూ, దర్శకుడిగా నాకిది రెండో చిత్రం. సినిమా ఇంత బాగా రావడానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతగానో సహకరించారు. మంచి నేపథ్య సంగీతం కుదిరింది అని అన్నారు. హీరోయిన్ చాందినిచౌదరి మాట్లాడుతూ, ఈ సినిమాలో నటించడం వల్ల నటిగా చాలా విషయాలు నేర్చుకున్నానని అన్నారు. రాహుల్ నిజాయితీగా నటిస్తాడు. తనతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. చక్కటి ప్రేమకథాంశంతో ఈ చిత్రం రూపొందింది అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, రాజారవీంద్ర, సాయికార్తీక్, లలిత్‌చరణ్, శేఖర్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల విధానాలపై సమావేశమైన దక్షిణాది ఫిల్మ్ ఛాంబర్స్

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు అధికంగా వసూలు చేస్తున్న చార్జీలకు వ్యతిరేకంగా నిర్మాతల నుండి తీవ్రవ్యతిరేకత ఎదురవుతోంది. ఇతర రాష్ట్రాల కంటే అత్యధికంగా ఛార్జీలు తీసుకుంటున్న తీరుపై చాలాకాలంగా నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ ప్రొవైడర్లను కట్టడి చేయాలనే ప్రయత్నాలు తీవ్రంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అత్యవసర సమావేశం జరిగింది. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షులు పి.కిరణ్, సెక్రటరీలు ఎమ్.రామదాసు, కె.శివప్రసాదరావు, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు కె.మురళీమోహన్, సెక్రటరీ సునీల్ నారంగ్, దక్షిణాది ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు ఎల్. సురేష్, జాయింట్ సెక్రటరీ రవి కొట్టరాకర, తమిళ సినిమా నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్ కృష్ణ, కర్ణాటక ఫిలిం ఛాంబర్ సెక్టరీ ఎన్.ఎమ్. సురేష్, కేరళ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, డిస్ట్రిబ్యూషన్ ఛాంబర్ సెక్రటరీ ఎన్.ఎమ్. సురేష్, కేరళ ఫిలిం నిర్మాతల సంఘం అధ్యక్షులు జి.సురేష్‌కుమార్ ఇంకా మరికొందరు నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు సమావేశమయ్యారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో అత్యవసర సమావేశమై చర్చించారు. మన సినిమాల ప్రతిఫలం మనకు చెందకుండా డిజిటల్ ప్రొవైడర్లకు చెందడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడనుంచో వచ్చిన ప్రొవైడర్లు అన్యాయంగా దోచుకుంటున్నారని ఆవేదన చెందారు. ప్రొవైడర్లు ఈస్ట్ ఇండియా కంపెనీలా తయారయ్యారని, అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సమావేశమైన అందరూ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న డిజిటల్ ప్రొవైడర్లను రాకుండా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ ప్రొవైడర్లతో ఒకవారంలోగా సమావేశం ఏర్పాటుచేసి వెంటనే ధరలు తగ్గించేలా చర్చించాలని సమావేశం నిర్ణయం తీసుకంది. వారంలోగా సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో మార్చి ఒకటవ తేదీ నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని థియేటర్లను మూసివేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలుగు చలనచిత్ర పరిశ్రమ వాణిజ్య మండలి అధ్యక్ష కార్యదర్శులు పి.కిరణ్, ఎం.రాందాస్, కె.శివప్రసాదరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో ఇంకా డి.సురేష్‌బాబు, శ్యామ్ ప్రసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

